మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**గద్వాల ప్రతినిధి,మే 10 ప్రభాతవార్త :** ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం గద్వాల మండలం అనంతపూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే రైతులు అకాల వర్షాలతో తల్లడిల్లుతున్నారని, ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని, తేమశాతం కొంత అటు ఇటు ఉన్న తూకం వేయాలని అన్నారు. రైతులు కూడా ప్యాడిక్లీనర్ల ధాన్యం తూర్పార బట్టి తాలు లేకుండా నాణ్యమైన ధాన్యం కేంద్రాలకు తెచ్చి ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన గన్నీ సంచులు, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని, నిర్వాహకులకు సూచించారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వరి కొనుగోలు జరగాలని, రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగింగ్ చేసిన రైస్‌మిల్లులకు వెంట వెంటనే తరలిస్తూ మిల్లర్లు కూడా 24 గంటలలోగా ధాన్యం దింపుకునేలా పర్యవేక్షించాలని, ట్యాబ్ ఎంట్రీ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 71 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 565 మెట్రిక్ టన్నుల 70 మంది రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని అన్నారు. అనంతరం అనంతపురం గ్రామ శివారు, గద్వాల శివారులో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. కలెక్టర్‌తో పాటు జిల్లా పౌరసరఫరాల అధికారి రేవతి, జిల్లా మేనేజర్ ప్రసాద్‌రావు, ఎంపిపి ప్రతాప్‌గౌడ్, తహసీల్దార్ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రంలో వరిధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్

## ధాన్యం కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ..!

**తడిసిన ధాన్యం కొని అన్నదాతకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం**

**రాజాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మే 10 ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒకటేనని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. రాజాపూర్ మండల కేంద్రంలో జిల్లాసహకార మార్కెటింగ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అకాల వర్షాలవల్ల తడిసిపోయిన రైతుల ధాన్యం కూడా కొనుగోలు చేస్తామని సిఎం కెసిఆర్ రైతులకు భరోసా ఇచ్చారని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అమలు చేస్తున్నకార్యక్రమాలు దేశంలో మరేరాష్ట్రంలోనూ అమలుకావడం లేదన్నారు.రైతుబంధు, రైతు భీమా, వ్యవసాయానికి ఉచితంగా 24గంటల కరెంటుసరఫరా,రైతు కళ్లాలలోనే ధాన్యం కొనుగోలు తది తర కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. వ్యవసాయం గతంలో ఎట్లా ఉన్నది ఇప్పుడెట్లా ఉన్నది రైతన్నలు ఒకసారి ఆలోచించి మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్ర మంలో దొండ్లపల్లి ఎంపిటిసి అభిమన్యురెడ్డి, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## పోషక విలువల పట్ల అవగాహన కల్పించాలి..

**ఉట్కూర్,మే 10 ప్రభాతవార్త :** మండల పరిధిలోని నిడుగుర్తి గ్రామంలో జిల్లా కలక్టర్ కోయ శ్రీహర్ష పోషణ లోపం ఉన్న పిల్లలు, తల్లిదండ్రులతో అంగన్‌వాడి కేంద్రంలో తక్కువ బరువుతో పుట్టిన పిల్లలు బరువు పెరుగుదల లేని పిల్లలకు పోషకాహారము గురించి తల్లిదండ్రులకు ఆరోగ్య విద్యను అందించమని ఆదేశించారు.అందులో భాగంగా అంగన్‌వాడి కేంద్రంలో తక్కువ బరువు పెరుగుదల ఉన్న పిల్లలకు పోషకాహారం గురించి ఆరోగ్య విద్యను అందించడం జరిగింది. బాలామృతం ప్లస్‌ను ప్రతి పిల్లవాడికి తినిపించాలని దానివల్ల పిల్లల పెరుగుదల,ఎదుగుదల బరు వు పెరగడం జరుగుతుందని ప్రతినెల బరువును చూడాలని ఎత్తును చూడాలని దానివల్ల వయసుకు తగ్గబరువు, పెరుగుదల జరుగుతుందో లేదా అని తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపి డిఓ కల్పన, సర్పంచ్ యశోదమ్మ, ఎంపిటిసి వీరరాఘవరెడ్డి, అంగన్‌వాడి సూపర్‌వైజర్ గీత, వైద్య సిబ్బంది,అంగన్‌వాడి టీచర్లు, పిల్లల తల్లిదండ్రులు,బాలింతలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## పోటీ పరీక్షల పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలి

**గ్రంథాలయానికి రూ.2లక్షలు విలువ చేసే పోటీ పరీక్షల పుస్తకాలు**

**అందజేసిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి**

**గద్వాల ప్రతినిధి,మే 10 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కెసిఆర్ స్టడీ సర్కిల్ ద్వారా ఎమ్మెల్యే సొంత నిధులతో తయారు చేయించిన గ్రూప్స్, ఎస్సై,పోలీస్ కానిస్టేబుల్ పోటీ పరీక్షల కోసం సిద్ధం చేసిన రూ.2 లక్షలు విలువ చేసే పుస్తకాలను జిల్లా గ్రంథాలయానికి వితరణ చేశారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా గ్రంథాలయ ఛైర్మన్, గ్రంథాలయ అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వివిధ ఉద్యోగాల కోసం అనేక నోటి ఫికేషన్లు విడుదల చేసిందని, అన వసర విషయాల జోలికి వెళ్లకుండా యువత ఏకాగ్రతతో చదివి కొలువులు సాధించాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. నియోజకవర్గంలో విద్యాబివృద్ధి కోసం చిత్తశుద్దితో పని చేస్తున్నానని తెలిపారు. అందులో భాగంగా గత ఆరేళ్లుగా కెసిఆర్ స్టడీ సర్కిల్ ద్వారా సొంతనిధులతో నాణ్యమైన ఫ్యాకల్టీ చేత వేలాదిమంది యువతకు డీఎస్సీ,గ్రూప్స్,పోలీస్ కానిస్టేబుల్ కోచింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. గ్రంథాలయానికి అందజేసే పో టీపరీక్షల పుస్తకాలను గ్రంథాలయానికి వచ్చే అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఛైర్మన్ జంబురామన్‌గౌడ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షులు చెన్నయ్య, పిఎసిఎస్ ఛైర్మన్ సుభాన్, ఎంపిపి విజయ్‌కుమార్, బిఆర్ఎస్ నాయకులు కురుమన్న, నరెం దర్‌రెడ్డి, శ్రీరాములు, సంటెన్న, జిల్లా గ్రంథాలయ అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలి..


**-నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 10 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ జిల్లాకు సంబంధించిన హెల్త్ సబ్ సెం టర్ డయాగ్నస్టిక్ సెంటర్ తదితర భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ తన చాంబర్‌లో హెల్త్ సెంటర్ హెల్త్ నిర్మాణాలపై సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆరో గ్యశాఖకు సంబంధించిన 107 హెల్త్ సబ్‌సెంటర్ల నిర్మాణానికి పంచాయతీరాజ్‌శాఖకు 64 టీఎస్ యం ఎస్ఐడీసీకి 21, ఐటీడీఎకు 22 సెంటర్ల నిర్మాణ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. వీటి లో ఇప్పటి వరక ఏ స్థాయిలో ఉన్నాయో సెంటర్ వారీగా సమీక్ష నిర్వహించారు. టీఎస్‌యంఐడీసీకి అప్పగించిన 21 సబ్ సెంటర్లకు గాను 10 పూర్తయ్యాయని, మిగిలిన వాటని త్వరలో పూర్తి చేస్తా మని ఈఈ సనీరుద్దిన్ వివరించారు. ఐటీడీఎకు అప్పగించిన 22 సబ్ సెంటర్లలో ఒకటి పూర్తైంద ని, మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నట్లు తెలిపారు. పంచాయతీ రాజ్‌కు అప్పగించిన 64 సబ్ సెంట ర్లలో పనులు నడుస్తున్నాయని, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి ఇస్తామని పంచాయతీ రాజ్ ఈ.ఈ దామోదర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ ఇతర డైయజ్ఞాస్టిక్ సెంటర్లు, సెంట్రల్ మెడికల్ స్టోర్, ఆర్.అండ్ ఆర్ సబ్ సెంటర్ల నిర్మాణ వివరాలు సైతం అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పను లు వేగవంతం చేయాలని అదికారులను ఆదేశించారు. పూర్తైన వాటిని స్వాధీనపర్చుకోవాలని వైద్యా ధికారిణి ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుధాకర్‌లాల్, పంచాయతీ రాజ్ ఈ.ఈ. దామోదర్, నసీరుద్దిన్ తదితరులు ఉన్నారు.



## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆల పరామర్శ

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మే 10 ప్రభాతవార్త :** భూతప్పూర్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులను దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిన్న దురదృష్టవశాత్తు మరణించిన వెంకటమ్మ, నాగమణి, ఆనంద్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. బాధిత కుటుంబ సభ్యులను పరా మర్శించి ఆర్థిక సహాయం చేసి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# కందనూలు ఫస్ట్.. పాలమూరు లాస్ట్..!



- పదో తరగతి ఫలితాలు విడుదల చేసిన విద్యాశాఖ
- టెన్త్ ఫలితాల్లోనూ అదరగొట్టిన బాలికలు
- రాష్ట్రంలో 12వ స్థానంలో నాగర్‌కర్నూల్, 32వ స్థానంలో మహబూబ్‌నగర్
- జూన్14 నుంచి 22వరకు సప్లిమెంటరీ

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే10, ప్రభాతవార్త :** ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న పదో తరగతి ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఈమేరకు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విడుదల చేశారు. ఏప్రిల్ 3 నుంచి 13వరకు పదో తరగతి పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించారు. ఆరు పేపర్లు కావడంతో అధికారులు వాల్యుయేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేశారు. గతంలో కొంత మేరకు తప్పులు దొర్లడంతో ఈ ఏడాది అధికారులు ముందస్తు చర్యలు తీసుకొని పకడ్బందీగా ప్రక్రియ నిర్వహించారు. టెన్త్ ఫలితాల్లో ఉమ్మడి పాలమూరులో నాగర్‌కర్నూల్ జిల్లా మొదటి స్థానంలో నిలువగా, మహబూబ్‌గనగర్ చివరి స్థానంలో నిలిచింది. కాగా రాష్ట్రంలో కందనూలు 90.87 శాతంతో 12వ స్థానంలో నిలువగా 71.25 శాతంతో 32వ స్థానంలో మహబూబ్‌నగర్ నిలిచింది. ఈమేరకు మహబూబ్‌నగర్ జిల్లాలో 12503 మంది పది పరీక్షలు రాయగా 8909 మంది పాసయ్యారు. పదో తరగతి ఫలితాల్లోనూ అమ్మాయిలే అదరగొట్టారు. జిల్లాలో 6175మంది బాలికలు పరీక్ష రాయగా 4657 మంది ఉత్తీర్ణత సాధించగా 75.42శాతంగా నమోదైంది.బాలురు 6328 మంది పరీక్ష రాయగా 4252 పాసయ్యారు. బాలురు 67.19శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలురతో పోలిస్తే బాలికలే అత్యధిక ఉత్తీర్ణతా శాతం సాధించి అదరగొట్టారు.జిల్లాలోని జెడ్పీ పాఠశాలల నుంచి 5303మంది పరీక్షకు హాజరుకాగా 2550 మంది ఫెయిల్ అయ్యి, 2753 మంది మాత్రమే పాసయ్యారు. దాదాపు సగానికి విద్యార్థులు ఫెయిల్ కావడం ఆందోళన కలిగిస్తున్న అంశంగా అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా రెసిడెన్షియల్‌లో 79 మంది పరీక్ష రాయగా 79మంది పాస్ కావడంతో 100శాతంగా రిజల్ట్ నమోదైంది. మొన్న విడుదలైన ఇంటర్ ఫలితాల్లోనూ బాలికలదే పైచేయి ఉండడం గమనార్హం.

### ఏడుగురికి 10/10 జీపీఏ

మహబూబ్‌నగర్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు 10/10 జీపీఏ సాధించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు. బి వైష్ణవి, చవ్వ గౌతమి, మేడి ఆకాంక్ష, సంగాల రక్షితారెడ్డి, బసిరెడ్డి ప్రవళ్లిక, కే అభినయ్ కుమార్ గౌడ్, ఎం మల్లేశ్‌కు 10జీపీఏ సాధించారు. ఈమేరకు వీరందరికీ పాఠశాల ఉపాధ్యాయ బృందం శుభాకాంక్షలు తెలిపారు. మూసాపేటకు చెందిన వైష్ణవిని 10జీపీఏ సాధించడంపై గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందించారు.



బి వైష్ణవి

**మహబూబ్‌నగర్ జిల్లాలో జెండర్ వారీగా ..**

| జెండర్ | హాజరైనవారు | ఫెయిల్ | పాస్ | శాతం |
|---|---|---|---|---|
| బాలురు | 6328 | 2076 | 4252 | 67.19 |
| బాలికలు | 6175 | 1518 | 4657 | 75.42 |
| మొత్తం | 12503 | 3594 | 8909 | 71.25 |

| హాజరైన జిల్లా | విద్యార్థుల సంఖ్య బాలురు బాలికలు | పాసైన విద్యార్థుల సంఖ్య బాలురు బాలికలు | ఉత్తీర్ణతా శాతం |
|---|---|---|---|
| నాగర్‌కర్నూల్ | 5196 – 5349 | 4660 – 4922 | 90.87 |
| వనపర్తి | 3487 – 3541 | 2750 – 3008 | 81.93 |
| జోగుళాంబగద్వాల | 3538 – 3637 | 2739 – 3051 | 80.70 |
| నారాయణపేట | 3537 – 4004 | 2552 – 3109 | 75.07 |
| మహబూబ్‌నగర్ | 6328 – 6175 | 4660 – 4922 | 71.25 |

### జూన్ 14నుంచి సప్లిమెంటరీ..

వచ్చే నెల జూన్ 14నుంచి 22 వరకు పదో తరగ తి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధి కారులు తెలిపారు. ఇందుకోసం టెన్త్ పరీక్షలు ఫె యిల్ అయినవారు రేపటి నుంచి మే26వరకు సప్లిమెంటరీ ఫీజు చెల్లించి అవకాశాన్ని సద్వినియో గం చేసుకోవాలని సూచించారు.

## త్వరలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం...

- ప్రారంభానికి సిద్ధంగా ఆక్సిజన్ ప్లాంట్
- కోట్ల రూ॥లతో ఆసుపత్రికి మౌళిక సదుపాయాల కల్పన
- రాష్ట్రంలో ప్రథమ స్థానంలో కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రి
- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**కల్వకుర్తి,మే10 ప్రభాతవార్త:**కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించినందుకు గాను ప్రథమ స్థానంలో నిలిచిందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రిని ఆయన సందర్శించారు. కల్వకుర్తి ప్రభుతా వ్యసుపత్రి వైద్యులు సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి ఏరియా ఆసుపత్రిని 50పడకల నుంచి 100పడకల ఆసుపత్రిగా అనుమతులు వచ్చాయని పేర్కొన్నారు. డయాలసిస్, బ్లడ్ బ్యాంక్, కోవిడ్ వార్డు, ఆక్సిజన్ ప్లాంట్, మార్చురీ గది, యోగా సెంటర్ తదితర విభాగాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి మున్సిపల్‌లోని సర్వే నెం.99లో 4 ఎకరాల్లో 100 పడకల నూతన ఆసుపత్రిని త్వరలో నిర్మాణం చేపడుతామన్నారు. పాత ఆసుపత్రి స్థలంలో మాత శిశు రక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రిలో సుమారు రూ.65లక్షలతో నూతనంగా నిర్మించిన ఆక్సిజన్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. త్వరలో ఆక్సిజన్ ప్లాంట్‌ను ప్రారంభిస్తామని, వాహనాల నిలుపుదలకు రూ.7.5 లక్షలు వెచ్చించి పార్కింగ్ నిర్మాణం చేపడుతామని, శవ పంచనామా గది పనులు పూర్తి చేస్తా మన్నారు.



ఆసుపత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

### వైద్యులను అభినందించిన ఎమ్మెల్యే

కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రి వైద్యులను ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ప్రత్యేకంగా అభినందించారు. గత నెలలో 136 కాన్పులు చేయడంతో గ్రేట్ అని ఆయన అన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ విజయ్‌ను అభినందించారు. సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం రోగులకు అన్ని వేలల్లో అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం డాక్టర్లు స్వర్ణలత, యశోధబాయి ఇతర డాక్టర్లను ప్రత్యేకంగా అభినందించారు. కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషన్ పథకం గొప్పదని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ శాంతకుమారి, కల్వకుర్తి మున్సిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ విజయ్‌గౌడ్, పీఎసీఎస్ ఛైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి, బన్నె శ్రీనివాస్‌యాదవ్, వెల్దండ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, వైస్ ఎంపీపీ కొండూర్ గోవర్ధన్, కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జమ్ముల శ్రీకాంత్, కౌన్సిలర్లు సూర్య ప్రకాష్‌రావు, బాలునాయక్, నూనె యాదమ్మ శ్రీనివాస్, నాయకులు బావండ్ల మధు, చెన్నకేశవులు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే.. నిరుద్యోగులారా అధైర్యపడకండి

**యువత భవితే కాంగ్రెస్ నినాదం**

**కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు జి. మధుసూదన్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ విడుదల**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మే 10 ప్రభాతవార్త :** రేపు వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, యువత అధైర్యపడొద్దని కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు జి. మధుసూదన్‌రెడ్డి తెలిపారు.యూత్ డిక్లరేషన్‌ను కాంగ్రెస్‌నాయకులు,కార్యక ర్తలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిఎంఆర్ కోరారు. మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించి, హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తరువాత లక్ష, 70వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా కెసిఆర్ చెప్పి మాట తప్పారన్నారు. ప్రస్తుతం బిస్వాల్ కమిటి నివేదిక ప్రకారం 2 లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని తెలిపారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో యువత ఆకాంక్షలు నెరవేరలేదని, తమ ఆకాంక్షలు నెరవేరక నిరుద్యోగ యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారని జిఎంఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువత ఎవరు అధైర్యపడవద్దని, వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని, ప్రభుత్వం ఏర్పాటైన మొదటి ఏడాదే 2 లక్షల కొలువుల జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తామని యువతకు భరోసా ఇచ్చారు. టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి యువత కోసం ప్రవేశపెట్టిన హైరాబాద్ యూత్ డిక్లరేషన్‌ను ప్రియాంకగాంధి ఆమోదం తెలిపారని పేర్కొన్నారు.డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అమలు చేసి యువత ఆకాంక్షలు నెరవేరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు జె. చంద్రశేఖర్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి ముకుందం, రమేష్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు అవేజ్, జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ హక్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్ పాల్గొన్నారు.




యూత్ డిక్లరేషన్‌ను విడుదల చేస్తున్న డిసిసి అధ్యక్షుడు జి. మధుసూదన్‌రెడ్డి

## మణిదీపికకు మంత్రి అభినందన..



అభినందిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే10, ప్రభాతవార్త :** ఇంటర్మీడియట్ ఫలితాల్లో జడ్చర్లకు చెందిన తోక ఫణిరాజ్ గౌడ్, సుభాషిణి దంపతుల కుమార్తె మణిదీపిక రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించడంపై ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు. ఈమేరకు హైదరాబాద్‌లోని మంత్రిక్యాంప్ కార్యాలయంలో అమ్మాయికి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. భవిష్యత్తుల్లో ఉన్నతమైన చదువులు చదివి సమాజాభి వృద్ధికి కృషిచేయాలని మంత్రి ఆకాంక్షించారు.కార్యక్రమంలో తెలంగాణరాష్ట్ర గౌడ్ సంఘంఅధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌గౌడ్,అఖిల భారత గౌడ సంఘం అధ్యక్షుడు వేములయ్య గౌడ్, కీసతర మల్లేష్ గౌడ్, కార్తీకేయ తదితరులు ఉన్నారు.

## సాగుకు ముందే ఎరువులు ముందస్తుగా నిల్వ చేసుకోవాలి:జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**నారాయణపేట ప్రతినిధి,మే 10 ప్రభాతవార్త :** వానాకాలం పంటల సాగుకు ముందే ఎరువులు ముందస్తుగా నిల్వ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం జాజాపూర్ రైతు వేదికలో ఎరువులు, విత్తన విక్రయదారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పంటల సాగుకు అవసరమైన ఎరువులను కేంద్ర ప్రభుత్వం ఇండెంట్‌కు అనుగుణంగా సరఫరా చేస్తుందని, ఆప్రకారం సహకార పరపతి సంఘాలు కూడా అవసరాన్ని బట్టి ముందస్తుగా స్థానిక వ్యవసాయ అధికారులతో సమన్వయం చేసుకుని వారం రోజులకు ముందే ఇండెంట్ సమర్పించి ముందస్తుగా సమకూర్చుకోవాలని అన్నారు. డీలర్లు అవసరాన్ని బట్టి స్టాక్ నిల్వ చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఫారం ఒలను సిద్ధం చేసుకోవాలని అన్నారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ నెలాఖరు నాటికి ఎరువులను సమకూర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎరువులు, నిత్యావసర సరుకుల చట్టం క్రిందికి వస్తాయని తెలిపారు. రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తుగా స్టాక్ చేసుకోవాలని, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంఆర్‌పి ధరలకు మాత్రమే ఎరువుల అమ్మకాలు జరపాలని, బ్లాక్ చేయకూడదని అన్నారు.అదనంగా స్టాక్ అవసరమైతే సంబంధిత వ్యవసాయ అధికారుల ద్వారా ఇండెంట్ ముందస్తుగా సమర్పించాలని తెలిపారు. డీలర్లు,సహకార సంఘాల ప్రతినిధులకు తెలియజేందుకు సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సమయానుకూలంగా ఎరువులు ప్రభుత్వ ధరకే అమ్మాలని అన్నారు.వ్యవసాయ అధికారుల సహకారంతో అవసరమైన ఇండెంట్ సమర్పించి పొందాలని, నగదు లేదా బ్యాంక్ గ్యారంటీ ద్వారా ఎరువులు సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. గత నాలుగు సంవత్సరాలుగా ఎలాంటి సమస్యలు రాకుండా సక్రమంగా ఎరువులు విక్రయించడం జరిగిందని అన్నారు. ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్షులు మాట్లాడుతూ గోదాముల నిర్మాణాలకు సహకార బ్యాంక్ రుణాలు మంజూరు చేసిందని, అవసరమైన భూమి కేటాయించాలని కోరారు. రైతులకు ప్రభుత్వ ధరలకే ఎరువులు విక్రయిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి కోదండ రాములు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నరసింహారావు, పరపతి సంఘాల అధ్యక్షులు,సీఈఓలు డీలర్లు, ఆగ్రో రైతు సేవ కేంద్రాల ప్రతినిధులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

## గజలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన


గజలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న దృశ్యం

**ఉట్కూర్,మే 10 ప్రభాతవార్త:** మండల పరిధిలోని చిన్నపొర్ల గ్రామంలో శ్రీశ్రీశ్రీ గజలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మూడు రోజుల కార్యక్రమంలో భాగ ంగా మొదటిరోజు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పండితులు విగ్రహ ప్రతిష్ఠాపనకు ముందుగా కావలసిన పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాలి రవిందర్‌రెడ్డి, గ్రామ ప్రజలు, వాకిటి శంకర్, వాకిటి గోపాల్, బాబురాం, నరసింహ, బాపురం రాజు, సంజీవ్,చపలి అమనప్ప, దమది వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థినికి సన్మానం


ఇంటర్ విద్యార్థినిని సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు

**నవాబ్‌పేట,మే 10 ప్రభాతవార్త:** ఇప్పటూర్ గ్రామానికి చెందిన సమీన్ తండ్రి గౌస్‌పాష ఇంటర్ మీడియట్ ద్వితయ సంవత్సరంలో మండల టాపర్‌గా నిలిచినందున సమీన్‌ను తండ్రి గౌస్ పాషాలను ఘనంగా సన్మా నించారు. ఈకార్యక్రమంలో ఇప్పటూర్ గ్రామ సర్పంచ్ గౌసియా అబ్దుల్లా, ఉపసర్పంచ్ దుబ్బ రవికిరణ్, రైతుబంధు సమిత కన్వీనర్ ఖాదర్, ఎంపిటిసి తనయుడు నవనీత్‌రావు,ప్రకాష్,నర్సింహారెడ్డి, మురళీధర్, నర్సింహారెడ్డి, మురళీధర్,నరేష్‌చారి, శేఖర్ పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసిన జడ్పీ చైర్‌పర్సన్

**గద్వాల ప్రతినిధి,మే 10 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పదవ తరగతి ఫలితాలను బుధవారం విడుదల చేశారు. ఈ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినీ, విద్యార్థులు,వారితల్లి దండ్రుల కు పేరు పేరున జోగులాంబ గద్వాల జడ్పి చైర్‌పర్సన్ సరిత తిరు పతయ్య శుభాకాంక్షలు తెలిపారు. చిత్తశుద్ధితో చదివి మంచి మార్కులతో రాష్ట్రంలోనే జోగులాంబ గద్వాల జిల్లాకు మంచిపేరు తీసుకురావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా పదవ తరగతి ఫలితాల్లో ఫెయిల్ అయి న విద్యార్థులు కృంగిపోకుండా మరింత పట్టుదలతో చదివి వచ్చే సప్లిమెంటరీ ఫలితాల్లో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు.తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం విద్యారంగా నికి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. సీఎం కెసిఆర్ ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పాము కాటుతో వ్యక్తి మృతి

**మల్దకల్,మే 10 ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన వెల్డింగ్ శ్రీనివాస చారి (56) పాముకాటుకు గురై మంగళ వారం రాత్రి మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపా రు. స్నేహితుని పని నిమిత్తం నంది కొట్కూరుకు వెళ్లిన శ్రీని వాసులును వ్యవసాయ పొలంలో పాముకాటు వేసిన ట్లు చికిత్స పొందుతూమృతి చెందినట్లు తెలిసింది. మృ తునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అందరితో కలిసి మెలిసి ఉండే శ్రీనివాసులు హఠాన్మరణం పట్ల పలు వురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అంత్యక్రియలు మల్దకల్‌లో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

## వైద్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా అధికారి

**ఉట్కూర్,మే 10 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రసవాలు ఎందుకు పెరగటం లేదు దానిమీద ఒక మీటింగ్ చేయండి అని అన్నారు. మీటింగ్‌కు నేను కూడా వస్తానని చెప్పారు. ఒకపక్క ప్రణాళిక రూపొందించుకోవాలని అలాగే అన్ని రకాల ఆరోగ్య కార్యక్రమాలను నూటికి నూరు శాతం లక్ష్యం సాధించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా. వంశీ,ఆరోగ్య విస్తరణ అధికారి విజయ్‌కుమార్, ఐసిడిఎ హెచ్‌ఎస్ సునంద, గోవిందరాజు, ఫార్మాసిస్టు శ్రీనివాస్ స్టాఫ్‌నర్సులు నాగ మ్మ, రాజశ్రీలు హాజరయ్యారు.

## పల్లె ప్రకృతి వనాల నిర్వహణ పక్కగా చేపట్టాలి

**కల్వకుర్తి, మే 10 ప్రభాతవార్త:** గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాల నిర్వ హణ పక్కగా చేపట్టాలని కల్వకుర్తి ఎంపీడీఓ ఆంజనేయులు పేర్కొ న్నారు. బుధ వారం కల్వకుర్తి మండలంలోని మార్చాల గ్రామాన్ని ఎంపీడీఓ ఆంజనే యులు, ఎపీఓ చంద్ర సిద్ధార్థలతో కలిసి సంద ర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం హరితహారం కార్య క్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతుంద న్నారు. హరితహారంలో భాగం గా పల్లె ప్రకృతి వనాల నిర్వహణ పట్ల ప్రత్యేకమైన దృష్టి సారించాలని ఆయన సూచించారు.అనంతరం వన నర్స రీని సందర్శించి ఫీల్డ్ అసిస్టెంట్లకు తగు జాగ్రత్తలు సూచించారు. కార్యక్ర మంలో వ్యవసాయ శాఖ అధికారులు, టీఎలు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

## కంటి వెలుగు శిబిరాన్ని అకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 10 ప్రభాతవార్త:** పెద్దముద్దునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గన్యాగుల గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.సుధా కర్‌లాల్ అకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కంటి వెలుగు అమలును విజయవంతంగా నిర్వహిస్తున్నామని, ఏ విధమైన అలసత్వం ప్రదర్శించకుండా నిర్దేశించిన లక్ష్యం చేరాలని సూచించారు. అనంతరం లబ్ధి దారులతో మాట్లాడి కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ యూసుఫ్ నవీద్,డిపిఓ రేనయ్య,ఈడీఎం సందీప్, పర్యవేక్షణాధికారి కేశవు లు, వైద్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా వరి కొనుగోలు జరగాలి

**గద్వాల ప్రతినిధి,మే 10 ప్రభాతవార్త:** జిల్లాలో ఉన్న రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా వరి కొనుగోలు ఈనెల చివరి వరకు జరగాలని జిల్లా కలె క్టర్ వల్లూరు క్రాంతి, స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం హాలులో పౌరసరఫరాల శాఖ అధికారులు, మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కొను గోలు చేసిన వెంటనే తరలించాలన్నారు. వరి కొనుగోలు కేంద్రాల్లో వ్యవ సాయ అధికారులతో పాటు కొనుగోలు చేసే సంస్థల ఖరీదు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోయే అవకాశం ఉన్న నేపథ్యంలో వీలైనంత త్వరగా కేంద్రాలలో వరి కొనుగోలు చేయాలన్నారు. రైతులకు నష్టం వాటిల్లకుండా వచ్చిన ధాన్యంను తప్ప నిసరిగా దిగుమతి చేసుకోవాలని, మీరు చెప్పిన సమస్యలను ప్రభుత్వం దృష్టిలో పెడతామని అన్నారు. జిల్లా ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి మాట్లా డుతూ మిల్లర్లు అందరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రైతులకు నష్టం జరగకుండా తప్పనిసరిగా ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని అన్నారు. మీ సమస్యలపై స్టేట్ ప్రెసిడెంట్‌తో మాట్లాడి మీకు ఎలాంటి నష్టమూ జరగ కుండా చూస్తామని అన్నారు. మీరు బాధ్యత తీసుకుని వరి దిగుమతి చేసుకో వాలని, మీరు బాగుంటేనే రైతులు బాగుంటారని, మిల్లర్లు జాగ్రత్తగా ధాన్యం దిగుమతిలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు.వరి కొనుగోలు కేంద్రాలను త్వరగాపూర్తి చేసే విధంగా చర్యలుతీసుకోవాలని అన్నారు. మిల్లర్లకు ఎల్లవే ళలా ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటామని అన్నారు. మిల్లర్లు సహ కారం ఉండాలని కోరారు.రైతులకుఎలాంటి ఇబ్బందిలేకుండా మిల్లర్లు రైతుల కు సహకరించాలని కోరారు. ఆర్డీఓ రాములు, జిల్లా పౌరస రఫరాల శాఖ అధికారి రేవతి, జిల్లా మేనేజర్ ప్రసాద్‌రావు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**గద్వాల ప్రతినిధి,మే 10 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కెటిదొడ్డి, ధరూర్ మండలాలకు చెందిన పలు గ్రామాల లబ్దిదారులకు సీఎం సహాయనిధి చెక్కు లను పంపిణీ చేశారు. సీఎం సహాయనిధి చెక్కులు అందుకున్న లబ్దిదారులలో గోపాల్‌రెడ్డి తండ్రి లక్ష్మిరెడ్డికి రూ. 60 వేలు, తిమ్మప్ప తండ్రి రామయ్యకు రూ. 60 వేలు, చిన్న నర్సింహులుకు తండ్రి మల్దకల్‌కు రూ. 60 వేలు, కృష్ణ తండ్రి ఆనంద్‌కు రూ. 44500, ఫకృద్దీన్ తండ్రి మాబుసహెబ్‌కు రూ.28 వేలు, మాస్ట ర్ శరత్‌కుమార్ తండ్రి రమేష్‌కు రూ. 26 వేలు, దిందప్ప తండ్రి చిన్న సవరయ్యకు రూ 20 వేలు, లక్ష్మి తండ్రి శంకర్‌నాయక్‌కు రూ. 18 వేలు, బోయ నందిని తండ్రి జయప్పకు రూ. 7 వేల చెక్కులను ఎమ్మెల్యే అంద జేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలు వైద్యం కోసం ఖర్చుపెట్టిన డబ్బులను సీఎం సహాయనిధి ద్వారా 50 శాతం డబ్బులను చెక్కుల రూపంలో లబ్దిదారులకు అందజేయడం జరుగుతుందని, పేద ప్రజలకు అండగా ఉండేందుకు ఏ విధమైన అవకాశం ఉన్న సంక్షేమాన్ని అందించే విధంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని దేశంలోనే వినూత్న రీతిలో సంక్షేమాన్ని అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అని పేర్కొ న్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బిఎస్ కేశవ్, రైతుబంధు అధ్యక్షులు జమ్మిచెడ్ చిన్నయ్య, గట్టు ఎంపి పి విజయ్‌కుమార్,కెటిదొడ్డి జడ్పీటిసి రాజశేఖర్, వైస్ ఎంపిపిలు, రామకృష్ణనాయుడు, సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్‌లు నర్సింలు,నారాయణ, తిమ్మప్ప,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చక్రధర్‌రావు, కుర్మన్న, జంగిలప్ప, ఎంకన్ గౌడ్, రామిరెడ్డి, హనుమంత్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

# క్రీడాకారులు ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలి

**-ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి**


విజేత జట్టుకు చెక్కుతో పాటు షీల్డ్‌ను బహుకరిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, మే 10 ప్రభాతవార్త:** ప్రతి క్రీడాకారుడు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలను అధిరో హించాలని, అలాగే ఎంచుకున్న క్రీడల్లో రాణించాలని ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్ర సాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కల్వకుర్తి మండల పరిధిలోని మార్చాల గ్రామంలో సీనియర్ క్రికెట్ క్రీడాకారుల ఆధ్వర్యంలో మార్చాల ప్రీమియర్ లీగ్-2 క్రికెట్ పోటీలను ఆయన తిలకించారు. గత వారం రోజుల నుంచి కొనసా గుతున్న క్రికెట్ పోటీలు ముగింపు పోటీలకు ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి, కల్వకుర్తి మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నేత బృంగి ఆనంద్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శివరాం 11 బులెట్స్, వట్టెపు కింగ్స్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ కొనసాగడంతో వట్టెపు కింగ్స్ విజేత జట్టుగా, శివరాం 11 బులెట్స్ రన్నరప్‌గా నిలిచాయి. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో విజేత జట్టు వట్టెపు కింగ్స్‌కు రూ.60వేలు, రన్నరప్ జట్టుగా శివరాం 11 బులెట్స్‌కు రూ.30వేలు, మూడవ స్థానంలో నిలిచిన సామ స్ట్రైకర్స్ జట్టుకు రూ.20వేల చెక్కులను ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి అందించారు. అనం తరం ఆనంద్‌కుమార్ ఇరు జట్లకు షీల్డ్‌లను బహుకరించారు. కార్యక్రమంలో గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ సునిత వెంక ట్‌రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వట్టెపు బాలయ్య, కౌన్సిలర్ శ్రీను, గ్రామస్తులు నిజామొద్దిన్, తలసాని కృష్ణారెడ్డి,నిర్వాహకులు పల్స జంగయ్య, సామ శ్రీనివాస్, దున్న భాస్కర్, వట్టెపు కిశోర్, వార్డు సభ్యులు దొక్క లింగం,గౌసుద్దీన్, క్రీడాకారులు, గ్రామస్తుల, ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలు మంచి ఫలితాలు సాధించడంపై హర్షం

**ఉట్కూర్,మే 10 ప్రభాతవార్త:** విద్యార్థులు ఎంతగానో ఎదురు చూస్తు న్న పదవ తరగతి పరీక్షలో ఉట్కూర్ మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలు మంచి ఫలితాలు సాధించడంతో పిఆర్‌టియు జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం. లక్ష్మారెడ్డి,మండల అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్య దర్శి భాస్కర్, సత్యపాల్, గోవర్ధన్, గోపాల్, మహేష్ హర్షం వ్యక్తం చేయడం జరిగింది. పులిమామిడి కెజిబివి 100 శాతం ఫలితాలు సాధిం చడం మండలానికి గర్వకారణం అన్నారు. అలాగే ఉట్కూర్ బాలికల ఉన్నత పాఠశాలలో 94 శాతం, చిన్నపొర్ల ఉన్నత పాఠశాల ఉర్దూ మీడి యం 91 శాతం, ఉట్కూర్ ఉర్దూ మీడియం పాఠశాల 90 శాతం టిఎస్ డబ్ల్యుఆర్ఈఐఎస్ ఉట్కూర్ 86 శాతం,ఉట్కూర్ బాలుర ఉన్నత పాఠ శాలలో 84.74 శాతం, చిన్నపొర్ల తెలుగు మీడియంలో 81.3 శాతం, బిజ్వార్ ఉన్నత పాఠశాల 72 శాతం, జడ్పీపి పులిమామిడి ఉన్నత పాఠ శాల ఇంగ్లీష్ 64 శాతం పులిమామిడి తెలుగు మీడియంలో 46 శాతం ఫలితాలు రాబట్టడం జరి గింది. మొత్తం 542కు గాను 446 మంది విద్యా ర్థులు మండల వ్యాప్తంగా ఉత్తీర్ణులు కావడం జరి గింది. ఉట్కూర్ టిఎస్ డబ్ల్యుఆర్ ఐఐఎస్‌కు చెందిన ఎం. నందిని అనే విద్యార్థిని 9.8 జిపిఎ సాధించి, 9.2 మహే ష్ జిల్లా ఉన్నత పరిషత్ ఉన్నత పాఠశాల ఉట్కూర్, 9.2 కవిత, శిరీష జడ్పీహెచ్ఎస్ చిన్నపొర్ల 9.0 అంకిత కావేరి, జి. అక్షయ కెజిబివి పులి మామిడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎందులోనూ తక్కువ కాదు అని నిరూపించారు. ఈ ఫలితాల సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


మహేష్ (9.2)


కవిత (9.2)


శిరీష (9.2)

# రక్తదానం చేయండి.. ప్రాణదాతలుగా నిలువండి

**-రాంరెడ్డి లయన్స్ ఐ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ వి.దామోదర్‌రెడ్డి**

**కల్వకుర్తి, మే 10 ప్రభాతవార్త:** లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు మరియు సామాజిక ఆరోగ్య కేంద్రం కల్వకుర్తి సంయుక్త ఆధ్వర్యంలో కల్వకుర్తి ఆసుపత్రి సూపరింటెండెంట్ లయన్ డాక్టర్ శివరాం 45వ జన్మదినం సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరాన్ని కల్వకుర్తి ప్రశాంత్ నర్సింగ్ హోమ్ వ్యవస్థాపకులు, రాంరెడ్డి లయన్స్ ఐ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ వి.దామోదర్‌రెడ్డి ప్రారం భించారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపు నిచ్చారు. రక్తం మాత్రమే కేవలం దాతల సహాయంతోనే లభిస్తుంద న్నారు. రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేస్తున్న వారిని ఆయన అభినందించారు.40 మంది రక్తదానం చేసి నట్లు పీఆర్ఓ పాష తెలిపారు. రక్తదానం జిల్లా ఆసుపత్రిలో అందజేసి నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు భైరి కరుణా కర్‌రెడ్డి, కార్యదర్శి భాస్కర్‌రెడి , నాగేష్, పీఆర్ఓ పాష, చారి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు ఉన్నారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న రాంరెడ్డి లయన్స్ ఐ హాస్పిటల్ చైర్మన్

# 10వ తరగతి ఫలితాల్లో సత్తా చాటిన జిల్లా విద్యార్థులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే10 ప్రభాతవార్త:** 10వ తరగతి ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. హైదరాబాద్‌లో మధ్యాహ్నం 12 గంట లకు విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా బాలికల హవా కొనసాగగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయిలో నాగర్‌కర్నూల్ జిల్లా మొదటి స్థానం, రాష్ట్ర స్థాయిలో నాగర్‌కర్నూల్ జిల్లా 12వ స్థానంలో నిలిచాయి. కాగా 10/10 జీపీఎను 65 మంది విద్యార్థులు సాధించారు. జిల్లా వ్యాప్తంగా 76 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. 1342 మంది విద్యార్థులు 9జి. పి.ఎ మార్కులు సాధించారు. కస్తూర్బాలో 24 మంది విద్యార్థులు 9జి పిఎ మార్కులు సాధించారు. నాలుగు కేజీబీవీల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. జిల్లాలోని బీసీ గురుకులాల్లో 13 మంది విద్యార్థులు 10/10 జి.పి.ఎ సాధించారు. మార్కులు తిరిగి లెక్కించడానికి రీ కౌంటి ంగ్‌కు రూ.500లు, రీ వెరిఫికేషన్‌కు ఒక్కొ సబ్జెక్టుకు రూ.1000, అడ్వాన్స్ స్లపమెంటరీకి చెల్లించాలని, జూన్ 14వ తేదీ నుంచి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు కొనసాగనున్నాయి.10వ తరగతి ఫలితాలపై జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు.నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కలిపి బాలుర 5,214, బాలి కలు 5358 మొత్తం 10572 మంది పరీక్షలకు హాజరు కాగా ఇందులో బాలురు 4660, బాలికలు 4992 మొత్తం 9582 మంది ఉత్తీర్ణత సాధించినట్లు డీఈఓ గోవిందరాజులు తెలిపారు. జిల్లాను పది ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 12వ స్థానంలో, ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొదటి స్థానంలో నిలిపిన డీఈఓ గోవిందరాజును కలెక్టర్ అభినందించారు.


డీఈఓ గోవిందరాజులును అభినందిస్తున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

# సంపన్నులకు అండగా బిజెపి ప్రభుత్వం

**కర్షకుల, కార్మికుల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం: సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు**

**ఇటిక్యాల,మే 10 ప్రభాతవార్త:** సంపన్నులైన కార్పోరేటర్లకు ప్రధాని నరెంద్రమోడీ ప్రభుత్వం అండగా ఉందని కర్షకుల, కార్మికుల నడ్డి విరు స్తుందని బిజెపి ప్రభుత్వ విధానాల వల్ల దేశానికి పెను ప్రమాదం పొంచి ఉందని పాలకుల వల్ల దేశానికి ప్రమాదం వచ్చినప్పుడల్లా కమ్యూని స్టులు ముందుంటారని గద్వాల జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు బిజెపి ప్రభు త్వంపై మండిపడ్డారు.బుధవారం మండల పరిధి లోని సిపిఐ పార్టీ ఇంటింటి ప్రజాపోరు యాత్ర లో భాగంగా ఇటిక్యాల, జింకలపల్లి స్టేజీ గ్రామా లో సిపిఐ కార్యకర్తలతో కలిస ప్రజా పోరుయాత్ర కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టజీవుల శ్రమను దోచి సంపన్నులకు దోచిపెడుతున్నారని బిజెపి ప్రభుత్వాన్ని విమ ర్శించారు. అందుకే బిజెపి హఠావ్, దేశ్‌కో బచావో నినాదంతో సిపిఐ ప్రజా పోరుయాత్ర చేపట్టిందని కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2014లో గ్యాస్ సిలిండర్ ధర రూ. 475 ఉండేదని, ఇప్పుడు రూ. 1200లు పేద ప్రజలు కొనుగోలు చేసి వాడుకుంటున్నారని ఆరోపించారు. అలాగే లీటర్ డీజిల్ ధర 55 ఉండగా వందకు పైగా దొరుకుతుందని అంతేకాక గతంలో పెట్రోల్ ధర రూ. 65 ఉండగా 112కు పెంచారని వీటి కారణంగా రవాణా ఛార్జీలు పెరిగిపోయాయని వాటి ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని అంతేకాక, రైతు లకు సబ్సిడీలు ఇవ్వకుండా ప్రధాని నరెంద్రమోడీ ప్రభుత్వం మాత్రం కార్పోరేట్లకు రూ. 11 లక్షల కోట్లు మాఫీ చేశారని ఆరోపించారు. ఈ సొమ్ము ప్రజల కష్టమని గుర్తు చేశారు. కర్షకులు, కార్మికులు అంటే బిజెపి ప్రభుత్వానికి గిట్టదని, ఇది సంపన్నుల ప్రభుత్వమని ఆరోపించారు. కార్మిక చట్టాలను నాలుగు విభాగాలుగా విభజించి నిర్వీర్యం చేసిందని, ఎనిమిది గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచిందన్నారు. ఇది పెట్టుబడిదారుల లాభం కోసమేనని విమర్శించారు. కేంద్రం ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని దేశంలోని ప్రజలందరు గద్దెదించాలన్నారు.కార్యక్రమంలో సిపిఐ గ్వాల నియోజకవర్గ ఇంఛార్జి రంగన్న, ఇటిక్యాల కార్యదర్శి ఆశన్న, జిల్లా నాయకులు చెన్నయ్య, నాయకులు వినోద్, కారెప్ప, వెంకటేష్, శ్రీనాథ్, ప్రవీణ్, ఏఐటియుసి హమాలీ కార్మిక సంఘం నాయకులు రాజు, పరుష, ప్రసాద్, శ్రీను, వెంకట్, రాముడు తదితరులు పాల్గొన్నారు.



సిపిఐ ప్రజా పోరు యాత్రలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

## దేవరకద్ర మండల టాపర్‌గా పావని

**దేవరకద్ర,మే 10 ప్రభాతవార్త:** పదవ తరగతి పరిక్ష పలితా లలో దేవరకద్ర మండల టాపర్‌గా డోకూర్ తపోవన్ పాఠశాలకు చెందిన పావని నిలిచింది.బుధవారం ప్రకటిం చిన పలితాలలో ఆమె 9.8 జిపిఏ సాదించి ఈ రికార్డు సృష్టించింది. దీంతో పావనిని పాఠశాల ప్రిన్స్‌పాల్ వర్కు టి నిరంజన్‌రెడ్డి.వైస్ ప్రిన్స్‌పాల్ సబిహాతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.


పావని

## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ ధరలు

**దేవరకద్ర,మే 10 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం 776 కింటాళ్ళ సోన ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవ చ్చారు. అయితే కింటాల్ సోన ధాన్యానికి అత్యధికంగా రూ.2069 ధర పలి కింది. అలాగే అతి తక్కువగా రూ.1403 ధర పలికింది.అలాగే 96 కింటాళ్ళ హంసధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. కింటాల్ హంస ధాన్యా నికి అత్యధికంగారూ.1609 ధర పలికింది. అలాగే అతితక్కువగా రూ.1359 ధర పలికినట్లు మార్కెట్‌అధికారులు తెలిపారు.

**కొనుగోలు చేసిన ప్లాట్లపై మోఖా మీదకు రాకుండా**

## అడ్డుకుంటున్న వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

**వెల్దండ, మే 10 ప్రభాతవార్త:** అప్పు, సొప్పు చేసి కొంత డబ్బులతో కొనుగో లు చేసిన ప్లాట్ల మోఖా మీదకు రాకుండా అడ్డుకుంటున్న ఒబిడ్ బిన్ నాస ర్‌పై బుధవారం వెల్దండ మండల పోలీసులకు సయ్యద్ హామీదుద్దిన్ ఫిర్యాదు చేశారు. వివరా ల్లోకి వెళితే... వెల్దండ మండలం చెర్కూర్ గ్రామ శివారులో సర్వే నెం.535,537, 538, 539ల లో వెంచర్ చేయడంతో వెంచర్ నుంచి ఒబిడ్ బిన్ నాసర్ వహిదా బేగంకు ప్లాటు నెంబర్లు 137, 138,139,151,152,153లలో మొత్తం956 చ॥గజములను విక్రయించడమైనది. వహిదా బేగం నుంచి హైదరాబాద్ ప్రాంతానికి చెందిన సయ్యద్ హామీదుద్దిన్ అట్టి ప్లాట్లను ఒబిడ్ బిన్ నాసర్‌తో పూర్తి వివరాలు అడిగి తెలుసుకొని మోఖా చూసుకొని 2022 జూలై నెల 18వ తేదీన కొనుగోలు చేసి కల్వకుర్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు.ప్రస్తుతంఅట్టి ప్లాట్ల మోఖా మీదకు ఒబిడ్ బిన్ నాసర్ రాకుండా ఇబ్బందులకు గురి చేస్తూ భయ భ్రాంతులకు గురి చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒబిడ్ బిన్ నాసర్‌పై చర్యలు తీసుకొని అతని స్వాధీనంలో ఉన్న నా ప్లాట్లకు నాకు మోఖా చూపించి నాకు న్యాయం చేయాలని బాధితుడు ఫిర్యాదులో వాపోయాడు. అతనితో పాటు మరికొంత మందికి ఇలాగే ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వాపోయారు.


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ప్రతీని చూపిస్తున్న సయ్యద్ హామీదుద్దిన్

## మెడలో ఉన్న బంగారు చైన్‌ను లాక్కెళ్లిన దుండగులు

**వెల్దండ, మే10 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రానికి మట్ట లక్ష్మమ్మ 65 తన ఆరోగ్య నిమిత్తం కల్వకుర్తి ఆసుపత్రిలో చికిత్స తీసుకొని తిరిగి వెల్దండ బస్టాండ్‌లో దిగి ఇంటికి నడుచుకొని వెళ్తున్న క్రమంలో అంజయ్య ఇంటి సమీ పంలో గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి మెడలో ఉన్న 4 తులాల బంగా రు చైన్‌ను దొంగలు అపహరించుకొని వెళ్లారు. దొంగతనం చేసిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయని, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

## 10వ తరగతి ఫలితాల్లో 74 శాతం సాధించిన విద్యార్థులు

**వెల్దండ, మే10 ప్రభాతవార్త:** 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో వెల్దండ మండ లంలో 74 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ శంకర్‌నాయక్ తెలిపారు. జెడ్పీహెచ్ఎస్ బొల్లంపల్లిలో 13 మంది విద్యార్థులకు గాను 5 మంది, జెడ్పీ హెచ్ఎస్ కొట్రలో 17 మంది విద్యార్థులకు గాను 4 మంది, జెడ్పీహెచ్ఎస్ పెద్దాపూర్‌లో 34 మంది విద్యార్థులకుగాను 28మంది, జెడ్పీహెచ్ఎస్ పోతే పల్లిలో 14 మంది విద్యార్థులకు గాను 8 మంది, జెడ్పీహెచ్ఎస్ రాచూ ర్‌లో 26 మంది విద్యార్థులకు గాను 18 మంది, జెడ్పీహెచ్ఎస్ వెల్దండలో 31 మంది విద్యార్థులకు గాను 21 మంది, జెడ్పీహెచ్ఎస్ వెల్దండ బాలికల 12 మంది విద్యార్థులకు గాను 2 మంది, టీఎస్ఎమ్ఎస్ వెల్దండలో 97 మంది విద్యార్థులకు గాను 77 మంది, కేజీబీవీ వెల్దండలో 37 మంది విద్యార్థులకు 24మంది, గురుకుల బాలికల పాఠశాలలో 78 మంది విద్యార్థులకు గాను 77మంది,ఈఎంఆర్ఎస్ కల్వకుర్తి గుండాలలో 55 మంది విద్యార్థులకు గాను 53 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. 9.5 జి.పిఎలు 5 మంది విద్యార్థులు, 9.2 జిపిఎ ముగ్గురు విద్యార్థులు సాధించినట్లు ఎంఈఓ శంకర్‌నాయక్ పేర్కొన్నారు.

## 10వ తరగతి విద్యార్థుల ప్రభంజనం

**వీపనగండ్ల,మే 10 ప్రభాతవార్త:** పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో వీపనగండ్ల మండలంలోని ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూర్బా పాఠ శాల కలిపి మొత్తం 8 పాఠశాలలు, 169 మంది పరీక్షా కేంద్రంలో విద్యా ర్థులు పరీక్ష రాయగా అందులో 135 మంది పాసయ్యారు.మిగిలిన 34 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించలేదు. ఈ పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానంలో తెలుగు మీడియంలో కస్తూర్బా పాఠశాల వీపన గండ్ల ఎం. కళ్యాణి అనే విద్యార్థి ప్రథమ స్థానంలో 8.8 జిపిఎ సాధించింది. అదేవిధంగా ఇంగ్లీష్ మీడియంలో కల్వరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో భవన్ అనే విద్యార్థి 9.7 జిపిఎ సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. అదేవిధంగా ద్వితీయ స్థానంలో గోవర్ధనగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రవళిక అనే విద్యార్థి 8.5 జిపిఓ స్థానంలో నిలిచారు. తృతీయ స్థానంలో వీపనగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కర్ణశ్రీ అనే విద్యార్థి 8.3 జిపిఎలో నిలిచారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి ఉపాధ్యాయు లు, సీఆర్పీ వెంకటేష్ విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

# పేదింటి ఆడపడుచులకు అండగా కెసిఆర్ ప్రభుత్వం

●మాజీ మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి ●99 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ




కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**మిడ్జిల్,మే 10 ప్రభాతవార్త :** పేదింటి ఆడపడుచులకు అండగా కెసిఆర్ ప్రభుత్వం అండగా ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే డా. సి.లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు సంబంధించిన 99 మంది లబ్దిదారులకు చెక్కులు తహసిల్దార్ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈసందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడ కూడా రైతుబంధు, రైతుబీమా, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, 24 గంటల పాటు ఉచిత కరెంటు, పింఛన్లు, రైతులకు సాగునీరు కెసిఆర్ పాలనలోనే ఇవ్వడం జరుగుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కుల, మత, భేదాలు లేకుండా అందిరికి వర్తించేలా కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ అందిస్తున్న కెసిఆర్ ప్రభుత్వం అని అన్నారు. గతంలో ఆడపిల్లలు పుడితే వివాహం జరిపించడానికి తల్లిదండ్రులకు భారంగా ఉండేదని ఇప్పుడు ఆడపిల్లలు పుడితే వివాహ సమయంలో లక్ష 116 రూపాయలు ప్రభుత్వం అందిస్తూ వారికి భరోసారా నిలుస్తున్న ప్రభుత్వం అని తెలిపారు. బిజెపి బురదజల్లే పనులు మానుకోవాలని నిజాన్ని గ్రహించాలని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి బగ్గెల సుదర్శన్, జడ్పీటిసి శశిరేఖ బాలు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జంగారెడ్డి, మాజీ మార్కెట్ ఛైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, పిఎస్‌హెచ్ ఛైర్మన్ టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాండుయాదవ్, వివిధ గ్రామాల ఎంపిటిసిలు,సర్పంచ్‌లు, మండల టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జిఎంఆర్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే10, ప్రభాతవార్త:** భూత్పూర్ మండల కేంద్రంలో మంగళవారం జరిగిన బైక్ ఆక్సిడెంట్‌లో ముగ్గురు మృతి చెందడంతో మృతదేహాలకు మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ దవాఖానలో పోస్ట్‌మార్టం నిర్వహించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి తెలిపి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయనవెంట భూత్పూర్ కౌన్సిలర్ లిక్కి నవీన్‌గౌడ్ ఉన్నారు.

## అన్ని అర్హతలున్న కోటకొండను మండలం చేయాలి

**నారాయణపేట ప్రతినిధి,మే10 ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని కోటకొండ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోటకొండ జెఎసి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. దీక్షకు మద్దతుగా నారాయణపేట నియోజకవర్గం ఇంఛార్జి కుంభం శివకుమార్‌రెడ్డి మక్తల్ నియోజకవర్గం నాయకులు నారాయణపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి శ్రీహరి, మాజీ ఎంపిపి సదాశివరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బి. నర్సింలు,యూత్ కాంగ్రెస్‌జిల్లా అధ్యక్షులురవిందర్‌రెడ్డి,జిల్లా అసంఘటిత కార్మిక అధ్యక్షులు బోయశరణప్ప, కోటకొండ యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

**నారాయణపేట ప్రతినిధి,మే 10 ప్రభాతవార్త:** మరికల్ మండలం, రాకొండలో సోమవారం ఈతకు వెళ్లిన ముగ్గురు అమ్మాయిలు, ఒకరు రాకొండ గ్రామస్తురాలు, మరో ఇద్దరు నర్వ మండలం పాతర్‌చేడ్‌కు చెందిన సొంత అక్కాచెల్లెళ్లు. వీరు ఇసుక కోసం తీసిన గుంతలలో పడి విగతజీవులయ్యారు. ఈ విషయం తెలిసిన స్వేరో సర్కిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇబ్రహీంబాద్ లక్ష్మణ్ బాధిత కుటుంబాలను పరామర్శించి తల్లిదండ్రులను ఓదార్చారు. స్వేరో సర్కిల్ నాయకులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ వాగులో ఇసుక కోసం తీసిన లోతైన గుంతలే ఈ అమ్మాయిల చావుకు కారణమయ్యాయి వాగులో తక్కువ మొత్తంలో నీళ్లున్నాయి.వాగంత ఇలాగే ఉందని అనుకుని లోతైన గుంతలను అమ్మాయిలు గుర్తించలేకపోయారు.అదే వారిచావులకు కారణమని లక్ష్మణ్ అన్నారు.మంచి భవిష్యత్తుఉండి ఇలావిగత జీవులుగా మారిన కూతుళ్లను చూసి తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారన్నారు. వారి మనోవేదన చెప్పలేనిదన్నారు.స్వేరోసర్కిల్ నాయకులు, బహుజన సంఘాల నాయకులుహనుమంతు,రవి,వెంకటేష్, అశోక్, శ్రీను, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ప్రజల మన్ననలు పొందేలా విధులు నిర్వహించాలి

**గద్వాల ప్రతినిధి,మే10 ప్రభాతవార్త:** ప్రజల మన్ననలు పొందేలా పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలకు పోలీస్ సేవలు అందించాలని జిల్లా ఎస్పీ కె. సృజనఅన్నారు.వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్పీ సృజన శాంతి నగర్ పోలీస్‌ను సందర్శించి స్టేషన్‌లో రికార్డులను,స్టేషన్ పరిసరాలను, పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది నిర్వహిస్తున్న విధులను తనిఖీ చేశారు. అందులో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, రిసెప్షన్, స్టేషన్ రైటర్, టెక్‌టీమ్, ఎస్‌హెచ్‌ఓ, లాక్‌అప్,మెన్ రెస్ట్ రూమ్ తదితర ప్రదేశాలను పరిశీలించారు. స్టేషన్‌లో రోజువారిగా నిర్వహిస్తున్న జనరల్ డైరీ, సెంట్రి రిలీఫ్ బుక్, డ్యూటీ రోస్టర్, విలేజ్ రోస్టర్, ప్రాసెస్ రిజిస్టర్, బీట్ డ్యూటీ బుక్స్, సస్పెక్ట్ చెక్ రిజిస్టర్, సుపీరియర్ ఆఫీసర్స్, విజిటర్‌బుక్స్,ఫైనల్ రిపోర్ట్సు తదితర రికార్డులను తనిఖీ చేశారు. పోలీస స్టేషన్‌లో నమోదైన గ్రేవ్, నాన్‌గ్రేవ్ సిఐ ఫైల్స్‌నుపరిశీలించి,పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని ఎస్సై శ్రీనివాస్‌కు సూచించారు. ఈసందర్భంగా ఎస్పీ స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో 5ఎస్‌ను ఎవరి పరిధిలో వారు నిత్యం అమలు అయ్యేటట్లు చూసుకోవాలని, డయల్ 100కు కాల్ రాగానే వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని,బ్లూకోల్ట్స్,పెట్రోల్‌కార్ నిరంతరం 24/7 గస్తీ నిర్వహించాలని సూచించారు.కార్యక్రమంలోశాంతినగర్ సిఐ శివ కుమార్, ఎస్సై శ్రీనివాస్,ఎస్పీసిసి లోహిత్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఐకెపి వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**వీపనగండ్ల,మే 10 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం వల్లభాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ రవిందర్‌రెడ్డి, ఎపిఎం రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సర్పంచ్ రవిందర్‌రెడ్డి, ఎపిఎం రాజశేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ రైతులు దళారి చేతిలో మోసపోవద్దని అలాగే కనీసం మద్దతు ధర మొదటి ఎ గ్రేడ్ 2060, బిగ్రేడ్ 2040,ప్రభుత్వం కల్పిస్తుంటే దళారి చేతుల్లో మోసపోతున్నారని రైతులు వాపోతున్నారన్నారు. ఐకెపి సెంటర్‌లో వరి కొనుగోలు చేసిన రైతుకు డైరెక్ట్‌గా వారి అకౌంట్లోనే డబ్బులు జమ అవుతాయని ఎపిఎం రాజశేఖర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో సిసి మాధవస్వామి, అధ్యక్షురాలు రమాదేవి, విఓఎ జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

## డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయ అకస్మిక తనిఖీ

**కల్వకుర్తి, మే10 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయాన్ని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.సుధాకర్‌లాల్ అకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల అమలుపై నిత్యం పర్యావేక్షణా ఉండాలని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే విషయంలో రాజీ పడేది లేదని, ఏ విధమైన అలసత్వం ప్రదర్శించిన శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## స్కాలర్స్ కళాశాల విద్యార్థులను అభినందించిన యాజమాన్యం

**వనపర్తి ప్రతినిధి,మే 10 ప్రభాతవార్త:** ఈనెల 9న వెలువడిన ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి వనపర్తి జిల్లాకు స్కాలర్స్ కళాశాలకు మరోసారి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన స్కాలర్స్ కళాశాల విద్యార్థులను వారి తల్లిదండ్రులను గురువారం కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఉన్నత లక్ష్యాలతో విద్యనభ్యసించి వనపర్తి జిల్లా కీర్తిని ప్రపంచానికి చాటాలని కళాశాల యాజమాన్యం పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని స్కాలర్స్ కళాశాల విద్యార్థులు బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ ప్రథమ,ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రస్థాయి మార్కులు సాధించి మరోసారి సత్తా చాటి వనపర్తి కీర్తి ప్రతిష్టలను చాటారు. ప్రహత సంవత్సరం బైపిసి ఫలితాల్లో నందిని 434 మార్కులు కె.అరుణ 433 మార్కులు, సుమయ్యనూర్ 432 మార్కులు, జై. మౌనిక 432 మార్కులు సాధించారు. ఎంపిసిలో ప్రశాంతి 465 మార్కులు, కె. లావణ్య 464 మార్కులు బి. కీర్తి 464 మార్కులు సాధించారు. ఎంఈసిలో శశి 478 మార్కులు, సీఈసిలో జి.వర్ష 463 మార్కులు సాధించారు.ద్వితీయ సంవత్సరం బైపిసిలోఆర్. అంజలి 95 మార్కులు, ప్రణతి షిండే 983 మార్కులు సాధించారు.ఎంపిసిలో ఎం. ఇందు 985 మార్కులు, పి.గాత్రి 982 సాధించారు.ఎంఈసిలోశ్వేత 972 మార్కులు, సీఈసిలో అక్షయ954 మార్కులుసాధించారు.ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను కళాశాల యాజమాన్య సభ్యులు, అధ్యాపక బృందంప్రత్యేకంగా అభినందించారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎ.శ్రీధర్, మధుసూదన్‌గుప్తా, డైరెక్టర్లు డా.పి. జగదీశ్వర్,డా.జి.వరప్రసాద్‌రావు, బి.నాగేశ్వర్‌రెడ్డి,డా.ఎల్. సత్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.




## ఎంపిపి చాంబర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**మిడ్జిల్,మే 10 ప్రభాతవార్త:** ఇటీవల నూతనంగా ఎంపిపిగా బగిగల సుదర్శన్‌ను ఎన్నుకోవడం జరిగింది. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి చాంబర్‌ను ఎమ్మెల్యే సి. లక్ష్మారెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. అనంతరం ఎంపిపి సుదర్శన్‌ను శాలువాతో సన్మానించి ఆ సీటుపై కూర్చోబెట్టడం జరిగింది. ఎంపిపి సుదర్శన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిఆశీస్సులతోమండలాన్నిఅభివృద్ధి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటిసి శశిరేఖ బాలు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జంగారెడ్డి, బాలు, ఎంపిటిసిలు,సర్పంచ్‌లు,నాయకులు పాల్గొన్నారు.

## పాత కలెక్టరేట్‌లోని ఫర్నీచర్ వేలం

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మే 10 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ పాత కలెక్టరేట్ కూల్చివేత తర్వాత అందుబాటులో ఉన్న టేకు, ఇతర కలపతో చేయబడిన తలుపులు, కిటికీలు, ఇతర ఫర్నీచర్‌ను వేలం వేయనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి ఉన్న ఉత్సాహిక కొనుగోలుదారుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కొనుగోలుదారులు దరఖాస్తు నిమిత్తం రూ. 200ల నగదు , ఈఎండి నిమిత్తం రూ. 15 వేల డిడిని, డిస్ట్రిక్ట్ కలెక్టర్ మహబూబ్‌నగర్ (ఐడిఓసి) పేరుమీద తీసి ఈనెల 12 నుండి 22 వరకు ప్రతిరోజు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గం.ల వరకు దరఖాస్తు ఫారాలను కలెక్టర్ కార్యాలయంలోని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ద్వారా పొందవచ్చని ఆయన వెల్లడించారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను ఐడిఓసిలోని కలెక్టర్‌కార్యాలయఅడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు ఈనెల 22న సాయంత్రం 5 గం.లలోగా సమర్పించాలని తెలిపారు. గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని ఆయన స్పష్టం చేశారు. దరఖాస్తు సమర్పించే ముందు కొనుగోలుదారులు ముందుగా పాత కలెక్టరేట్ ఆవరణలో ఉన్న టేకు, ఇతర కలపతో చేయబడిన తలుపులు, కిటికీలు, ఫర్నీచర్‌ను స్వయంగా పరిశీలించుకోవచ్చని ఆయన వెల్లడించారు. ఇందుకుగాను కార్యాలయ వేళల్లో జి. వేణుగోపాల్,డిప్యూటి ఈఈటిఎస్ఎంఐడిసి ఫోన్‌నంబర్ 94409 10720 నంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు. వచ్చిన దరఖాస్తులు అన్నింటిని ఈనెల 23న ఉదయం 11 గం.లకు జిల్లాస్థాయి కమిటి ఆధ్వర్యంలో పరిశీలించి నిర్ణయించనున్నట్లు కలెక్టర్ వెల్లడిచారు. ఇతర వివరాలకు హెచ్‌టిటిపిఎస్ మహబూబ్‌నగర్.తెలంగాణ.జిఓవి.ఇన్/టెండర్స్/ అడ్రస్‌లో చూసుకోవచ్చని, ఇతర సమాచారం కోసం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, కలెక్టరేట్ ఐడిఓసి సెల్ నంబర్ 9000101505కు ఆఫీస్ సమయంలో సంప్రదించవచ్చని కలెక్టర్ వెల్లడించారు.

## దరఖాస్తులకు ఆహ్వానం

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మే 10 ప్రభాతవార్త:** మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పరిధిలోని జిల్లామహిళా సాధికారత కేంద్రంలో ఖాళీగా ఉన్న స్పెషలిస్టు ఇన్ ఫైనాన్షియల్ లిట్రసీ, ఎంటిఎస్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రవినాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషలిస్టు ఇన్ ఫైనల్ లిటరసీ (1) పోస్టు, ఎంటిఎస్ (1) పోస్టు ఖాళీగా ఉందని,స్పెషలిస్టు ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు డిగ్రీలో ఎకనామిక్స్/ బ్యాంకింగ్ అర్హత కలిగి ఉండాలని, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, జులై 1,2022 నాటికి 21 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల మధ్య వయసు ఉన్న మహబూబ్‌నగర్ జిల్లాకు మాత్రమే చెందిన అభ్యర్థులు (జిఓ ఎంఎస్ నంబర్ 42 ప్రకారం 10 సంవత్సరాల మినహాయింపు ఉంటుంది) ఈ పోస్టుకు అర్హులని, అభ్యర్థులకు కనీసం 3 సంవ్సరాలు ప్రభుత్వ సంస్థలో పని చేసిన అనుభవం ఉండాలని, ఈ పోస్టు పూర్తిగా మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించినదైనందున ప్రెసిడెన్షియల్ ఆర్డర్ 2018 ప్రకారం ఈ పోస్టుకు మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వాసులు మాత్రమే అర్హులని ఆయన తెలిపారు.పైరెండు పోస్టులకు ఈనెల11 నుండి 22 వరకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని, అభ్యర్థులు దరఖాస్తుతో పాటు అన్ని ధృవపత్రాల జిరాక్స్ కాపీలతో గెజిటెడ్ అధికారిచే ధృవీకరించి జిల్లా సంక్షేమ అధికారి, మహిళా అభివృద్ధి,శిశుసంక్షేమ శాఖ, మహబూబ్‌నగర్ జిల్లా, రూమ్ నంబర్ 36, సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవనం పాలకొండలో ఈనెల 22 సాయంత్రం 5 గం.లలోగా సమర్పించాలని ఆయన కోరారు. అభ్యర్థులు వారి దరఖాస్తులను హెచ్‌టిటిపి// మహబూబ్‌నగర్. తెలంగాణ. జిఓవి.ఇన్, రిక్రూట్‌మెంట్స్/హెచ్‌టిపిపి// ఎంబిఎన్‌ఆర్‌జివి.ఇన్// డిహెచ్‌డబ్ల్యు ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ పోస్టులకు సంబంధించి భర్తీ రద్దు చేసేందుకు మార్చేందుకు పూర్తి అధికారం జిల్లా కలెక్టర్‌కు ఉంటుందని చివరి తేదీ తర్వాత వచ్చే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లో స్వీకరించడం జరగని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

## ఈత సరదా ప్రాణం తీసింది

●ప్రమాదవశాత్తు నీట మునిగి యువకుడు మృతి



ఈత నేర్చుకోవడానికి వెళ్లిన బావి



మృతి చెందిన రఘు (ఫైల్)

**మక్తల్,మే 10 ప్రభాతవార్త:** ఈత నేర్చుకోవాలనే సరదా సరైన రక్షణ పరికరాలు ధరించకపోవడంతో నడుముకు రక్షణగా ఉన్న రబ్బర్ ట్యూబ్ జారిపోవడంతో ప్రమాదవశాత్తు నీట మునిగి మంగలి రఘు (23) చనిపోయిన సంఘటన మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంగంబండ రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లోని ఓ వ్యవసాయ రైతు బావి మంగళవారం సాయంత్రం జరిగింది. మృతుడి సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ట్రేస్ చేయడంతో సంఘటన బుధవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. పలు సేవా కార్యక్రమంలో ముందుండే వికలాంగులైన రఘు మృతి చెందిన సంఘటనతో పట్టణంలో యువతలో విషాదం నెలకొంది.గతకొన్ని సంవత్సరాలుగా పట్టణంలో అనాధలకు, యాచకులకు అన్నదానం, పిచ్చివాళ్లకు కేశ సంస్కర్ణ పనులను ఉచితంగా నిర్వహించే మంగలి రఘు మృతి చెందడంతో యువత పోలీసులు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించే వారు విచారం వ్యక్తం చేస్తున్నారు.చీకటి పడినా రఘు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెంది ఉదయం మిత్రులు, కుటుంబీకులు, పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా లొకేషన్‌లో వెళ్లి చూడగా బావిగట్టు పైన వేసుకున్న బట్టలు సెల్‌ఫోన్ ఉండడంతో అనుమానంతో బావిలో ఉన్న నీటిని తోడగా శవమై కనిపించాడు.వివరాల్లోకి వెళ్తే స్థానిక మక్తల్ పట్టణంలో నివాసం ఉంటున్నమంగలి రఘుమంగళవారం మిత్రులతో కలిసి జల్సా చేసుకుని రోజువారిగా ఈత నేర్చుకోవడానికి రబ్బరు ట్యూబ్ తీసుకుని సాయంత్రం సంగంబండ రిజర్వాయర్ దగ్గర ఉన్న ఓ వ్యవసాయ బావిలో ఈత నేర్చుకోవడానికి రోజువారిగా రబ్బర్ ట్యూబ్ తీసుకుని వెళ్లాడని, నడుముకు ధరించిన రబ్బరు ట్యూబ్ జారిపోవడంతో బావిలో నీట మునిగి చనిపోయాడని కుటుంబీకులు అంటున్నారు. మక్తల్ ఎస్సై పర్వతాలు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం మృతదేహాన్ని మక్తల్ సివిల్ ఆసుపత్రికి తరలించారు.

# స్వరాష్ట్రంలో పండుగలకు గుర్తింపు

●మాజీ మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి ●జడ్చర్లలో బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే10, ప్రభాతవార్త:** తెలంగాణ ఏర్పడ్డాకే మన పండుగలకు గుర్తింపు లభించిందని, ప్రధాన పండుగలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తున్నదని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో నిర్వహిస్తున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈనెల 12వరకు జరిగే ఉత్సవాల గురించి అడిగి తెలుసుకున్నారు. పండుగలు అందరూ సామరస్యంగా జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మీరవీందర్, వైస్ చైర్ పర్సన్ పాలాది సారికారామ్మోహన్, కౌన్సిలర్లు చైతన్య చౌహాన్, జ్యోతి కృష్ణారెడ్డి, కుమ్మరి రాజు, లత, శశికిరణ్,విజయ్, నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆయా వార్డు సభ్యులు పాల్గొన్నారు.



బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన..

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

**ఇటిక్యాల,మే 10 ప్రభాతవార్త:** తెలంగాణ విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం పదవ తరగతి ఫలితాలువిడుదల చేయగా మండల పరిధిలోని 13 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు,కస్తూర్బా గాంధి బాలికల విద్యాల యం, 3 బీచుపల్లి రెసిడెన్షియల్ గురుకుల, ఇటిక్యాల, ఎర్రవల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు.మండలపరిధిలోని కోదండపురం ఉన్నత పాఠశాలలో చదివిన పావని జిపిఎ 9.8అదేవిధంగా వల్లూరు ఉన్నత పాఠశాలకు చెందిన రేణుక జిపిఎ 9.7సాధించి మండల టాపర్లుగా నిలిచారు. బీచుపల్లి రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలకు చెందిన నలుగురు విద్యా ర్థులు లక్ష్మణ్, శివకుమార్,శివ,పరశురాముడు నలుగురువిద్యార్థులు జిపిఎ 10/10 సాధించినట్లు మండల విద్యాధికారి రాజు తెలిపారు. మం డలంలోని 13 ఉన్నత ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బాగాంధి బాలికల విద్యాలయం, 3 గురుకుల పాఠశాలలు కాగా మొత్తం విద్యార్తులు 576 మంది పరీక్షలు రాయగా అందులో 495 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా అందులో338 మంది బాలురు 157 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు.ఇందులో 391 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 391మంది బాలురకు గాను 338మంది బాలురలు, 185 మంది బాలిక లకు గాను 157 మంది మండలంలో ఉత్తీర్ణత సాధించారు.అంతేకాక ఇందులో 53 మంది బాలుర విద్యార్థులు ఉత్తీర్ణత సాధించలేక పోయారు. 28 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించలేకపోయారు. కాగా మండలంలోని 13 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 74.6 శాతం, కస్తూర్బా గాంధి బాలికల విద్యాలయం 92.85 శాతం మూడు గురుకుల పాఠశాలో 99.14శాతం ఫలితాలు సాధించాయి.మండలంలో మొత్తం కలుపుకుంటే 85.93 శాతం ఉత్తీర్ణత శాతం సాధించాయని మండల విద్యాధికారి రాజు తెలిపారు.



పావని (9.8)



రేణుక (9.7)

# కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించండి

● సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎండి ఫయాజ్

**వీపనగండ్ల,మే 10 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు మతం పేరుతో బిజెపి ప్రభుత్వం మభ్యపెడుతోందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండి ఫయాజ్ విమర్శించారు. మంగళవారం బిజెపికో హటావో దేశ్‌కో బచావో నినాదంతో వీపనగండ్ల మండల కేంద్రంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014కు ముందు కాంగ్రెస్ హయాంలో గ్యాస్ సిలిండర్ ధర రూ. 475 ఉండేదని బిజెపి ప్రభుత్వంలో రూ.1200లకు పెంచారని విమర్శించారు. డీజిల్ ధర లీటర్ రూ.50లు ఉండేదని ఇప్పుడు వందకు పెరిగిందన్నారు. పెట్రోల్ ధర రూ. 66 ఉండేదని 100కు పైగా పెంచారన్నారు. ఫలితంగా ధరలు పెరిగాయి అన్నారు.రెండు కోట్ల ఉద్యోగాలు రైతు అకౌంట్లో 15 లక్షలు జమ అమలు చేయలేదన్నారు. ఆకలి సూచి 107కు పెరిగిందన్నారు. ధనవంతులు మరింత ధనవంతులయ్యారని పేదలు నిరుపేదలయ్యారని విమర్శించారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు మతం పేరుతో దేశంలో రాజకీయాలు చేస్తున్నారనివచ్చే ఎన్నికలలో వారికి బుద్ధి చెప్పాలని కోరారు.ఈ కార్యక్రమంలో కొల్లాపూర్,పెద్దకొత్తపల్లి,కోడేరు,పాన్‌గల్ మండలాల నాయకులు శ్రీనివాసులు,తుమ్మల శివుడు, కిరణ్‌గోపాల్, ఏఐఎస్ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎండిఎస్ ఫయాజ్

## పేదల ఆరోగ్యానికి భరోసా..

- రూ.2లక్షల ఎల్‌వోసీ అందజేసిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్



**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే10, ప్రభాతవార్త:** పేదల ఆరోగ్యానికి తెలంగాణ సర్కార్ భరోసానిస్తున్నదని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మహబూబ్‌నగర్‌కు చెందిన హజీరా సుల్తానాకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2లక్షల చెక్కును మంత్రి అందజేశారు. హజీరా సుల్తానా అనారోగ్యం కారణంగా నిమ్స్‌లో చికిత్స పొందుతున్నది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి మంత్రి అండగా నిలిచారు. సీఎం సహాయ నిధి నుంచి డబ్బులు మంజూరు చేయించి ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించి రూ.2లక్షల ప్రొసీడింగ్ కాపీని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మోసిన్ ఉన్నారు.

## పోలీస్ భద్రతా చెక్కు అందజేసిన ఎస్పీ

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే10, ప్రభాతవార్త:** భూత్పూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ కే సురేందర్ హెచ్‌సీ1384 తనువు చాలించారు. ఈమేరకు పోలీస్ శాఖ నుంచి విడుదలైన రూ.7లక్షల 95వేల 380 భద్రతా చెక్కును ఎస్పీ నరసింహ బుధవారం సురేందర్ సతీమణి కే సారికకు అందజేశారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను ఎస్పీ ఓదార్చి మనోధైర్యం చెప్పారు.పోలీస్ శాఖ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసానిచ్చారు.కార్యక్రమంలో డీఎస్పీ మహేశ్, ఏవో రుక్మిణిబాయ్,పోలీస్‌అసోసియేషన్‌అధ్యక్షుడు వెంకటయ్య పాల్గొన్నారు.



## క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదిగేందుకు కృషి చేస్తాం

**అయిజ,మే 10 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో స్వేరోస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి కబడ్డి, క్రికెట్ పోటీలను బుధవారం ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ మామిడాల ప్రవీణ్‌కుమార్ స్వేరోస్ ప్రారంభించారు. అనంతరం విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా వారు మాట్లాడుతూ కబడ్డి పోటీలు క్రికెట్ పోటీలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ క్రీడలు క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసి నేషనల్ ఇంటర్నేషనల్ స్థాయికి ఎదిగేందుకు దోహదపడతాయని అని అన్నారు. స్వేరోస్ నెట్‌వర్క్ వ్యవస్థాపకులు డా. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ క్రీడలకు సంబంధించి బహుమతులు ప్రశంసా పత్రాలు క్రీడా నిర్వాహకులకు అందించామన్నారు. ఈ పోటీలకు ఈ క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేసేందుకై డా.ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశంలో డా. సోలపోవుల స్వాములు, నల్లబోతుల కరుణాకర్,అంజి, సూర్యచంద్ర,ప్రశాంత్, సూరి, పిఈటిలు సుబ్బన్న, సూర్యప్రభాకర్, చంటి,రాజేష్‌ఖన్నా,బీసన్న,సచిన్,వరుణ్, ప్రకాష్ పాల్గొన్నారు.

## ప్రయాణీకులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

**నారాయణపేట ప్రతినిధి,మే 10 ప్రభాతవార్త :** ప్రయాణ ప్రాంగణంలో ప్రయాణీకులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, నిరంతర పారిశుద్ధ్య పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం నారాయణపేట ప్రయాణ ప్రాంగణాన్ని కలెక్టర్ సందర్శించారు. బస్టార్‌లో ప్రయాణీకులకు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని, ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించే విధంగా చూడాలని డిపో మేనేజర్‌ను ఆదేశించారు. ప్రాంగణాన్ని పరిశుభ్రంగా, నీటి నిల్వలు ఉండకుండా మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు నిర్వహించాలని అన్నారు. మిషన్ భగీరథ కనెక్షన్ ద్వారా నీటి సరఫరా కల్పించాలని మున్సిపల్ ఏఈకి సూచించారు. త్రాగునీటి కూలర్, మరుగుదొడ్లు, శానిటేషన్ పనులను కలెక్టర్ పరిశీలించి తగు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఆంజనేయులు, మున్సిపల్ ఏఈ మహేష్, శానిటరీ, ఆర్టీసి సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.1.25లక్షల ఎల్‌ఓసీ చెక్కు అందజేత

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే10 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన జంగేంద్రమ్మ ఇటీవల చెరుకు మిషన్‌లో చేయి పడి తీవ్రంగా గాయపడ్డారు. వారి కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల మెరుగైన వైద్య చికిత్స చేయించుకోలేని పరిస్థితుల్లో ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1.25లక్షల ఎల్‌ఓసీ చెక్కును అందించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## బిజెపి ఓబిసి మోర్చా చేవెళ్ల మండల అధ్యక్షుడిగా కుమార్‌గౌడ్

-ఉద్యోగులను బెదిరింపులకు పాల్పడితే సహించేది లేదు

-చేవెళ్ల మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు పాండురంగారెడ్డి



బీజెపి ఓబిసి మోర్చా చేవెళ్ల మండల శాఖ కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న చేవెళ్ల మండల బీజెపి పార్టీ అధ్యక్షుడు పాండురంగారెడ్డి

చేవెళ్ల, మే 10, ప్రభాతవార్త

భారతీయ జనతా పార్టీ ఓబిసి మోర్చా చేవెళ్ల మండల అధ్యక్షుడుగా బొబ్బిలి కుమార్‌గౌడ్ ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఓబిసి మోర్చా చేవెళ్ల మండల శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా సత్యం, గోపాల్, శంకరాచారి, ప్రవీణ్ చారి, ప్రధాన కార్యదర్శిగా జి.రమేష్, రాములు, కార్యదర్శులుగా శ్రీశైలం, సంతోష్,శ్రీను, క్రిష్ణాలతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగిందని చేవెళ్ల అసెంబ్లీ ఓబిసి కన్వీనర్ వెంకటేష్‌గౌడ్, చేవెళ్ల పార్టీ అధ్యక్షుడు పాండురంగారెడ్డి,బిజెపి మండల శాఖ కార్యదర్శి అత్తిల్లి అనంతరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి చేవెళ్ల పార్టీ అధ్యక్షుడు పాండురంగారెడ్డి మాట్లాడుతూ పంచాయితీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వారి న్యాయమైన సమస్యలను తీర్చాలని, ఉద్యోగులను బెదిరింపులకు పాల్పడుతున్న ప్రభుత్వం గుణపాఠం తప్పదన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించిన ఎమ్మెల్యే



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి.

బొంరాస్‌పేట్,మే10,ప్రభాతవార్త :

కొడంగల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందించిన ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొంరాస్‌పేట్ మండలం ఏర్పుమల్ల గ్రామానికి చెందిన వైద్యఖర్చుల కోసం గురుకుల సురేష్‌రెడ్డికి 1లక్ష 25వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే అందించారు.ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రవేట్ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రిసహాయనిధి ఉపయోగపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు యాదగిరి,రైతుబంధు అధ్యక్షులు మహేందర్‌రెడ్డి,టీటీ రామునాయక్,యశ్ నాయకులు మహేందర్,బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మొండిగౌరెల్లిలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కును లబ్ధిదారుడికి అందజేస్తున్న దృశ్యం

యాచారం, మే 10 ప్రభాతవార్త

పేదింటి కలలను సాకారం చేస్తూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సహకారంతో మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన గోరేటి ముత్యాలుకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద మంజూరైన రూ. 20 వేల చెక్కును బుధవారం గ్రామ సర్పంచ్ బండిమీది కృష్ణ మాదిగ లబ్ధిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిరుపేదలకు వరమన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కట్టెల కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు దేరంగుల శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు తాండ్ర అంబేద్కర్, ఉపాధ్యక్షుడు దేవరకొండ శివ, ప్రధాన కార్యదర్శి కొలను జంగారెడ్డి, మండల ప్రచార కార్యదర్శి తాండ్ర శివలింగం, సోషల్ మీడియా కన్వీనర్ చెట్లపల్లి రాజు, సీనియర్ నాయకులు బోరిగ యాదయ్య, గౌరోజు శ్రీనివాస్‌చారి, బంటి యూత్ ఫోర్స్ నాయకులు మండల బాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం కప్ క్రీడలకు పేర్లు నమోదు చేయించుకోవాలి

-సర్పంచ్ కంబాలపల్లి ఉదయశ్రీ రవీందర్‌రెడ్డి

యాచారం, మే 10 ప్రభాతవార్త

మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో ఈ నెల 15వ తేదీ నుండి 17వ తేదీ వరకు సీఎం కప్ క్రీడల కింద క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ కంబాలపల్లి ఉదయశ్రీ రవీందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16-36 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారికి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించి సీఎం కప్ అందిస్తారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో విజేతలకు ప్రథమ బహుమతి లక్ష రూపాయలు, ద్వితీయ బహుమతి రూ. 75 వేలు, తృతీయ బహుమతి రూ. 50 వేలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్, ఫుట్‌బాల్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు నేడు ఉదయం వయస్సు నిర్ధారణ పత్రాలతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

## మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

దోమ,మే 10 ప్రభాతవార్త : మండల పరిధిలోని దోమ, దాదాపూర్,గుండాల్ గ్రామాలలో బుధవారం నాడు ప్రభుత్వ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు.ఈ సందర్భంగా దోమలో డిసిఎంఎస్ సంస్థ ద్వారా, దాదాపూర్ లోగుండాల్ గ్రామములో పిఎసిఎస్ ద్వారా రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు చేయనున్నారు.వరి ధాన్యంకొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికి రైతులకు సరిపడ వెయిట్ ఖాళీ సంచులు అందించాలనిమండల రైతులు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో దోమలో జడ్‌పిటిసి నాగిరెడ్డి,సర్పంచ్ రాజిరెడ్డి, వైస్‌ఎంపిపిమల్లేశం,మండల రైతుసమన్వయ అధ్యక్షులు బి.లక్ష్మయ్య,ఉపసర్పంచ్ గోపాల్‌గౌడ్,పిఎసిఎస్ చైర్మెన్ ప్రభాకర్‌రెడ్డి,మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు,ఎంపిటీసీ కావ్య,మాజీ యంపిపి రాజుగోపాలాచారి, నారాయణ, యాదయ్య,దాదాపూర్‌లో సర్పంచ్ క్రిష్ణ,యంపిటిసి నర్సిములు, వెంకటయ్య,మల్లేపల్లి సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.



దోమలో ధాన్యం కేంద్రాన్ని ప్రాంభిస్తున్న నాయకులు

# రాబోయేది బిఆర్‌ఎస్ ప్రభుత్వమే : మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్ మే10,ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది బిఆర్‌ఎస్ ప్రభుత్వమేనని కాబోయే ఎమ్మెల్యేను కూడా నేనే అని మంత్రి మల్లారెడ్డి జోస్యం చెప్పారు.బుధవారం దేవరయంజాల్ పరిధిలోని ఎస్‌ఎస్‌ఆర్ కన్వెన్షన్‌లో జరిగిన మేడ్చల్ నియోజకవర్గం ,గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ స్థాయి బిఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి మంత్రి మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైయారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అధినాయకత్వంలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రం ఉందన్నారు.సంక్షేమ పథకాలను సాధించిన నాటి నుండి అన్ని రంగాల్లో పురోగతి సాధించి ఆదర్శవంతమైన రాష్ట్రంగా తెలంగాణ రూపుదిద్దుకుందన్నారు.కేవలం మతాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయడమే బిజెపి పనిగా పెట్టుకుందన్నారు. తెలంగాణలో అమలు చేసే పథకాలు దేశంలో ఎక్కడా లేవని,దమ్మంటే బిజెపి పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ పథకాలు అమలు చేసి చూపించాలన్నారు.రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేసిన మోదీ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో బుద్ది చెప్తాలన్నారు.మళ్లీ తెలంగాణ రాష్ట్రంలో వచ్చేది బిఆర్‌ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి,రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నందారెడ్డి,బిఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మహేందర్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్,జడ్పీవైస్ చైర్మన్ వెంకటేష్,మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్ ,కౌన్సిలర్లు మల్లిఖార్జున ముదిరాజ్,పెంటయ్య,బాలరాజ్ జైపాల్ రెడ్డి,వీణ మున్సిపల్ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు సంజీవ,వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్ రెడ్డి,కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ రణదీర్ రెడ్డి,బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బుచ్చయ్య చారి, మాజీ సర్పంచ్ స్వామి,రాజేందర్,తదితరులు పాల్గొన్నారు.





# అంగడి చిట్టంపల్లిలో అంగరంగ వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం

-స్వామివారిని దర్శించుకున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి చైర్మన్ మనోహర్‌రెడ్డి



అంగడి చిట్టంపల్లిలో జరిగిన శివపార్వతుల కళ్యాణంలో పాల్గొన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి చైర్మన్ మనోహర్‌రెడ్డి తదితరులు

పూడూరు, మే 10, ప్రభాతవార్త ;

పూడూరు మండలం పరిధిలోని అంగడి చిట్టంపల్లి గ్రామ శివాలయం వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది.ఉదయం రుద్రాభిషేకము,సహస్ర పుష్పార్చన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి,బిఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పుల అనిల్‌రెడ్డి వేరువేరుగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వాహణకోసం డిసిసిబి చైర్మన్ మనోహర్‌రెడ్డి రూ.51 వేలు విరాళం అందజేశారు.అనంతరం మాట్లాడుతూ ఆలయం అభివృద్ధికి కృషి చేస్తామని వివరించారు.మండలంలోని వివిధ గ్రామాల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.రాత్రి సమయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భజన మండలిలు పాల్గొని శ్రీరామకోదెవెంకట దాసులవారి సంకీర్తనలు ఆలపించారు.దీంతో ఆలయం ఆవరణం అంతా శివనామ స్మరణతో మార్మోగింది.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టగా,ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు.ఎంపిపి మల్లేశం,సర్పంచ్ జయమ్మదాస్,ఎంపిటిసి నాగమణి విఠలయ్య,పిఎసిఎస్ డైరెక్టర్ శ్రీశైలంగౌడ్,వివిధ పార్టీల నాయకులు గంగాధర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, యాదవరెడ్డి,రమేష్,తదితరులు స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

# చరిత్ర వక్రీకరిస్తే తెలంగాణ కలాలు ఊరుకోవు

-తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్

ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :

పచ్చగా ఉన్న రాష్ట్రంలో మతచిచ్చుపెట్టి మంటలను లేపాలని చూసే శక్తులను తిప్పికొట్టడానికి సాహిత్య సాంస్కృతిక రంగాలు కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైందని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ అన్నారు.మతసామరస్యాన్ని,లౌకికతత్వాన్ని ప్రభోదించే సాహిత్య ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.వికారాబాద్ జిల్లా అనంతగిరి శ్రీ అనంత పద్మనాభ కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన జిల్లా కవులు రచయితల సమ్మేళన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని అనంత సాహిత్య సాంస్కృతిక వేదికను జూలూరు ప్రారంభించారు.అదే వేదికపైఅనంత సాహిత్య సంఘం లోగోను కూడా ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....మతఛాందసులకు తావులేని తెలంగాణ నేల చారిత్రక వారసత్వాన్ని చెక్కుచెదరకుండా కాపాడవలసిన బాధ్యత సాహిత్య రంగంపైనే ఉందని పేర్కొన్నారు.మతకుల ఆధిపత్యాల నుంచి దేశాన్ని రక్షించుకొనేది తెలంగాణ తనవంతు పాత్రను పోషిస్తుందన్న విశ్వాసాన్ని జూలూరు వ్యక్తం చేశారు..జిల్లాలో ఉన్న కవులు రచయితల సంఖ్య గర్వకారణంగా ఉందని వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అభినందించారు.జిల్లా చరిత్రను జిల్లా సాంస్కృతిక కళా నైపుణ్యతను కవులు, కళాకారులు చాటి చెప్పాలని అన్నారు.ఈ పని చేయడానికి ముందుకు వచ్చిన అనంత సాహిత్య అకాడమీ సంస్థకు అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా పాల్గొన్న రాష్ట్ర స్థాయి కవులు సాహితీవేత్తలను సన్మానించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ కాళోజీ పురస్కార తొలి గ్రహీత అమ్మంగి వేణుగోపాల్ అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డా.జె.చెన్నయ్య,ఉస్మానియా విశ్వవిద్యాలయ పూర్వాచార్యులు ఎం.బాగయ్య,కవి,నర్సింలు గుప్తా,ప్రముఖ కథారచయిత దోరవేటి,తదితరులు పాల్గొన్నారు.



# ఎమరాల్డ్ పార్కు ఓనర్స్ అసోసియేషన్ నుండి రక్షించాలని బాధితుల మొర



అన్నోజిగూడలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమరాల్డ్ కాలనీ ప్లాటు యాజమానులు.

ఘట్‌కేసర్ రూరల్, మే 10, ప్రభాతవార్త:


పోచారం మున్సిపల్ పరిధిలోని ఎమరాల్డ్ పార్కు కాలనీలో నివాసం ఉంటున్న కొందరి ప్లాట్లకు తాగునీటి వసతి, డ్రైనేజ్ వసతి లేకుండా స్థానిక అసోసియేషన్ వారు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అన్నోజిగూడలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమరాల్డ్ కాలనీ వాసులు ఎం. రామకృష్ణ చారి, పి. శ్రీనివాస్ రావు తదితరులు మాట్లాడుతూ ఎమరాల్డ్ పార్కు ఓనర్స్ అసోసియేషన్ పేరిట ఏర్పాటు చేసిన కార్యవర్గ సభ్యులు తమను పలు విధాలుగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. 2008లో ఏర్పాటు అయిన ఎమరాల్డ్ ప్లాట్లు దశల వారిగా బిల్డర్ వద్ద నుండి కొనుగోలు చేసినట్లు తెలిపారు. కాలనీ పేరిట ఏర్పాటు చేసిన అసోసియేషన్ వారు నెల నెల మెయింటెనెన్స్ పేరిట డబ్బులు వసూలు చేస్తూ ఎలాంటి ఆదాయ వ్యయాలు చూపకుండా అసోసియేషన్ ప్రతినిధులు నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ప్లాటు యాజమానులు మెయింటెనెన్స్ డబ్బులు చెల్లిస్తున్నా వాటి వివరాలు చూపకుండా నిధులు దుర్వినియోగం చేస్తున్నారని మెయింటెనెన్స్ చెల్లించని వారిపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ విషయమై తమ ఇండ్లపై దాడులకు పాల్పడుతున్న అసోసియేషన్ సభ్యుల్లో కొందరిపై ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అసోసియేషన్ ఆదాయ వ్యయాలపై వివరాలు అడిగిన వారిపై కక్ష సాధింపులకు పాల్పడుతూ ప్లాటుకు తాగునీటి వసతి లేకుండా చేయడం, డ్రైనేజీ వ్యవస్థను మూసి వేయడం, పార్కింగ్ స్థలాల విషయమై తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్‌కు ప్రజాస్వామ్య పద్దతిలో ఎన్నికలు ఏర్పాటు చేయడం లేదు. ఒక్కరైనా ఆఫీస్ బేరర్లు లేకుండా తమ ఇష్టానుసారం ప్లాటు ఓనర్స్ నుండి డబ్బులు వసూలు చేస్తూ ఇదేమిటని ప్రశ్నించిన వారిపై కక్ష సాధింపు వేధింపులకు దిగుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ విషయమై పోచారం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. తమ ప్లాట్లలో నివాసం ఉండనివ్వకుండా తమకు మనశాంతి లేకుండా అసోసియేషన్ సభ్యులు చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ విషయమై పోచారం మున్సిపల్ చైర్మన్‌తో పాటు కమిషనర్‌లు చొరవచూపి సమస్యను పరిష్కరించాలని ఎమరాల్డ్ ప్లాటు యాజమానులు పత్రిక ముఖంగా మొరపెట్టుకున్నారు. విలేకరుల సమావేశంలో పాల్గొన్న వారిలో ప్లాటు యాజమానులు ఎం. రామకృష్ణ చారి, పి. శ్రీనివాస్ రావు, హరికిశోర్ శ్రీవాస్తవ్, కరణ్, వెంకటనారాయణ తదితరులు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు బార్ అసోషియేషన్ సభ్యుడిగా జగన్

ఆమనగల్లు, మే10, ప్రభాతవార్త: భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు బార్ అసోషియేషన్ సభ్యుడిగా హైకోర్టు న్యాయవాది, సుప్రీంకోర్టు పాత జగన్ సారథ్యం ... ప్రముఖ న్యాయవాది ఉడుతల జగన్ నియమితులయ్యారు. సుప్రీంకోర్టు 12 మంది న్యాయవాదుల మద్దతుతో బార్ అసోషియేషన్‌లో సభ్యుడిగా ఆయనకు స్థానం లభించింది. బార్ కౌన్సిల్ అసోషియేషన్ ద్వారా అసోషియేషన్ సభ్యుడిగా జగన్ బుధవారం సర్టిఫికేట్ అందుకున్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉడుతల జగన్ న్యాయవాది వృత్తితో విశేష సేవలందిస్తూ పేరుగాంచారు. అంతేకాకుండా 2016 నుండి ప్రైవేటు ఆసుపత్రుల బాధితుల సంఘం తరఫున ఆయన పేదలకు పలు రకాల సేవలందిస్తున్నారు. 2022 డిసెంబర్‌లో హైకోర్టు అసోషియేషన్ సభ్యునిగా నియమితులయ్యారు. బార్ అసోషియేషన్ సభ్యునిగా ఎన్నుకోవడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి జగన్ ధన్యవాదాలు తెలిపారు. న్యాయ వ్యవస్థ చట్టాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని ఆయన హామి ఇచ్చారు. కాగా సుప్రీంకోర్టు బార్ అసోషియేషన్ సభ్యునిగా ఎన్నికకావడం పట్ల కల్వకుర్తి నియోజకవర్గంలోని పలువురు న్యాయవాదులు, ప్రజా ప్రతినిధులు, ప్రజాసంఘాల నేతలు జగన్‌కు అభినందనలు తెలిపారు.

## కార్యకర్తలకు అండగా కాంగ్రెస్ పార్టీ

-బీమా చెక్కుల పంపిణీలో కాంగ్రెస్ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి



మృతుల కుటుంబాలకు భీమా చెక్కులను అందజేస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్,మే 10ప్రభాతవార్త

కాంగ్రెస్ పార్టీ అభివృద్ది కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి అన్నారు.బుధవారం స్థానిక పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొడంగల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పార్టీ సభ్యత్వం చేసుకొని ఇటీవలే ప్రమాదవశాత్తు మరణించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద భీమా కింద రూ.2లక్షలు చొప్పున 5 కుటుంబాలకు రూ.10లక్షల చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలం,బలగం అన్నారు.అంతేగాక పార్టీకి వెన్నుకొమ్ములు,సైనికుల్లా పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటూ అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు.అనంతరం దుద్యాల గ్రామానికి చెందిన కర్నె అశోక్ పార్టీ సభ్యత్వం పొంది ఇటీవలే మరణించడంతో ఆయన కుటుంబానికి రూ.2లక్షల చెక్కును అందజేశారు.అలాగే దుద్యాల మండలం చిలుముల్‌మైలారం గ్రామానికి చెందిన బాలకిష్టయ్య,దౌల్తాబాద్ మండలం బిచ్చాల్ గ్రామానికి చెందిన బొందెలి కిరణ్‌కుమార్,కొడంగల్ మండలంలోని హస్నాబాద్‌కు చెందిన బోయిని శామమ్మ,కొడంగల్ మండలంలోని ఈడిమేశ్వరం గ్రామానికి చెందిన యాలాల లక్ష్మీ కుటుంబ సభ్యులకు ఒక్కో కుటుంబానికి రూ.2లక్షలు చొప్పున రూ.10లక్షల చెక్కులను మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు ఎండీ.యుసుఫ్,నందారం ప్రశాంత్,కొడంగల్ నయ్యూం,ఆనంద్‌రెడ్డి,సోమశేఖర్,బీమయ్య,దాము,రాము,మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌నాయక్,తార్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించడం ప్రతి ఒక్కరి బాధ్యత

-ఎస్సై రవిగౌడ్



హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రవిగౌడ్

కొడంగల్,మే 10ప్రభాతవార్త

ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో విధిగా హెల్మెట్ ధరించడం బాధ్యతగా భావించాలని ఎస్సై రవిగౌడ్ అన్నారు.బుధవారం మండల పరిధిలోని చిట్లపల్లి స్టేజీ సమీపంలో హెల్మెట్ ధరించడంపై వాహనదారులకు అవగాహన కల్పించారు.ప్రయాణ సమయంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతో ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగిన పక్షంలో ప్రాణాపాయస్థితినుంచి సురక్షితంగా బయటపడే అవకాశం ఉంటుందన్నారు.రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది హెల్మెట్ ధరించక పోవడంతోనే తమ విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రోడ్డు ప్రమాదాల్లో శరీరంలో ఏదైనా అవయవాలు కోల్పోయినా నయం చేసుకోవచ్చని,కానీ హెల్మెట్ లేకపోవడంతో ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని,ఇందుకుగాను ప్రతి ఒక్కరూ ప్రయాణ సమయంలో విధిగా హెల్మెట్‌ను ధరించాలని ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు.అనంతరం ప్రయాణ సమయంలో హెల్మెట్ ను ధరిస్తామని ద్విచక్ర వాహనదారులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## హనుమాన్ దేవాలయ నిర్మాణానికి విరాళం



గుడి నిర్మాణానికి విరాళం అందిస్తున్న మనోహర్‌రెడ్డి

దోమ,మే 10 ప్రభాతవార్త :

మండల పరిధిలోని గొడుగోనిపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి గుడి నిర్మాణం చేపట్టేందుకు గ్రామస్తులు ముందుకు వచ్చారు.గ్రామస్తులందరు కలిసి గుడి నిర్మాణం కోసం సహాయంఅందించాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి చైర్మెన్ బుయ్యని మనోహర్‌రెడ్డి కోరారు.ఈ విషయంపై బుధవారం నాడు మనోహర్‌రెడ్డి గ్రామములో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడి గుడి నిర్మాణం కోసంస్థలాన్ని పరిశీలించారు.గ్రామస్తులందరు కలిసి కట్టుగా ఉండి గుడి నిర్మాణం కోసం చేపట్టాలని గ్రామస్తులకుసూచించారు.తన వంతు సహాయంగా గుడి నిర్మాణం కోసం 50 వేలు గ్రామస్తులకు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అమ్మతులనేయులు,ఉపసర్పంచ్ వెంకటరెడ్డి, జిల్లా గ్రంధాలయ డైరెక్టర్‌బంగ్లయాదయ్య,బిఆర్ఎస్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి,వార్డు సభ్యులు,గ్రామస్తులు,యువకులు పాల్గొన్నారు.

## గోడ కూలి కార్మికుడు మృతి

కీసర,మే10,ప్రభాతవార్త: గోడ కూలి కార్మికుడుమృతి చెందిన సంఘటన బుధవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి శాస్త్రినగర్ కాలనీలోని ఎంఎంఆర్ ఎక్విప్‌మెంట్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికుడు గన్నవరం వెంకటేశ్వర్లు (58) కంపెనీలో గోడ నాణ్యత లోపం వల్ల కార్డిపాతి వర్షానికి గోడ కూలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడిది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిద్దలూరు గ్రామానికి చెందినవాడు.కాగా నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీనగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు.సమాచారం అందుకున్న పోలీసులు యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే కార్మికుడు మృతి చెందాడని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పది పరీక్షల ఫలితాల్లో మెరిసిన జిల్లా విద్యార్థులు

### పెద్దేముల్ మండలంలో 31.72 శాతము ఉత్తీర్ణత

పెద్దేముల్, మే 10, ప్రభాతవార్త: పెద్దేముల్ మండలంలోని ఆయా పాఠశాలల్లో పదవ తరగతి ఫలితాలలో 31.72 శాతము ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి వెంకటయ్యగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గొట్లపల్లి మాడల్ స్కూల్‌లో 97 మంది విద్యార్థులకు గాను 24 మంది ఉత్తీర్ణత, జడ్‌పిహెచ్‌ఎస్ పెద్దేముల్ బాలురలో 87కు గాను 44, జడ్‌పిహెచ్‌ఎస్ పెద్దేముల్ బాలికలో 36కు 14, జడ్‌పిహెచ్‌ఎస్ ఆడ్కిచర్లలో 14కు 3, జడ్‌పిహెచ్‌ఎస్ ఇందూరు 44కు 2, జడ్‌పిహెచ్‌ఎస్ ఇందూరు ఉర్దూ మీడియంలో 12కు 3, జడ్‌పిహెచ్‌ఎస్ కందనెల్లిలో 48కి 16, జడ్‌పిహెచ్‌ఎస్ మంబాపూర్‌లో 83కు 15, జడ్‌పిహెచ్‌ఎస్ మారేపల్లిలో 16కు 5,జడ్‌పిహెచ్‌ఎస్ తట్టేపల్లిలో 21కి 10, కేజీబీవి మారేపల్లిలో 37కు 21 మంది విద్యార్థులు పాసయ్యారు. మొత్తము 495 మంది విద్యార్థులకు గాను 157 మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు.

### 54.39 శాతం ఉత్తీర్ణత సాధించిన పూడూరు మండలం

పూడూరు, మే 10, ప్రభాతవార్త ; తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన 10వ తరగతి ఫలితాల్లో పూడూరు మండలం చెన్‌గోముల్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన టి పావని,టిఎస్‌ఎంఎస్ పూడూరుకు చెందిన సి.బింధు 9.8 సిజిపిఏతో మండల్ టాపర్‌గా నిలిచారు.టిఎస్‌ఎంఎస్ పూడూరుకు చెందిన పి.కవిత 9.2సిజిపిఏతో మండల్ సెకండ్ టాపర్‌గా నిలిచింది.మండలంలోని 12 జిల్లాపరిషత్తు పాఠశాలలకు చెందిన 467 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాయగా.262 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 54.39 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి హరిశ్చంద్ర తెలిపారు.

### చౌడపూర్ మండలంలో పది ఫలితాలలో 69శాతం ఉత్తీర్ణత

చౌడాపూర్ మే10,ప్రభాతవార్త : రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన పదవ తరగతి ఫలితాలలో చౌడాపూర్ మండలంలో 69 శాతం ఉత్తీర్ణత పొందారు.మండల పరిధిలోని జడ్పీహెచ్‌ఎస్ మరికల్ పాఠశాల చెందిన విద్యార్థులు ప్రవళిక, రాజేశ్వర్,శ్రుతిలకు 9.2 జిపిఏతో మండల టాపర్‌గా నిలిచారు.పాఠశాల వారిగా జడ్పీహెచ్‌ఎస్ కొత్తపల్లిలో 91శాతం,జడ్పీహెచ్‌ఎస్ మరికల్ 84శాతం, జడ్పీహెచ్‌ఎస్ వాలేల్లపల్లి 75శాతం,కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలలో 81శాతం జడ్పీహెచ్ ఎస్ చౌడాపూర్ 45శాతం ,జడ్పీహెచ్‌ఎస్ మందిపాల్ 41శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

### పది పరీక్షల్లో టీజీ గురుకుల విద్యార్థుల హవా

కొడంగల్,మే 10ప్రభాతవార్త : మహాత్మాజ్యోతిబా పూలే టీజీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు 10వ తరగతి పరీక్షల్లో 95శాతం ఉత్తీర్ణతతో సత్తాచాటారు.2023 మార్చిలో జరిగిన పది పరీక్షల్లో పాఠశాలకు చెందిన 39 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 37 మంది విద్యార్థులు ఉత్తీర్ణతతో 95శాతం పాస్ కావడం జరిగిందని పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.శంకర్‌బాబు తెలిపారు. అందులో అత్యధికంగా డి.గణేష్ (9.7జీపీఏ), కె.అంజియులు (9.2జీపీఏ), కె.దామోదర్(9.0)యు,ప్రశాంత్(9.0)సాధించగా8.8-5,8.5-2,8.3-01,8.2-4,8.0-7జీపీఏ ర్యాంకులతో విద్యార్థులు ఉత్తీర్ణులు కావడం జరిగిందన్నారు. ఇందుకుగాను పాఠశాల ప్రిన్సిపాల్ శంకర్‌బాబు మాట్లాడుతూ ఈ యొక్క ఫలితాలకు కృషి చేసిన ఉపాధ్యాయులను,విద్యార్థులను అభినందించారు.ఇదిలావుండగా కొడంగల్ మండలంలోని సంబంధించి 555 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరుకాగా అందులో 333 మంది విద్యార్థులు ఉత్తీర్ణత (60శాతం) సాధించినట్లు ఎంఈఓ రాంరెడ్డి తెలిపారు.అందులో అత్యధికంగా గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థి 9.8జీపీఏ గా ర్యాంకుతో పాటు కేజీబీవి విద్యార్థిని 9.2జీపీఏ సాధించగా మండలంలోని హస్నాబాద్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థి 8.5జీపీఏ ర్యాంకు సాధించినట్లు ఎంఈఓ తెలిపారు.

# పోలీస్ స్టేషన్ ఆవరణలోనే బిజెపినేతపై ఎమ్మెల్యే దాడి!

**అమేథి,మే 10:** పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే ఒక ఎమ్మెల్యే బిజెపి నేత భర్తపై భౌతిక దాడికి దిగిన సంఘటన సంచలనం కలిగించింది. సమాజ్‌వాదిపార్టీ ఎమ్మెల్యే రాకేష్‌ప్రతాప్‌సింగ్ బిజెపి నేత భర్త అయిన దీపక్‌సింగ్‌పైనే దాడికి దిగి తీవ్రంగా కొట్టిన వీడియోలు ఇపుడు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. మున్సిపల్‌ఎన్నికల్లో



బిజెపి అభ్యర్థిగా ఉన్న రష్మిసింగ్‌భర్త దీపక్‌సింగ్‌కు మధ్య పోలీస్‌స్టేషన్‌లోనే ఒకరిపై ఒకరు దూషణకు దిగారు. తదనంతరం ఒక్కసారిగా ఇరువురిమధ్య వైరం పెరిగిపోయింది. ఎమ్మెల్యే రాకేష్‌ప్రతాప్‌సింగ్ వచ్చీరావడంతోనే దీపక్‌సింగ్ చొక్కా పట్టుకుని కొడుతూ లాగుతూ పీకుతూ కనిపించారు. ఆయన అనుచరులుసైతం దీపక్‌సింగ్‌పై దాడికి దిగారు. దీనికిపైగా పోలీసులు రాకేష్‌ప్రతాప్‌సింగ్‌ను, దీపక్‌సింగ్‌ను వేరుచేయడానికి ఎంతో శ్రమపడాల్సి వచ్చింది. అతికష్టంమీద ఇద్దరినీ వేరుచేసారు. ఈ సంఘటన అమేథి జిల్లాలోని గౌరిగంజ్ కొత్వాలి పోలీస్‌స్టేషన్ ఆవరణలో జరిగింది. సమాజ్‌వాదిపార్టీ నాయకుడి వివరాలప్రకారం దీపక్‌సింగ్ స్టేషన్‌కు వచ్చిరావడంతోనే తిట్లపురాణం అందుకున్నాడని, అప్పటికే స్టేషన్ ఎదుట నిరసన ప్రదర్శనలో ఉన్న రాకేష్‌ప్రతాప్‌సింగ్ దీపక్‌సింగ్ తిట్లతో ఆగ్రహావేశాలతో ఊగిపోయినట్లు తేలింది. దీపక్‌సింగ్, ఆతని మద్దతుదారులు తన మద్దతుదారుల్లో కొందరిపై దాడిచేసి గాయపరిచారని అందుకుగాను పోలీసులు ఎలాంటిచర్యలు తీసుకోలేదని నిరసన తెలుపుతూ స్టేషన్‌వద్దప్రదర్శనకు దిగారు. ఈ నిరసనమధ్యలోనే దీపక్‌సింగ్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. సమాజ్‌వాదిపార్టీ ఎమ్మెల్యేని, ఆతని మద్దతుదారల్ని బహిరంగంగానే తిడుతూ కనిపించారు. దీనితో పరిస్థితిచేయిదాటిపోయింది. ఎమ్మెల్యే ఒక్కసారిగాదూకుడుగా వచ్చి దీపక్‌సింగ్‌పై దాడికి దిగారు. వెంటనే పోలీసులు అప్రమత్తం అయి ఇరువురినీ వేరుచేసి దీపక్‌సింగ్‌ను మరోవైపునుంచి బయటికి పంపించివేసారు. సీనియర్‌పోలీస్ అధికారి ఒకరు మాట్లాడుతూ ఇద్దరు రాజకీయ ప్రత్యర్థులు ఒకరిపై ఒకరు దౌర్జన్యం చేసుకున్నారని, ప్రస్తుతానికి పరిస్థితిని చక్కదిద్దామని, చర్యలు తీసుకుంటామని, ఇరువైపులా కేసులునమోదుచేసినట్లు తెలిపారు.

# ఐదేళ్లుగా సమస్యల్లోనే సిఎం కుర్చీ

## ఏం ప్రభుత్వం ఇది, అంతర్గతపోరుతోనే కాలక్షేపం

## రాజస్థాన్‌ప్రభుత్వంపై ప్రధాని మోడీ చురకలు



**జైపూర్, మే 10:** రాజస్థాన్‌లో ఉన్న ప్రభుత్వం ఎలా ఉందో అందరికీ తెలుస్తోంది, ఇద్దరు నేతలు ఒకరిపై ఒకరు విమర్శలుచేసుకోడానికి పోటీపడుతున్నారని, ఇక రాష్ట్ర అభివృద్ధి ప్రజా సంక్షేమం కోసం ఏం పట్టించుకుంటారని ప్రధాని నరేంద్రమోడీ విమర్శించారు. పార్టీకి చెందిన సొంత ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని విశ్వసించలేని స్థితిలో ఉన్నారని, ప్రభుత్వంలో ప్రతి ఒక్కరూ ఒకరినొకరు అవ మానించుకోడానికి పోటీపడుతున్నారని, ఐదేళ్లపాటుకూడా ముఖ్యమంత్రి కుర్చీ సమస్యలతో ఉంటే రాజస్థాన్ అభివృద్ధిని ఎవరు పట్టించు కుంటారని మోడీ ప్రశ్నించారు. రాజస్థాన్‌కాంగ్రెస్‌నేత మాజీ డిప్యూటిసిఎం సచిన్‌పైలట్ ముందురోజే విమర్శలుచేస్తూ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ నాయకురాలు బిజెపికి చెందిన వసుంధరరాజే సింధియా అని సోనియా గాంధీ కాదని ఎద్దేవాచేసారు. అంతేకాకుండా తాను పార్టీని ఎంతమాత్రం వీడటానికి, రాజస్థాన్ ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలను ఎంతమాత్రం దెబ్బతీయనని చెప్పుతూనే ముఖ్యమంత్రి అశోక్‌గెహ్లోత్‌పై విమర్శలుదాడిచేసారు. అజ్మీర్‌నుంచి జైపూర్‌వరకూ జనసంఘర్షయాత్రను నిర్వహిస్తున్నట్లు కూడా ప్రకటించారు. మాజీ ముఖ్యమంత్రి వసుంధరరాజే సింధియా తన ప్రభుత్వానికి ఎంతోసాయం చేసారని, 2020లో కొందరు ఎమ్మెల్యేలతో సచిన్‌పైలెట్ తిరుగుబాటుసమయంలో వసుంధర ఎంతో సాయంచేసారని అశోక్‌గెహ్లోత్ వ్యాఖ్యలు చేసారని సచిన్ ఈసందర్భంగా గుర్తుచేసారు. అయితే ఈవ్యాఖ్యలనే సాకుగా తీసుకుని ఏం ప్రభుత్వం నడుస్తోంది రాజస్థాన్‌లో అంటూ మోడీ ఎద్దేవాచేయడంతో వేదికపైనే ఉన్న ముఖ్యమంత్రి గెహ్లోత్ రాజస్థాన్ ఇపుడు మోడీ సొంతరాష్ట్రం గుజరాత్‌ను అధిగమించిందని, అభివృద్ధిపరంగా గుజరాత్‌తో తమకు పోటీలేదని పేర్కొన్నారు. జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు ప్రారంభం చేందుకు వచ్చిన మోడీకి స్వాగతం పలుకుతూనే రాజస్థాన్‌లో అభివృద్ధి శరవేగంగాజరిగిందన్నారు. రోడ్లు ఎంతో మెరుగ్గా ఉన్నాయన్నారు. రాజస్థాన్‌లో 5500 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభించిన, రాజస్థాన్‌ప్రజలను అభినందిస్తున్నట్లు మోడీ పేర్కొన్నారు. రాజస్థాన్‌లో ఆధునిక మౌలికవసతుల కల్పనకు తమ ప్రభుత్వం కృషిచేస్తున్నదన్నారు. ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలోచూసేవారికి ప్రతి అంశం ప్రతి కూలంగానే కనిపిస్తుందని మోడీ చెప్పారు. గవర్నర్ కల్‌రాజ్‌మిశ్రా, ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్‌లు కలిసి ప్రధానిమోడీకి ఎయిర్ పోర్టులో సాదరంగా ఆహ్వానం పలికారు.

ఈ ఏడాది డిసెంబరులో ఎన్నికలకు వెళుతున్న రాజస్థాన్‌లో ప్రధానిమోడీ ఇప్పటికే మూడుసార్లు పర్యటించారు.

# విపక్ష ఐక్యకూటమికోసం బీహార్ సిఎం కసరత్తులు

## ముంబయిలో పవార్, థాకరేలతో భేటీ

**ముంబయి, మే 10:** ప్రతిపక్షపార్టీలన్నింటినీ ఏకంచేసేందుకు బీహార్ జెడియు అధ్యక్షుడు ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ కసరత్తులు ముమ్మరం చేసారు. ఇప్పటికే రాహుల్‌గాంధీని, ఒడిస్సా ము ఖ్య మంత్రి నవీన్ పట్నాయక్‌ను కలి



సిన జనతాదళ్ చీఫ్ తాజాగా మంబయి లో మహారాష్ట్ర నేత లను కలిసి వారితో చర్చలుజరిపారు. శివసేన చీఫ్ ఉద్ధవ్‌థాకరేతోకలిసి మాతోశ్రీలో విందుకు హాజరయ్యారు. అంతకుముందే నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శరద్‌పవార్‌నుకలిసి చర్చలు జరిపారు. దక్షిణముంబయిలోని సిల్వర్ ఓక్స్ నివాసంలో నితీష్ పవార్ ఇతర ఎన్‌సిపినేతలను కలిసి చర్చలు జరిపారు. భావసారూప్యతకలిగిన చిన్న పార్టీలన్నింటినీ ఏకంచేసేందుకు నితీష్‌కుమార్ సారథ్యం వహిస్తున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అందరినీ ఒకే వేదికపైకితెచ్చి బిజెపికి గట్టిపోటీ ఇవ్వాలని నిర్ణయించారు. విపక్షాలను ఐక్యంచేసే కార్యాచరణతోపాటు వివిధ పార్టీలతో తనకున్న వైరుధ్యాలను కూడా ఈచర్చలతో పరిష్కరించుకుంటున్నారు. జెడియు ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్సీ కపిల్ పాటిల్‌మాట్లాడుతూ బిజెపి వ్యతిరేకంగాపోరాడుతున్న తమ నాయకుడు నితీష్‌కుమార్‌కు విపక్ష పార్టీలనుంచి అనూహ్యరీతిన ఆదరణ లభిస్తోందని వారంతా మద్దతిస్తున్నా రన్నారు. 1977లో అన్ని కాంగ్రెస్సేతర పార్టీలు కూడా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఒక్కటయి పోటీ చేసారని, అత్యవసర పరిస్థితి నుంచి దేశాన్ని ప్రజాస్వా మ్యాన్ని పరిరక్షించేందుకు ఆనాడు ఏకం అయ్యాయని, అదే తరహాలో ఇపుడు విపక్ష పార్టీలన్నీ కూడా రాజ్యాంగ పరిరక్షణకోసం బిజెపికి వ్యతిరేకంగా ఒక్కటవుతున్నాయన్నారు. విశేష పాలనానుభవంతోపాటు రాజకీయ అనుభవం కూడా ఉన్న తమ నాయకుకి రాజకీయంగా ఎలాంటి మచ్చలేదన్నారు. బీహార్ సిఎం ఒక్కరు మాత్రమే ఏవ్వరినయినాసరే ఏకం చేయగలరని, కాంగ్రెస్ పార్టీకూడా తమకూటమిలోప్రధానంగా ఉంటుందని అన్నారు. బిజెపికి వ్యతిరేకంగా ఎవరో ఒకరు నాయకత్వం వహించి విపక్ష కూటమికి సారధిగా ఉంటే తాము మద్దతిస్తామని ఎన్‌సిపి చీఫ్ శరద్‌పవార్ వెల్లడించారు. అంతకుముందే బెంగాల్‌ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, కాంగ్రెస్‌నేత సోనియా గాంధీ, రాహుల్, సమాజ్‌వాదిపార్టీ నేత అఃలేష్‌యాదవ్‌లను కూడా కలిసిన నితీష్‌కుమార్ ఇపుడు ముంబయిలో శరద్‌పవార్, ఉద్ధవ్‌థాకరేలను కూడా కలిసి విపక్ష ఐక్యకూటమిపై చర్చలు జరిపారు.

# ప్రత్యేక న్యాయస్థానం ఎదుటకు ఇమ్రాన్ ఖాన్!

**ఇస్లామాబాద్, మే 10:** మాజీ ప్రధాని, పిటిఐ పార్టీ అధినేత ఇమ్రాన్ ఖాన్‌ను ఎట్టకేలకు ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపర్చారు. ఆయన్ను 14 రోజుల రిమాండ్‌కు ఇవ్వాలని ఎన్‌ఎబి కోరింది. బుధవారం ఇస్లామాబాద్ పోలీస్ లైన్స్‌లోని ప్రధాన కార్యాలయంలోని కొత్త అతిథి గృహాన్ని న్యాయస్థానంగా మార్చేశారు. ఇక్కడ ఖాన్‌పై నమోదైన రెండు కేసులను విచారించనున్నారు. యాంటీ అకౌంటబిలిటీ కోర్టు నెంబర్ 1 ఈ న్యాయస్థానంలో జడ్జిగా మహమ్మద్ బషీర్ వ్యవహరించారు. గతంలో నవాజ్ షరీఫ్ కుమార్తె మరియంపై నమోదైన అవినీతి కేసులను ఈ న్యాయమూర్తే విచారించారు. అప్పట్లో ఆమెకు శిక్షపడింది. అల్‌ఖాద్రీ ట్రస్ట్ భూములపై విచారణ సందర్భంగా ఖాన్‌ను 14 రోజులపాటు రిమాండ్‌కు ఇవ్వాలని ఎన్‌ఎబి లాయర్లు కోరారు. దీనిని ఇమ్రాన్ తరఫున న్యాయవాద బృందం తీవ్రంగా వ్యతిరేకించింది. అంతేకాదు తక్షణమే ఇమ్రాన్‌ను



విడుదల చేయాలని కోరింది. అనంతరం న్యాయమూర్తి విరామం తీసుకున్నారు. వాస్తవానికి నేడు ఇమ్రాన్‌ను కలిసేందుకు న్యాయసలహా బృందానికి తొలుత అనుమతులు లభించలేదు. కానీ కొద్దిసేపటి తర్వాత ఖాన్‌ను కలిసేందుకు వారిని అనుమతించారు. ఇమ్రాన్‌ఖాన్ మరో కేసులో జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి హుమాయూన్ దిలావర్ ఎదుట కూడా హాజరుకానున్నారు. ప్రభుత్వానికి చెందిన బహుమతులు విక్రయించిన విషయంలో ఇమ్రాన్ ఎదుర్కొంటున్న ఆరోపణలపై ఇక్కడ విచారించనున్నారు. ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పిటిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు విచారణ కేంద్రం వద్ద గుమిగూడకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. దీంతోపాటు మీడియా ప్రతినిధులు కూడా ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. మరోవైపు పిటిఐ ఉపాధ్యక్షుడు షా మహమూద్ ఖురేషి, కార్యదర్శి అసద్ ఉమర్‌ను కూడా పోలీసులు అడ్డుకొన్నారు. దీంతో వీరు ఇస్లామాబాద్ హైకోర్టులో పిటిషన్ వేయడానికి యత్నించారు. కానీ అంతకు ముందే ఉగ్రవాద వ్యతిరేక బృందం పోలీసులు అసద్ ఉమర్‌ను అరెస్టు చేశారు. ఇక పాక్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో భారీ ఎత్తున ఆందోళనలు చెలరేగాయి. దాదాపు 1000 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఇక్కడ జరిగిన అల్లర్లలో దాదాపు 130 మంది పోలీసులు అధికారులు గాయపడ్డారు. అవినీతి కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను పారామిలిటరీ రేంజర్లు అరెస్టు చేశారు. ఓ అవినీతి కేసుకు సంబంధించి ఇస్లామాబాద్ హైకోర్టులో విచారణకు హాజరైన ఆయనను కోర్టు బయట అదుపులోకి తీసుకున్నారు. ఐఎస్ఐ కనుసన్నల్లోని సైన్యం తనను చంపడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించిన నేపథ్యంలో పాకిస్థాన్ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ అధినేత అయిన 70 ఏళ్ల ఇమ్రాన్‌ను అరెస్టు చేయడం గమనార్హం. ఆయన అరెస్టుతో దేశవ్యాప్తంగా విధ్వంసకర సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఆర్మీ ప్రధాన కార్యాలయంపైనా ఇమ్రాన్ పార్టీ కార్యకర్తలు దాడి చేశారు.

# ఒక్కరోజులో కరోనా కేసులు 2102, మృతులు 8

## దేశంలో మొత్తం కరోనా బాధితులు 4,49,74,909

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి వైదరాబాద్,మే10:** భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 2102 కేసులు నమోదయ్యాయి. మృతి 8 మంది. ఇప్పటివరకు దేశంలో కరోనా బారిన పడిన మొత్తం బాధితుల సంఖ్య 4,49,74,909కి చేరిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది. మొత్తం బాధితుల్లో ఇప్పటి వరకు 4,44,21,781మంది కోలుకోగా 21,406మంది దేశంలోని వివిద ఆసు పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు దేశంలో కరోనా కారణంగా మృతి చెందిన వారి సంఖ్య 5,31,722చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ బారినపడి కోలుకుంటున్న వారి(రికవరీ రేటు) 98.77 శాతంగా ఉంది. దేశంలో కరోనా కాం˘ణం గా మరణాల రేటు 1.18శాతంగా ఉంది. మహా రాష్ట్రలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 81,67,595కి చేరగా, 80,17,530మంది కోలుకున్నారు. 1,48,538మంది ప్రాణాలు కోల్పోయారు.

# సామూహిక బహిష్కరణ, ఒక్కరు ఓటు వేస్తే ఒట్టు నాయకులనే తరిమిన గ్రామస్తులు

**బెంగళూరు, చామరాజనగర మే 10:** కర్ణాటకలో 224 అసెంబ్లీ నియోజక వర్గాల్లో బుధవారం ఉదయం 7 గంటలకే పోలింగ్ మొదలైయింది. పలు నియోజక వర్గాల్లో ఓటర్లు ఉదయం నుంచి క్యూలైన్లలో నిలబడి ఓటు వేస్తున్నారు. ఓటు హక్కు అందరూ వినియోగించుకోవాలని ఎన్నికల అధికారులు పదేపదే మనవి చేస్తూనే ఉన్నారు. అయితే కర్ణాటకలోని చామరాజనగర జిల్లాలోని ఓ పోలింగ్ కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం వరకు ఒక్కరు కూడా ఓటు వేయలేదు. మీరు రాత్రి వరకు ఇక్కడే ఉన్నా ఎవ్వరూ వచ్చి ఓటు వేయరని గ్రామస్తులు తేల్చి చెప్పడంతో ఎన్నికల అధికారులు, పోలింగ్ విధులకు వెళ్లిన సిబ్బంది బిత్తరపోయారు. చామరాజనగర జిల్లాలోని గుండ్లుపేట తాలుకాలో చిక్క ఎలచెట్టి అనే గ్రామం. గ్రామంలోని ప్రభుత్వ స్కూల్‌లో ఎన్నికల అధికారులు పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్కూల్‌లోని పోలింగ్ బూత్‌లో పోలింగ్ విధులకు హాజరైన సిబ్బంది ఐదు మంది, సాయుధ పోలీసులతో పాటు బిజెపి, కాంగ్రెస్, జెడిఎస్ పార్టీలకు చెందిన ఏజెంట్లు కూర్చుని ఉన్నారు. ఉదయం 7 గంటల నుంచి గ్రామస్తులు వచ్చి ఓటు వేస్తారని పోలింగ్ విధుల్లో ఉన్న సిబ్బంది ఎదురు చూశారు. బుధవారం మధ్యాహ్నం 1.30 గంటల వరకు కూడా ఒక్కరు కూడా ఓటు వేయడానికి పోలింగ్ బూత్‌లోకి వెళ్లలేదు. పోలింగ్ విధుల్లో ఉన్న సిబ్బంది, ఎన్నికల అధికారులు గ్రామంలోకి వెళ్లి ఓటు వేయడానికి రావాలని గ్రామస్తులకు మనవి చేశారు. మా గ్రామంలో ఇంతవరకు ఒక్క పని జరగలేదని, తాగడానికి మంచినీరు లేదని, రోడ్లు లేవని, డ్రైనేజీలు లేవని, ఎన్నిసార్లు నాయకులకు చెప్పినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. ఎన్నికల సమయంలో మాత్రమే మా గ్రామం ఇక్కడి నాయకులకు గుర్తుకు వస్తుందని, తర్వాత ఐదు సంవత్సరాలు ఈ పక్కకు కూడా చూడరని, అందుకే ఎన్నికలను బహిష్కరిస్తున్నామని గ్రామస్తులు మండిపడ్డారు. మేము కచ్చితంగా ఓటు వేయమని గ్రామస్తులు తేల్చి చెప్పడంతో ఎన్నికల అధికారులు షాక్ తిన్నారు. అటవి ప్రాంతానికి ఆనుకుని ఉన్న ఈ గ్రామంలో సరైన వసతులు లేవని నాయకులు అందరికి తెలిసినా వారు ఏ మాత్రం పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయాలని చెప్పిన కొందరు నాయకులకు పోరారే పోరా అంటూ గ్రామస్తులు ఎదురుతిరగడంతో ఆ నాయకులు కాలికి పని చెప్పారని తెలిసింది.

# ఆసుపత్రిలో కస్టడీ నిందితుడి వీరంగం - చికిత్సచేస్తున్న యువ వైద్యురాలి హత్య

**కొల్లాం(కేరళ),మే 10:** కేరళలోని కొల్లాం జిల్లాలో 23 ఏళ్ల వైద్యురాలు కత్తిపోట్లకు గురై మరణించింది. జిల్లాలోని కొట్టారక్కర ప్రాంతంలోని ఆసుపత్రిలో పనిచేస్తున్న సమయంలోనే సస్పెండ్ అయిన ఒక స్కూలు టీచర్ నిర్వాకానికి వైద్యురాలు బలై పోయింది. కుటుంబసభ్యులతో జరిగిన ఘర్షణకు సంబంధించి అదుపులోనికి తీసుకున్న పోలీసులు ఆతడిని ఆసుపత్రికి తీసుకువచ్చారు. కొట్టారక్కర పోలీసుల వివరాలప్రకారం సందీప్ అనే ఈ టీచర్‌కు కాలిపై గాయం అయింది. డాక్టర్ వందనాదాస్ ఆతడికి చికిత్సచేస్తున్న తరుణంలోనే ఒక్కసారిగా ఉద్రేకంతో రెచ్చిపోయి అక్కడున్న అందరిపైకి లంఘించాడు. ఒక కత్తెరను చేతితో పట్టుకుని అంద రినీ బెదిరించసాగాడు. ఆతడు చేసిన కత్తెర గాయాలతో వందనదాదాస్ చివరకు మృతిచెందింది. నిందితుడితో వచ్చిన పోలీసులకు సైతం గాయాల య్యాయి. చికిత్సచేసిన వైద్యురాలిని వెంటనే ఒకప్రైవేటు ఆసుపత్రికి తరలించినా ఫలితం లేక పోయింది. అక్కడే చికిత్సపొందుతూ మరణించింది. యువ వైద్యురాలి మృతిపై ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈసంఘటన విచారకరమని, ఎంతో బాధించిందని



ఆయన అన్నారు. సమగ్ర విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. విధుల్లో ఉన్న హెల్త్‌వర్కర్లను హింసకు గురియేయడం ఎంతమాత్రం ఉపేక్షించేది కాదని, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని విజయన్ తెలిపారు. ఊఎంఎ, కేరళ ప్రభుత్వ వైద్యుల సంఘం కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఈసంఘటన పట్ల నిరసన ప్రకటించారు. కేరళ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఈ సంఘటనపై వెంటనే స్పందించి వారం రోజుల్లోపు నివేదిక ఇవ్వాలని కొల్లాంజిల్లాఎస్‌పిని ఆదేశించింది. కేరళ వైద్యశాఖ మంత్రి వీణాజార్జి చేసిన వ్యాఖ్యలు మరింత ఉద్రిక్తతలను రెచ్చ గొట్టాయి. అనుభవం తక్కువ కావడంతో నిందితుడికి చికిత్స అందించేసమయంలో ఆమె భయపడిందని మంత్రిచేసిన వ్యాఖ్యలు ధుమారంరేపాయి. మంత్రి వ్యాఖ్యలు అర్థరహితమని, మద్యం, మత్తు పదార్థాలకు అలవాటుపడిన ఒక నిందితుడు చేసిన దాడిని రక్షించుకోవడంలో అనుభవం ఉండాలా లేక వైద్యవృత్తిపరంగా అనుభవరాహిత్యమని మంత్రి చేసారా అని కేరళ పిసిసి చీఫ్ సుధాకరన్ ఆగ్రహం వ్యక్తంచేసారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు విడి సతీషన్ మాట్లాడుతూ వైద్యురాలిమృతి మొత్తంకేరళ సమాజాన్నే వణికించిందని అన్నారు.

# రాష్ట్రంలో మళ్లీ బిజెపికే కర్ణాటక ప్రజల తీర్పు

## • 130స్థానాలతో మేమే ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం

## • మాజీ సిఎం యెడియూరప్ప

**శివమొగ్గ, మే 10:** కర్ణాటక ప్రజల ఆశీస్సులతో తనకుమారుడు బిజెపి అభ్యర్థి బివై విజయేంద్ర 40వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తారని మాజీ సిఎం యెడియూరప్ప ప్రకటించారు. అంతేకాకుండా కర్ణాటకలో బిజెపి ప్రభుత్వమే రాబోతోందని భారీ మెజా ర్టీతో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరిస్తుందని ఆయన అన్నారు. ఈసారి తమ పార్టీకి 125నుంచి 130 స్థానాలు వస్తాయని పూర్తి స్థాయి మెజార్టీతోనే ప్రభు త్వం ఏర్పాటుచేస్తామని ఆయన చెప్పారు. ప్రధాని



నరేంద్రమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు కర్ణాటక ఎన్నికలపై ప్రత్యేకశ్రద్ధచూపించారని అందుకు వారికి ధన్య వాదాలు చెపుతున్నట్లు పేర్కొన్నారు. యెడి యూరప్ప కుమారుడు లోక్‌సభ ఎంపి బివై రాఘ వేంద్ర మాట్లాడుతూ శివమొగ్గ పార్లమెంటు నియో జకవర్గంలోని అన్ని ఎనిమిది అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ బిజెపి అభ్యర్థులే భారీ మెజార్టీతో గెలుస్తారని అన్నారు. తన సోదరుడు విజయేంద్ర శికారిపురనుంచి పోటీలో ఉన్నారని, భారీ మెజా ర్టీతో గెలుస్తారని రాఘవేంద్ర చెప్పా రు. బిజెపి అభ్యర్థులు కేవలం ఒక్క శివమొగ్గలోనే కాకుండా అత్యధికస్థానాల్లో భారీ మెజార్టీతో గెలుస్తారని ఆయన ధీమా ప్రకటించారు. వర్షం వచ్చే సూచన లున్నందున ప్రజలు ముందుగానే పోలింగ్ కేంద్రా లకు వచ్చి ఓటు వేయాలని కోరారు.

తన తండ్రి ఎన్నికల రాజకీయాలనుంచి నిష్క్ర మించినప్పటికీ రాష్ట్ర రాజకీయాల్లోక్రియా శీలకంగా ఉన్నారని, ఈ వయసులో కూడా ఆయన రోజుకు ఐదారు సమావేశాలు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. పార్టీకి 123 నుంచి 127 స్థానాలు వస్తాయని అన్నారు.

# మణిపూర్‌లో క్రమేపీ మెరుగవుతున్న శాంతిభద్రతలు

## గత రెండు రోజులుగా నమోదుకాని కొత్త ఘటనలు

**ఇంఫాల్, మే 10:** హింసాత్మకంగా మారిన మణిపూర్‌లో పరిస్థితి నెమ్మదిగా మెరుగుపడుతోంది. గత రెండురోజులుగా రాష్ట్రంలో కొత్తగా ఎలాంటి హింసాత్మక ఘటనలు వెలుగులోకి రాలేదు. ఇంఫాల్ వెస్ట్, బిష్ణుపూర్, చురాచంద్‌పూర్, జిరిబామ్ సహా 11 ప్రభావిత జిల్లాల్లో



ఉదయం 5 గంటల నుండి ఆరు గంటల పాటు కర్ఫ్యూను సడలించినట్లు అధికారులు చెప్పారు. మే 9న ఈ జిల్లాల్లో 4 గంటల పాటు కర్ఫ్యూను సడలించారు. మెజారిటీ మెయితీ కమ్యూనిటీ షెడ్యూల్డ్ తెగ హోదా కోసం పోరాడుతోంది. ఈ క్రమంలో మణిపూర్‌లో జరిగిన హింసలో దాదాపు 60 మంది చనిపోయారు. సుమారు 231 మంది గాయపడ్డారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. అధికారులు వివరాల ప్రకారం చురాచంద్‌పూర్ నుంచి 2,500 మంది బాధితులు, సరిహద్దు పట్టణం మోరేలో చిక్కుకుపోయిన 500 మందిని ఇంఫాల్‌కు తీసుకువచ్చారు. హింసాత్మక ఘటనల్లో 60 మంది మృతి చెందినట్లు సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి సపమ్ రంజన్ సింగ్ వెల్లడించారు. 30,000 మందికిపైగా నిరాశ్రయుల య్యారని చెప్పారు. వారిలో 26,000 మందిని వారి వారి జిల్లాల వెలుపల సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు చెప్పారు. 4,000 మంది ప్రజలు తమ ఇళ్లకు సమీపంలో సహాయక శిబిరాల్లో ఉన్నారని మంత్రి సపమ్ రంజన్ సింగ్ వెల్లడించారు. మరో 26,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని వారిలో చాలా మంది తమ బంధువుల ఇళ్లలో తలదాచుకున్నారని మంత్రి సపమ్ రంజన్‌సింగ్ వివరించారు. మొత్తం 128 కంపెనీల బలగాలు, అస్సాం రైఫిల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్‌ను కొనసాగించాయి. 24 గంటలూ వైమానిక నిఘా నిర్వహిస్తున్నారు. దీంతో ఎలాంటి హింసకు తావు లేకుండా పోయింది. పరిస్థితి మరింత మెరుగపడ్డాక ఆంక్షలను సడలించే అవకాశం ఉంది.

# ద్రవ్యోల్బణంపై ప్రశ్నించే హక్కు మీకు లేదు

## కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్


**బెంగళూరు, మే 10:** దేశంలో ధరల పెరుగుదల నియంత్రణకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తూనే ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. యుపిఎ ప్రభుత్వ హయాంలో దేశంలో ద్రవ్యోల్బణం తీరును ప్రస్తావించిన ఆమె, ధరల పెరుగుదలపై ప్రశ్నించే హక్కు కాంగ్రెస్‌కు లేదన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా బెంగళూరులో ఓటు హక్కు వినియోగించు కున్న తర్వాత మీడియాతో మాట్లా డారు. కర్ణాటకలో స్పష్టమైన మెజా ర్టీతో తమ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని నిర్మలా సీతారామన్



ఆశాభావం వ్యక్తంచేశారు. కర్ణాటక నుంచి రాజ్యసభ సభ్యురాలిగా ప్రాతినిధ్యం వహిస్తోన్న నిర్మాలా సీతారామన్, జయనగర్ అసెంబ్లీ సెగ్మెంటులో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ద్రవ్యోల్బణాన్ని తగ్గించేందుకు మోడీ ప్రభుత్వం 2014 నుంచి చర్యలు తీసుకుంటోంది. కర్ణాటకలో ముఖ్యమంత్రి బొమ్మై కూడా పెట్రోల్‌పై రెండుసార్లు ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించారు. ద్రవ్యోల్బణం విషయానికి వస్తే నేను ప్రజలతోనే ఉంటాను. అవి మరింత తగ్గాల్సి ఉంది. కానీ ఈ అంశంపై విమర్శించే హక్కు కాంగ్రెస్‌కు మాత్రం లేదు. వాళ్లు గత యుపిఎ ప్రభుత్వాన్ని గుర్తుచేసుకోవాలి అని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. తాజా ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని పేర్కొన్నప్పటికీ, ఎన్ని స్థానాల్లో బిజెపి విజయం సాధిస్తుందని అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పేందుకు తను నిరాకరించారు.

# విజయపుర నియోజకవర్గంలో దొంగ ఓటర్లు బిజెపి అభ్యర్థి కోసమేనని చెపుతున్న కాంగ్రెస్ నేతలు

**బెంగళూరు, మే 10:** కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు బుధవారం జరుగుతున్న పోలింగ్‌లో బోగస్ ఓటర్లను గుర్తించి కాంగ్రెస్ కార్యకర్తలు పట్టుకున్నారు. వీరంతా చిచోలినుంచి విజయపురాకు వచ్చి దొంగ ఓట్లు వేసేందుకుప్రయత్నించారని వారు ఆరోపించారు. విజయపుర బిజెపి ఎమ్మెల్యే బసన్నగౌడ పాటిల్ యత్నాల్ మద్దతుదారులు వీరందరినీ తీసుకొచ్చారని ఆరోపించారు. అనేకమంది తాము విజయపురకు చించోలినుంచి బస్సుల్లో వచ్చామని, ఓట్లువేసేందుకే వచ్చినట్లు చెప్పారు. ఈ వీడియో క్లిప్‌లన్నింటినీ సోషల్‌మీడియాలో వైరల్‌చేసారు. ముందురోజు రాత్రే మమ్మల్ని విజయపుర నగరానికి తీసుకువచ్చినట్లు తెలిపారు. రాత్రి మొత్తం తాము ఇక్కడే ఉన్నామమని



తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు వీరందరినీ పట్టుకుని పోలీసులకు అప్పగించి వెంటనేకేసులునమోదుచేయాలని డిమాండ్‌చేసారు. ఎన్నికల సంఘానికిసైతం వారు ఫిర్యాదులుచేసి అభ్యర్థిపైనా పార్టీ నేతలపైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేసారు. కర్ణాటకలో ఈసారి ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా సాగుతున్న సంగతి తెలిసిందే. బిజెపి, కాంగ్రెస్, జెడిఎస్ పార్టీలు వేటికవే పోటాపోటీగా ప్రచారంచేసాయి. ఉదయం ఏడుగంటలనుంచి పోలింగ్‌ప్రారంభం అయింది. చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్‌ప్రశాంతంగానే సాగుతోందన్నారు.

# ప్రపంచదేశాల్లో 68.80 కోట్లకు పెరిగిన బాధితులు

## 68.72 లక్షలకు చేరుకున్న మృతులు

**జెనీవా, మే 10:** ప్రపంచదేశాల్లో కరోనా పెరుగుతున్న కేసులు ఇప్పటికీ వెలుగులోకి వస్తున్నాయి. చిన్నచిన్నదేశాల్లోనే ఈ కేసుల పెరుగుదల ఎక్కువగా ఉంది. ఒమిక్రాన్, ఇతర ఉపవేరియంట్లు హల్‌చల్‌చేస్తుండటంతో ఆయా దేశాల్లోని పౌరులు మరింతగా గాభరా చెందుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా బుధవారం నాటికి 68.80 కోట్లమందికి కరోనాసోకి వారిలో 68.72 లక్షలమందిచనిపోయారు. మరో 39,051 మందిపరిస్థితి విషమంగా ఉంది. రికవరీలు 66.04 కోట్లకుపైగా నమోదుకాగా మరో 2.07 కోట్లమంది ఇప్పటికీ వైరస్‌తో సతమతం అవుతున్నారు. యూరోప్ దేశాల్లో మొత్తం 24.90 కోట్లమందికికరోనాసోకి వారిలో 20.55 లక్షలమందిచనిపోయారు. మరో 6325 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 24.49 కోట్లకుపైగా నమోదుకాగా మరో 20.35 లక్షలమంది ఇప్పటికీ మృత్యువుతోపోరాటంచేస్తున్నారు. ఉత్తరఅమెరికా దేశాల్లో మొత్తం 12.63 కోట్లకుపైగా కరోనా బాధితులుంటే వారిలో 16.30 లక్షలమందిచనిపోయారు. మరో 6302 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 12.21కోట్లకుపైగా నమోదుకాగా మరో 25.58 లక్షలమంది ఇప్పటికీమృత్యువుతోపోరాటంచేస్తున్నారు. ఆసియా దేశాల్లో 21.60కోట్లమందికికరోనాసోకి వారిలో 15.45 లక్షలమందిచనిపోయారు. మరో 15,658 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 20.07 కోట్లకుపైగా నమోదుకాగా మరో 1.46 కోట్లమంది ఇప్పటికీ మృత్యువుతోపోరాటంచేస్తున్నారు. దక్షిణ అమెరికా దేశాల్లో మొత్తం కరోనా బాధితులు 6.86 కోట్లకుపైగా నమోదుకాగా 13.55 లక్షలమందిచనిపోయారు. రికవరీలు 6.64 కోట్లకుపైగా నమోదుకాగా మరో 8,17,919 మందిపరిస్థితి విషమంగా ఉంది.

# లైంగిక వేధింపుల కేసులో దోషిగా ట్రంప్

## రూ.410 కోట్లు చెల్లించాలని ఆదేశం

**వాషింగ్టన్, మే 10:** అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ప్రముఖ రచయిత్రిని ఆయన లైంగికంగా వేధించాడని న్యూయార్క్ జ్యూరీ తేల్చింది. ఆమెకు పరిహారంగా 5 మిలియన్ డాలర్లు అంటే రూ.410 కోట్లు చెల్లించాలని ఆదేశించింది. దీంతో 2024 అధ్యక్ష ఎన్నికల్లో మరో సారి పోటీ చేయాలనుకుంటన్న ట్రంప్‌కు పెద్ద షాక్ తగిలినట్ల యింది. 1996లో మాన్‌హటన్ అవెన్యూలోని అగ్జరీ బర్గ్‌డార్ఫ్ గుడ్ మ్యాన్ స్టోర్‌లో ట్రంప్ తనపై అత్యాచారానికి పాల్పడ్డారని ప్రముఖ రచయిత్రి ఇ.జీన్ కరోల్ ఆరోపించారు. ఆపై తనను లైంగికంగా వేధించాడని తెలిపారు. 2019లో ఓ సారి తన గురించి అసభ్యంగా మాట్లాడి ప్రతిష్టకు భంగం కలిగించారని పరువునష్టం పటిషన్ దాఖలు చేశారు. ట్రంప్‌పై భయంతోనే తాను 20 యేళ్లకుపైగా ఈ విషయంపై బహిరంగంగా మాట్లాడలేకపోయానన్నారు.

# ఝార్ఖండ్‌లో తెగబడిన దుండగులు

## మైనింగ్ కంపెనీకి చెందిన తెలంగాణ అధికారి మృతి

**రాంచీ, మే 10:** ఝార్ఖండ్‌లో ఓ అటవీ ప్రాంతంలో దుండగులు జరిపిన కాల్పుల్లో తెలంగాణకు చెందిన మైనింగ్ అధికారి వీరగంధం శరత్‌బాబు (60) మృతి చెందారు. ఎపి బిజెపి నేత, మాజీ ఎంపి సిఎం రమేష్‌కు చెందిన రిత్విక్ కంపెనీ నిర్వహిస్తున్న బొగ్గు గనిలో శరత్‌బాబు పనిచేస్తున్నారు. నిజానికి ఆయన ప్రతిరోజు బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో ప్రయాణిస్తారు. సాధారణ వాహనంలో కార్యాలయానికి వెళుతుండగా ద్విచక్ర వాహనంపై వెంబడించిన దుండగులు హజారీబాగ్ జిల్లా పరిధిలోని అటవీ ప్రాంతంలో కాల్పులు జరిపారు. శరత్‌బాబు, ఆయన అంగరక్షకుడు రాజేంద్ర ప్రసాద్ తీవ్రంగా గాయ పడ్డారు. ఇద్దరినీ ఆసుపత్రికి తరలించగా శరత్‌బాబు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

## టెన్త్ ఫలితాల్లో సిద్దిపేట జిల్లాకు రెండో స్థానం

### బాలికలదే పైచేయి, 98.65 శాతం ఉత్తీర్ణత

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** టెన్త్ ఫలితాల్లో సిద్దిపేట జిల్లా మరో సారి సత్తా చాటి రాష్ట్రంలో రెండో స్థానం దిక్కించుకుంది. గత యేడు టెన్త్ ఫలితాల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలువగా ఈ యేడు ఫలితాల్లో రెండో స్థానంలో నిలిచింది. గత యేడాది కంటే ఈ యేడు 1.4 శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో 14,177 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 13,985 మంది విద్యార్థులు పాసై 98.65 ఉత్తీర్ణత సాధించారు. 7,053 మంది బాలురులకు గానూ 6,927 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 7,124 మంది బాలికలు పరీక్షలు రాయగా 7,058 ఉత్తీర్ణత సాధించారు. బాలురులు 98.21 శాతం, బాలికలు 99.07శాతం ఉత్తీర్ణత సాధించారు. టెన్త్ ఫలితాల్లో సైతం బాలికలతే పై చేయి నిలిచింది. కాగా మంత్రి తన్నీరు హరీష్‌రావు పదోతరగతిఫలితాల్లో ఉత్తమ ప్రతిభను కనబరి చిన విద్యార్థులను అభినందించారు. టెన్త్ ఫలితాల్లో సిద్దిపేట రెండో స్థానం సంగారెడ్డి మూడో స్థానంలో నిలువడం సంతోషంగా ఉందన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణులు అయ్యేలా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఆయన అభినందనలు తెలిపారు.

## వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్లో టాప్-2గా రాష్ట్రం

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల ఎగుమతుల్లో దేశంలోనే తెలంగాణ రెండోస్థానంలో నిలిచింది. వివిధ విదేశాలకు వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులను ఎగుమతులు చేయడంలో అగ్ర స్థానంలో మహారాష్ట్ర ఉండగా, తదుపరి స్థానం తెలంగాణకు దక్కింది. వ్యవసాయ రంగం, ఉత్పత్తుల ఎగుమతులపై కేంద్రం నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. వ్యవసాయ ఎగుమతులు రాష్ట్రం నుండి భారీగా పెరుగుదల నమోదైంది. ఉత్పత్తుల ఎగుమతులు 40 శాతానికి పెరిగి 10 వేల కోట్ల రూపాయల మేర మార్క్‌ను దాటడం విశేషం. తెలంగాణలో 2017-18 సంవత్సరంలో 5 వేల కోట్ల రూపాయల మేర వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులు ఎగుమతి కాగా, 2021-22 సంవత్సరం నాటికి అది 10 వేల కోట్ల రూపాయలకు పెరిగాయి. తెలంగాణ నుండి జరిగే ఎగుమతుల్లో ప్రధానంగా సుగంధద్రవ్యాలు, తృణ ధాన్యాలు, పత్తి, మాంసం తదితర వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులు ఉన్నాయి. వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల ఎగుమతుల్లో 2021-22 సంవత్సరంలో 3,055 కోట్ల రూపాయల విలువైన పత్తి, 1,936 కోట్ల రూపాయల విలువైన సుగంధ ద్రవ్యాలు, టీ, కాఫీలు, 1,480 కోట్ల రూపాయల మేర తృణ ధాన్యాలు, 268 కోట్ల రూపాయల మాంసం ఎగుమతులు ఉన్నాయి.

## చుక్కలు చూపుతున్న జీలకర్ర

### కిలో రూ. 560కు చేరిన ధర

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** ధనిక, పేద అనే బేధం లేకుండా ప్రతీ ఇంట్లో తప్పనిసరిగా వినియోగించే సుగంధద్రవ్యం జీలకర్ర ధర సామాన్యులకు చుక్కలు చూపిస్తోంది. హైదరాబాద్‌తో పాటు, తెలంగాణలో జీలకర్ర ధర క్వింటాలు 56వేల రూపాయలకు చేరింది. అదే కిలో లెక్కన చూస్తే 540 రూపాయల నుండి 560 రూపాయలకు పైగా ధర పలుకుతోంది. దేశంలో జీలకర్ర సాగు ఆశించిన స్థాయిలో లేకపోవడంతోపాటు, విదేశాలు సైతం దీన్ని దిగుమతి చేసుకోవడంలో పోటీ పడుతుండటంత ధరలు పెరుగుదలకు కారణమైనట్లు మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. దీనికి తగినట్లుగా దేశీయంగా ఉత్పత్తి అవుతున్న జీలకర్రకు గ్లోబల్ మార్కెట్‌లో అత్యధిక డిమాండ్ ఉంది. ముఖ్యంగా గత మూడు వారాల్లో దేశం నుండి 300 నుండి 350 కంటెయినర్ల జీకర్రను చైనా దిగుమతి చేసుకుంది. అలాగే బంగ్లాదేశ్ కూడా గణనీయమైన స్థాయిలో జీలకర్రను కొనుగోలు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా జీలకర్ర పంట ఉత్పత్తిలో 70శాతం వాటా భారత్‌ది కావడం విశేషం. దేశంలో జీలకర్ర గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఎక్కువగా సాగవుతుంది. సుగంధ ద్రవ్యాల వ్యాపారానికి కేంద్రమైన గుజరాత్‌లో హోల్‌సేల్ ధర క్వింటాలుకు 56వేలరూపాయలుగా ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. తర్వాత అధికంగా సాగుచేసే రాజస్థాన్‌లో వర్షాల కారణంగా జీలకర్ర ఉత్పత్తి తగ్గిందని అంటున్నారు. ఈవిధంగా దేశంలో ఉత్పత్తి తగ్గడమే కాకుండా, ఇదే సమయంలో ఎగుమతులు పెరగడంతో జీలకర్ర ధరలు పెరుగుదలకు కారణమంటున్నారు.



## అమల్లోకి విలేజ్ బస్ ఆఫీసర్ వ్యవస్థ

### ప్రారంభించిన ఆర్టీసీ ఎండి సజ్జనార్

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** గడప గడపకూ ఆర్టీసీ కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతో విలేజ్ బస్ ఆఫీసర్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చినట్లు సంస్థ ఎండి ఎండి సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్‌లో బుధవారం ఈ వ్యవస్థను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తద్వారా ప్రజా రవాణా వ్యవస్థను ప్రజలకు చేరువ చేసేందుకు దీన్ని అమలు చేస్తున్నామన్నారు. తొలి విడతలో రాష్ట్రంలో 1,730 మంది ఆఫీసర్లను నియమించినట్లు చెప్పారు. వీరే సంస్థకు బ్రాండ్ అంబాసిడర్లని తెలిపారు. శుభకార్యాలకు అద్దె బస్సుల బుకింగ్, తిరుమల, కార్గో ద్వారా సరుకు రవాణా తదితర వాటిని ప్రజలకు తెలియచేయాల్సి ఉంటుందన్నారు. రద్దీగా ఉన్న సమయాల్లో డిపో మేనేజర్లతో సమన్వయం చేసుకుని బస్సులను నడిపిస్తూ ఓఆర్ పెంచేలా కృషి చేయాలని సూచించారు. ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. సంస్థ విశ్వసనీయతను పెంచేలా పనిచేస్తూ స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. సంస్థను ప్రజలకు మరింతగా దగ్గర చేయాలని స్పష్టం చేశారు. అత్యున్నత ప్రతిభ కనపరచిన విలేజ్ బస్ అధికార్లను గుర్తిస్తుందన్నారు.

## విశ్రాంత ఉన్నతాధికారులను సలహాదారులుగా నియమించడం రాజ్యాంగ విరుద్ధం

### సిఎం కెసిఆర్‌కు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్నత హోదాలో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉన్నతాధికారులను ప్రభుత్వం సలహాదారులుగా నియమించడం రాజ్యాంగ విరుద్ధమని ఫోరం ఫర్‌గుడ్ గవర్నెన్స్ పేర్కొంది. రాజ్యాంగానికి విధేయులైన ఉన్నతాధికారులు రాజకీయ నాయకులకు విధేయులుగా మారడం అంటే ఇదేనని ఆ సంస్థ కార్యదర్శి పద్మనాభ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సిఎం కెసిఆర్‌కు ఆయన బుధవారం ఒక లేఖ రాశారు. రాష్ట్రంలో 12 మంది వరకు ఉన్నతాధికారులు పదవీ విరమణ తరువాత సర్కారుకు సలహాదారులుగా నియమించబడ్డారని, వీరందరికి కేబినెట్ ర్యాంక్ కూడా ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. సగటున ఒక సల హాదారుడికి నెలకు అన్ని ఖర్చులు కలిపి 50 లక్షల రూపాయల వరకు ప్రజాధనం ఖర్చవుతుందని పద్మనాభ రెడ్డి తెలిపారు. ఉన్నతస్థానాల్లో వుండి పదవీ విరమణ చే సిన వారిని పదవీ విరమణ తరువాత సలహాదారులుగా తీసుకోవడం వల్ల ఉద్యోగార్థులకు సర్కారునుంచి తప్పుడు సంకేతం ఇచ్చినట్లవుతుందని ఆయన వెల్లడించారు. మీరు మాకు విధేయులుగా వుంటే పదవీ విరమణ చేశాక మీకు సలహాదారులుగా నియమించి కేబినెట్ హోదా ఇస్తామని ఉన్నతాధికారులకు సర్కారు చెబుతున్నట్లుగావుందని ఆయన ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక పదవీ విరమణచేసిన పలువురు చీఫ్ సెక్రటరీలు, డిజిపిలు సలహాదారులుగా నియమించబడ్డారని, 2015 మే రెండవ తేదీన సర్కారు జారీ చేసిన జిఒ నంబర్ 55 ప్రకారం ఇది చెల్లదని పద్మనాభ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన జిఒను ప్రభుత్వమే ఉల్లంఘించడం ఎంతవరకు సరైందని ఆయన ప్రశ్నించారు. ఎపిలో పెద్ద సంఖ్యలో సలహాదారులు నియమించడంపై ఆ రాష్ట్ర హైకోర్టు మందిపడిన విషయాన్ని ఈ సందర్భంగా ఆ యన ఉదహరించారు. లెక్కకుమించిన మందిని సలహాదారులుగా నియమించుకుంటూ పోతే చివరకు కలెక్టర్లు, తహశీల్దార్లను కూడా సలహాదారులుగా నియమించాల్సి వుంటుందని ఎపి హైకోర్టు చెప్పడాన్ని ఆయన పేర్కొన్నారు. పదవీ విరమణచేసిన ఉన్నతాధికారులను సలహాదారులుగా నియమిస్తూ పోతే దాని ప్రభావం పాలనపై కచ్చితంగా వుంటుందని, దీనివల్ల చట్టబద్ధ పాలన, అవినీతికి అడ్డుకట్ట వంటివి కనుమరుగవుతాయని ఆయన తెలిపారు.

# సోమేష్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలి : భట్టి



బుధవారం మీడియాతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త :** ఉద్యోగ విరమణ చేసిన సోమేష్‌కుమార్ కు మళ్లీ సిఎం ముఖ్య సలహాదారుడిగా నియమించడం సరికాదని, వెంటనే ఆయనను పదవి నుంచి తొలగించాలని సిఎల్పీ నేత భట్టి విక్రమార్క ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. రంగారెడ్డిజిల్లా మామిడిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం పాదయాత్ర సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఐఎఎస్‌లు ఏ రాష్ట్రానికి కేటాయిస్తే అక్కడికి వెళ్లి పనిచేసుకోవడానికి సిద్ధంగా ఉండాలని, అయితే సోమేష్‌కుమార్ ఏపీకి వెళ్లకుండా విఆర్ఎస్ తీసుకుని ముఖ్యమంత్రి వద్ద సలహాదారుడిగా చేరడంలో దురద్దేశం ఉందని ఆయన అన్నారు. ధరణి తతీసుకువచ్చిన తరువాత పార్ట్ బీలో ఉన్న భూములను దిగమింగడానికి ప్రభుత్వంలో ఉన్న పెద్దలకు, భూబకాసురులకు సోమేష్‌కుమార్‌లాంటి అధికారులు ఉపయోగపడుతున్నారని ఆయన ఆరోపించారు. పేదలకు కాంగ్రెస్ ఎపార్టీ ఇచ్చిన భూములను ధరణి పేరుతో లాక్కుంటున్నారని, దానితో రియల్‌ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఒక్క ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోనే 5 లక్షల కోట్ల రూపాయల విలువైన భూములు లాక్కున్నారని ఆయన వివరించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు చేసే భూముల దోపిడీలోసూత్రధారి, పాత్రధారిగా సోమేష్‌కుమార్ వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. బ్యూరోక్రాట్స్ ప్రజలకు ఉపయోగపడే పథకాలను తీసు కురావడానికి ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలని, అవినీతికి పాల్పడి ప్రజలను ఇబ్బందిపెట్టే విధంగా పథకాలు తీసుకురావద్దని ఆయన అన్నారు. సోమేష్‌కుమార్ సిఎస్‌గా ఉన్న సమయంలో ప్రైవేటు వ్యక్తులకు క్లియరెన్స్ చేసిన ప్రభుత్వ భూముల వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలకు లేఖ రాస్తామని ఆయన వివరించారు. అవసరమైతే రాష్ట్రపతిని కలిసి ఫిర్యాదు చేస్తామని ఆయనఅన్నారు. విద్యార్థులను రెచ్చగొట్టి రాజకీయ ఉచ్చులోకి దింపుతున్నారని వ్యాఖ్యలు చేసిన మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస యాదవ్‌లు సెక్యూరిటీ లేకుండాయూనివర్శిటీలకు వెళ్లి వస్తే నిరుద్యోగుల బాధ ఏమిటో తెలుస్తుందని అన్నారు. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీగురించి మాట్లాడే స్థాయి తలసానికి లేదన్న విషయం గ్రహించాలని భట్టి విక్రమార్క విమర్శించారు.

# జూనియర్ పంచాయితీ కార్యదర్శులను తొలగిస్తామనడం సరికాదు

### ప్రభుత్వంవారిని రెగ్యూలరైజ్ చేయాలి : బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త::** గత 13రోజులుగా సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయితీ కార్యదర్శులను విధుల నుంచి తొలగిస్తామని అనడం సరికాదని ముఖ్యమంత్రి కెసిఆర్ నిరంకుషత్వానికి ఇది నిదర్శనమని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈమేరకు బుధవారం తెలంగాణ పంచాయితీ సెక్రటరీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని బిసిభవన్‌లో పంచాయితీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. దీనికి కృష్ణయ్య ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ జూనియర్ పంచాయితీ సెక్రటరీల సమ్మె న్యాయమైందన్నారు. వీరిని ఉద్యోగంలోకి తీసుకున్నప్పుడు మూడు సంవత్సరాల లో రెగ్యూలరైజ్ చేస్తామని నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. తర్వాత జీవో 26ద్వారా మరో సంవత్సరం పొడిగించి ఉత్తర్వులు జారీ చేసి నాలుగు సంవత్సరాలు గడిచినా ఇంతవరకు ఏఒక్కరినీ రెగ్యూలర్ చేయకపోవడంతో అనివార్య పరిస్థితుల్లో పంచాయతీ రాజ్ కార్యదర్శులు సమ్మెకు వెళ్లడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరికి సమ్మె చేసే హక్కు రాజ్యాంగం కల్పించిందని తమ న్యాయమైన డిమాండ్లకై సమ్మె చేస్తే తప్పా అని అన్నారు. సిఎం కెసిఆర్ ఉద్యమాల ద్వారానే తెలంగాణ తెచ్చారని అదే ఉద్యమాలను అణిచివేయడం న్యాయమా అని ప్రశ్నించారు. మూడేళ్లపాటు రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ పంచాయితీ కార్యదర్శులు ఎన్నో ఒత్తిడులు ఎదర్కొంటూ సుమారు



తెలంగాణ పంచాయితీ సెక్రటరీ ఫెడరేషన్ ప్రతినిధులతో కలిసి మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జకృష్ణ తదితరలు

50రకాల విధుల నిర్వహిస్తూ ఎన్నో జాతీయ అవార్డులు తీసుకురావడం జరిగిదన్నారు. వెంటనే సిఎం కెసిఆర్ స్పందించి జూనియర్ పంచాయితీ కార్యదర్శులను రెగ్యూలర్ చేస్తూ గ్రేడ్‌ఫోర్ ఉద్యోగులుగా గుర్తించి నాలుగు సంవత్సరాల సర్వీసును కలుపుతూ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, నీల వెంకటేష్, నందగోపాల్, రాఘవ, జోషి, వేముల రామకృష్ణ, పగిడాల సుధాకర్, నిఃల్, తెలంగాణ పంచాయితీ సెక్రటరీ ఫెడరేషన్ నాయకులు ఆకారం సురేష్, కృష్ణంరాజు, గిరిబాబు, శ్రీనివాస్, వినయ్‌కుమార్, కిరణ్ పాల్గొన్నారు.

# ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

### పంచాయతీ కార్యదర్శులపై ఇంత కఠిననిర్ణయాలా?: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



ప్రభుత్వ ఉత్తర్వులను వినిపిస్తున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

**జగిత్యాల, బ్యూరోప్రభాతవార్త :** పంచాయతీ కార్యదర్శుల విషయంలో ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని, జిల్లా స్థాయి క్యాడర్ పోస్ట్‌లని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొని, మళ్లీ క్యాడర్ నిర్ణయించలేదని రాష్ట్ర ప్రభుత్వం సాకు చెప్పడం విడ్డూరంగా ఉందని, పంచాయతీ రాజ్ శాఖ మంత్రికి చదువు వస్తదా, రాదా తెలువదని కానీ రాష్ట్ర పంచాయతీ రాజ్ కార్యదర్శికి చదువు రావాలే కదా.. అని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉత్తర్వులను ఎమ్మెల్సీ చదివి వినిపించారు. రాజ్యాంగ నిబంధనల అనుగుణంగా నియామకం పొందిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులను మూడేళ్లలో రెగ్యులరైజ్ చేయాల్సి ఉన్నా నాలుగేళ్లు గడిచినా అలా చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలను ఉల్లంఘించి బెదిరింపులకు గురిచేస్తుందని జీవన్‌రెడ్డి ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన హక్కుల సాధనలో తోడుగా నిలుస్తామని జీవన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని టౌన్ హాల్లో పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ వస్తే కాంట్రాక్ట్ వ్యవస్థ తొలగిస్తారని భావించినా నిరాశే ఎదురైందన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన కోరికలు తీర్చి, తప్పును సరిదిద్దుకోవాలని హితవు పలికారు. అలాగే జగిత్యాల మండల పరిషత్ కార్యాలయం ముందు గ్రామ పంచాయతీలో పనిచేసే కారోబార్లు, సఫాయి కార్మికులు చేపట్టిన నిరసనకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పిసిసి నేత బండ శంకర్, ఎంపిటిసి భూమారెడ్డి, జైనా ఎంపిటిసి కుంట సుధాకర్, కాంగ్రెస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుండా మధు, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రామకృష్ణ, చందన, రాజు, శిరీష, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టపోయిన రైతులను ఆదుకోండి

### వ్యవసాయమంత్రిని కోరిన తెలంగాణ ఐక్యవేదిక అధ్యక్షుడు షేర్ నర్సారెడ్డి

**హైదరాబాద్ మే 10 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల కాలంలో ఈదురు గాలులతో పాటు అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు ఐక్య వేదిక అధ్యక్షులు శేర్ నర్సా రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భారీ ఈదురుగాలుల, అకాల వర్షాల కారణంగా మామిడి, నువ్వు, రవి, మొక్కజొన్న, ఎర్రజొన్న, కూరగాయాల పంటల పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. జరిగిన పంట నష్టాన్ని అధికార యంత్రాంగం వెంటనే క్షేత్రస్థాయిలో సమగ్రసర్వే జరిపి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు తగు నష్టపరిహారం అందేలా చూడాలన్నారు. నష్టపోయిన రైతలకు ఎకరానికి 20వేల రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఎస్ఐ, ఎఎస్ఐ పరీక్షల కీ నేడు విడుదల

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** రాష్ట్రపోలీసు శాఖలో జరుగుతున్న కొలు వుల భర్తీలలో భాగంగా ఇటీవల నిర్వహించిన ఎస్ఐ, ఏఎస్ఐ పోస్టుల తుది రాత పరీక్షల కు సంబంధించిన ప్రాథమిక కీ గురువారం విడుదల కానుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పోలీసు నియామక మండలి పూర్తి చేసింది. ప్రాథమికకీ పై అభ్యంతరాలు వుంటే ఈ నెల 14వ తేదీ సాయం త్రం ఐదు గంటలలోపు తెలపాల్సి వుంటుంది. ఈ ప్రక్రియ ముగిసిన తరు వాత తుది ఫలితాలను విడుదలచేస్తారు. ఎస్ఐ, ఏఎస్ఐ పోస్టులు 587 వుండగా తుది రాతపరీక్షలకు సుమారు 60వేల మంది వరకు హాజరయ్యారు.

## ప్రతి గింజ కొనుగోలు చేసే వరకు పోరాటం చేయాలి

### వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

**హైదరాబాద్ మే 10 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రైతుల నుంచి పండిన ప్రతి గింజ కొనుగోలు చేసే వరకు పోరాటం చేయాలంటూ వైఎస్సా ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈమేరకు ట్వీట్ చేశారు. తడిసిన వడ్లు కొనకుండా రైతన్నలను దగా చేస్తున్న సిఎం కెసిఆర్ సర్కారుపై మరొక్కసారి గళాన్ని వినిపించిన పార్టీ శ్రేణులందరికి పేరుపేరునా దన్యవాదాలు తెలిపారు. మిల్లర్లు, వ్యాపారుల మోసాలతో నష్టపోతున్న రైతన్నలను ఆదుకోకుండా మొద్దు నిద్రపోతున్న కెసిఆర్‌ను నిద్రలేపి, ప్రతి గింజ కొనేవరకు పోరాటం చేయాలన్నారు.

# టిడిపికి పూర్వవైభవం తీసుకురావాలి

### పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కాసాని వీరేశ్



బుధవారం నర్సాపూర్‌లో జరిగిన తెలుగుదేశం పార్టీ మినీ మహానాడు లో మాట్లాడుతున్నటిడిపి పొలిటీ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, పక్కన నర్సాపూర్ ఇంచార్జీ వెంకటరమణారావు తదితరులు

**నర్సాపూర్, మే 10.ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని టిడిపి పొలిటీ భ్యూరో సభ్యులు రావుల చంద్ర శేఖర్‌రెడ్డి, టిడిపి రాష్ట్ర నాయకులు కాసాని వీరేశ్‌లు అన్నారు. బుధవారం నర్సా పూర్ పట్టణంలోని సాయికృష్ణా గార్డెన్‌లో ఎన్టీఆర్ శత జయంతి ఉత్స వాల్లో భాగంగా మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన రావుల చంద్రశేఖర్‌రెడ్డి, కాసాని వీరేశ్ లు మాట్లాడుతూ తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన గొప్ప మహనీయుడు స్వర్గీయ ఎన్టీరామారావు అన్నారు. ఇంటింటికి తెలుగు దేశం కార్యక్రమాన్ని నిర్వహించి ఎన్టీఆర్ హాయాంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్టీఆర్ మొట్టమొదటగా వృద్ధాప్య ఫించన్లు, మహిళలకు ఆస్తిలో సగబాగం, 2 రూపాయిలకు కిలో బియ్యం, మహిళా యూనివర్సిటి, వైద్య ఆరోగ్య యూనివర్సిటి, ఏర్పాటు చేసి ప్రజలకు మంచి పరిపాలన అందించారని అన్నారు. ఢిల్లీలో తెలుగు ప్రజలను మదరాసి అనే వారని ఎన్టీఆర్ వచ్చిన అనంతరం తెలుగు ప్రజల ఖ్యాతిని ఇనుమడింప జేసి తెలుగు ప్రజలకు ఢిల్లీలో మంచి గుర్తింపు తెచ్చారని అన్నారు. అంతేగాక పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దు చేసి మండలాల ఏర్పాటు, ప్రజల వద్దకు పాలన వంటి ఎన్నో అభివృద్ధి పథకాలను ప్రవేశ పెట్టాడన్నారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అధ్వర్యంలో హైద్రాబాద్ నగరం ఐటి రంగంలో ఎంతో అభివృద్దిని సాధించిందని అన్నారు.

ఆనాటి అభివృద్ధి పనులే నేడు కనిపి స్తున్నాయని అన్నారు. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చి తెలంగాణాలోని 119అసెం బ్లీ నియోజక వర్గాల్లో 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ జెండాను ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నర్సా పూర్‌లో జరిగిన మినీ మహానాడులో 8 తీర్మానాలను చేశామని అట్టి తీర్మానాలను ఈనెల 27,28 తేదీల్లో రాజమండ్రిలో జరిగే తెలుగుదేశం పార్టీ మహానాడులో అందరి ఆమోదంతో తీర్మానిస్తామని వారు వెల్లడించారు. ఈకార్యక్రమంలో తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు చరితరెడ్డి టిడిపి అధికార ప్రతినిధి జోత్స్న, మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, టిడిపి రాష్ట్ర ప్రదాన కార్యదర్శి ఏకె గంగాధర్‌రావు, మెదక్ పార్లమెంటరీ అధ్యక్షులు ఇల్లందుల రమేష్, నియోజకవర్గ కన్వీనర్ హన్మంతు వెంకట రమణారావు, మెదక్ పార్ల మెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొల్చారం ఏ. మల్లేషంగౌడ్, కాసాని సాయన్న, భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.



# రైతు బంధుకు నేటితో ఐదేళ్లు

### ఇప్పటి వరకూ రూ.65 వేల కోట్లు జమ

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** వ్యవసాయ రంగంలో ఒక వినూత్నమైన విప్లవాత్మకమైన పథకం రైతుబంధు' తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపెట్టి నేటికి 5 సంవత్సరాలు పూర్తయింది. ఈ పథకం ప్రవేశపెట్టి బుధవారంతో ఐదేళ్లు పూర్తి కావడం విశేషం. తెలంగాణ సాధన కోసం కొట్లాడినప్పుడు తెలంగాణ నీటివసతులు, వ్యవసాయరంగం గురించిన బాధలు తెలిసిన నాటి తెలంగాణ ఉద్యమ నేత, రాష్ట్ర సాధకులు, నేటి ముఖ్యమంత్రి కెసిఆర్ వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాముఖ్యతను ఇచ్చి రైతుల ఆత్మహత్యలులేని రాష్ట్రంగా చేయాలని నీటివసతిని ప్రతి ఎకరానికి ఇవ్వాలని, వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు ఇవ్వాలని కలలు కని వాటిని సాకారం చేశారు. అందుకే 2014లో తెలంగాణ రాగానే మొదటగా చెరువులు బాగు చేసుకొని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి, కొత్త ప్రాజెక్టులు త్వరితగతిన నిర్మించి వారికి పెట్టుబడి సాయం అందిస్తే వ్యవసాయాన్ని పండుగ చేయవచ్చనే ఉద్దేశంతో రైతుబంధు పథకం ద్వారా పంట పెట్టుబడిని 2018లో మొదలు పెట్టారు. ఎకరానికి సంవత్సరానికి రూ.10వేలు చొప్పున ఇప్పటి వరకు 70 లక్షల మంది రైతులకు 10 విడతలో 65 వేల 500 కోట్ల రూపాయలను అందించారు. రైతుల బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సాయం కింద జమ చేశారు. రైతులు ఒక్కో సీజనులోను లబ్ధిపొందుతున్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలోనే మొదలు పెట్టిన ఈ పథకాన్ని ప్రపంచంలోనే అత్యంత ప్రభావితం చేసే పథకాలలో ఇదొక్కటని యుఎన్‌ఓ కీర్తించడం. భారత వ్యవసాయ రంగానికి పితామహుడైనే స్వామినాథన్ మెచ్చుకోవడం, ప్రముఖ వ్యవసాయ ఆర్థికవేత్త అశోక్ గులాటి లాంటి వాళ్లు బాగుందని చెప్పడం జరిగింది. అందుకే తెలంగాణ వ్యవసాయ రంగం భారత దేశానికితలమానికంగా తయారయ్యింది. ఆత్మహత్యలులేని రాష్ట్రంగా మారింది. పంటవిస్తీర్ణంలో 2014-15లో131.34 లక్షల నుంచి 2022-23లో 209 లక్షల ఎకరాలకు పెరగడం, వరి సాగుబడిలో 2014-15లో 15వ స్థానం నుంచి నేడు 2వ స్థానానికి చేరింది. పత్తి దేశంలోనే 2వస్థానంలో, మిర్చి ప్రథమ స్థానంలో ఉంది. అలాగే దేశంలో ఎక్కడా లేని విధంగా 7000పైగా వరి ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే. రైతుబంధు పథకం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తర్వాత కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్రాలు పేరు మార్చి కొద్ది మేరకు అమలు చేశారు అంటే అది మనకు గర్వకారణం, ఇంతటి అద్భుతమైన పథకాన్ని రాష్ట్రరైతాంగానికి అందించిన సిఎం కెసిఆర్‌గారికి యావత్ తెలంగాణ రైతాంగం కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలంగాణ రైతుబంధు సమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

## వడదెబ్బకు వృద్ధ రైతు మృతి

**పాపన్నపేట, మే 10, ప్రభాతవార్త:** వడదెబ్బతో ఓ వృద్ధ రైతు మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన పాపన్నపేటలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బెస్త భూపతి కాశయ్య (60) మత్స్యకార వృతితో పాటు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంటాడ న్నారు. వరి పంట కోతకు రావడంత గత రెండు రోజులుగా వరిని కోసే యంత్రం కొరకు మండు టెండను లెక్కచేయకుండా వ్యవసాయ క్షేత్రం వద్ద పడిగాపులుకాస్తూ ఉండటంతో బుధవారం ఒడ్డుపై నుంచి నడుస్తూ పంట పొలంలో పడి అక్కడికి అక్కడే మృతి చెందాడన్నారు. విషయం తెలుసుకుని సంఘటన స్థలానికి చేరుకుని కాశయ్యను కుటుంబ సభ్యులు పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించి లబోదిమో మంటూ రోధించారు. మృతుడికి భార్య గంగవ్వ, కుమారుడు హన్మంతులు ఉన్నారు.



కాశయ్య (ఫైల్ )

## వచ్చే ఎన్నికలలో డిపాజిట్లు రావు

### అధికారం కాంగ్రెస్‌దే: టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్ మే 10 ప్రభాతవార్త:** కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీ తెలంగాణ యువతకు భరోసా ఇచ్చేం దుకు వచ్చారని, దీనిపై బిఆర్ఎస్ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారంటూ టిపిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ మండిప డ్డారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మంత్రి కెటిఆర్ కుటుంబపాలన గురించి మాట్లాడుతున్నారని, తెలంగాణలో ఏ పాలన జరుగుతుందో చూసుకోవాలన్నారు. నా జీవితం తెలంగాణాకే అంకితం అని చెప్పిన కెసిఆర్ కుటుంబం నుంచి ఎవరూరారు అని చెప్పి ఇప్పుడు మంత్రులుగా చెలామణి అవుతున్నారన్నారు. తెలంగాణలో మొదటి ముఖ్యమంత్రి దళితుడు అన్న హామిని తుంగలోతొక్కారన్నారు. ఒకశాతం కూడాలేని మీ సామాజికవర్గానికి అంత మంది మంత్రులు ఎలా అయ్యారన్నారు. మీ పాలన లో సామాజిక న్యాయం ఎక్కడ ఉందని ప్రశ్నించారు. త్యాగాల కటుంబం గురించి మాట్లాడం సరికాదన్నారు. మీ కుటుంబం నుంచి తెలంగాణ కోసం త్యాగాలు చేశారా అంటూ ప్రశ్నించారు. మీరు బలిదానాలపై చేసిన వారి శవాలమీద నుంచి పాలన చేస్తున్నారన్నారు. రాజీవ్‌గాంధీ తీవ్రవాదాన్ని తరిమికొట్టే నేపథ్యంలో బలయ్యారన్నారు. మరోవైపు ప్రియాంక గాంధీ గురించి ఇష్టంవచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. దేశంలో ధనవంతుల కుటుంబంలో కెసిఆర్ కుటుంబం మాత్రమే ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో మీకు డిపాజిట్లు కూడా రావన్నారు. ప్రియాంకగాంధీ రాకతో ప్రజలలో కొత్త ఉత్సాహంవచ్చిందన్నారు. మేము ఇచ్చిన యూత్ డిక్లరేషన్‌తో మంచి స్పందన వచ్చిందన్నారు. వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ అధికారంలో వస్తుందన్నారు.

## ఉత్తమ్‌తో సమావేశమైన ఆస్ట్రేలియా అంబాసిడర్

**హైదరాబాద్, మే 10 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ఎంపి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఆస్ట్రేలియా అంబాసిడర్ బృందం సమావేశం అయింది. బుధవారం గాంధీ భవన్‌లో ఈ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా గాంధీభవన్ నిర్మాణం అప్పటిలా శిలా ఫలకాలను పరిశీలించి, రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ సమావేశంలో ఆస్ట్రేలియా హై కమిషనర్ బేరి ఓ ఫెరల్, కౌన్సిల్ జనరల్ సారా కిర్లే, జాక్ టేలర్‌లతో పాటు టిపిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌లు ఉన్నారు.

## జూనియర్ పంచాయితీ సెక్రటరీలను క్రమబద్ధీకరించండి

### సిఎం కెసిఆర్‌కు లేఖ రాసిన నల్గొండ ఎంపి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్ మే 10 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో గత 13 రోజులు నుంచి పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేస్తున్నారని, వారి డిమాండ్‌లను పరిగణలోకి తీసుకుని క్రమబద్ధీకరణ చేయాలని ఎంపి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి కెసిఆర్‌కు లేఖ రాసారు. పంచాయతీ కారన్యదర్శుల సమ్మె కారణంగా గ్రామాల్లో అభివృద్ధి అడుగంటి పోయిందన్నారు. 2018 నూతన పంచాయతీరాజ్ చట్టం మేరకు గ్రామాల అభివృద్ధి కోసం మూడేళ్ల ప్రొబేషన్ పిరియడ్‌తో 2019 ఏప్రిల్ 12న 9355 మంది పంచాయతీ కార్యదర్శులుగా నియమించి పలురకాల షరతులతో ఉద్యోగాల్లో తీసుకున్నారన్నారు. ప్రొబేషన్ కాలం ముగిసినప్పటికీ వారిని క్రమబద్ధీకరణ చేయకపోవడం దారుణం అన్నారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామిని నిలబెట్టుకోవాలన్నారు.

## సలహాదారుల నియామకాలు రాష్ట్రానికి ప్రయోజమేనా?

### బిజెపి మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్

**హైదరాబాద్ మే 10 ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం రిటైర్డ్ అయిన వారిని సలహాదారులుగా నియమించుకోవడం ఆనవాయితీగా మారిందని, అయితే ఈ నియామకాలవల్లన రాష్ట్రానికి ప్రయోజనం కలిగిస్తున్నాయా? లేదంటే పాలనలో మెరుగులు దిద్దడానికి ఏమైన ఉపయోగపడుతున్నాయా? అని బిజెపి మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ ప్రశ్నించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రిటైర్డ్ అయిన అధికారులు కేవలంపొలిటికల్ నామినేషన్‌గానే మిగిలిపోయా రన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ఖజానా దివాళా తీసింది.

# కీర్తి చక్ర, శౌర్యచక్ర అవార్డుల ప్రదానం



న్యూఢిల్లీ, మే 10: విధి నిర్వహణలో అద్వితీయమైన ధైర్య సాహసాలు ప్రదర్శించినందుకుగాను సైనిక, పారా మిలటరీ, పోలీసు విభాగాల సిబ్బందికి భారత సాయుధ దళాల సుప్రీం కమాండర్ అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డులు ప్రదానం చేశారు. 8 కీర్తిచక్ర అవార్డులు, 29 శౌర్యచక్ర అవార్డులు ఈ సందర్భంగా అందజేశారు. రాష్ట్రపతి భవన్‌లో ఈ కార్యక్రమం జరిగినట్లు రక్షణ మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పలువురు ఇతర కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కుమార్తెల పెళ్లి సంబంధం పేరిట విశ్రాంత ఉద్యోగికి రూ.26 లక్షలు టోకరా వేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త: సైబర్ నేరగాళ్ల ఆగడాలు ఆగడం లేదు. సైబర్ నేరస్తుల గోల్‌మాల్ కార్యకలాపాలపై పోలీసులు ఆయా ప్రాంతాల ప్రజలను ఎంతగా అప్రమత్తం చేస్తున్నా వారి సంఖ్య తగ్గడం లేదు. తాజాగా సికింద్రాబాద్‌లో నివసించే ఓ విశ్రాంత ఉద్యోగికి సైబర్ నేరగాళ్లు ఆయన ఇద్దరు కుమార్తెల వివాహాల పేరిట ఏకంగా 26 లక్షల రూపాయలు టోకరా వేసిన ఉదంతం వెలుగు చూసింది. సికింద్రాబాద్‌లో నివసించే ఓ విశ్రాంత ఉద్యోగికి ఇద్దరు కుమార్తెలు వున్నారు. ఇందులో పెద్ద కుమార్తెకు ఆయన వివాహ సంబంధం చూడసాగాడు. ఈ క్రమంలో ఆయన తన సామాజిక వర్గానికి చెందిన మ్యాట్రిమోనియల్ వెబ్ సైట్‌లో వివ రాలులు వుంచి సంబంధాలు వెతుకుతున్న తరుణంలో అమెరికా పెళ్లి సంబంధం వుందంటూ ఓ సైబర్ నేరగాడి నుంచి ఫోన్ వచ్చింది. మీ కుమార్తె నా కుమారుడికి మ్యాచ్ అవుతుందని సదరు సైబర్ నేరగాడు విశ్రాంత ఉద్యోగితో ఫోన్‌లో మాట్లాడి మాటలు కలిపాడు. మరుసటి రోజు మీ చిన్న కుమార్తె మా అన్నయ్య కుమారుడికి ఇస్తే ఇద్దరు కూతుళ్లు ఒకేచోట వుంటారని మరింతగా మాటలు కలిపాడు. దీని తరువాత వారం పది రోజుల పాటు సైబర్ నేరగాడు సదరు విశ్రాంత ఉద్యోగితో నిత్యం మాటలు కలుపుతూ తన కుమారుడు అమెరికా వెళ్లేందుకు డబ్బులు కావాలని అడిగాడు. దీంతో పాటు ఇద్దరు కుమార్తెల నిశ్చితార్థం ఒకేసారి పెట్టుకుందామని నమ్మించాడు. ఇందుకోసం 26 లక్షల రూపాయలు కావాలని సదరు నేరగాడు కోరగా ఇదంతా నిజమని నమ్మిన విశ్రాంత ఉద్యోగి ఆ డబ్బులు ముట్టచెప్పాడు. అయితే కొన్ని రోజుల తరువాత తనతో సంబంధం కలుపుకున్న వ్యక్తి మాట్లాడక పోవడంతో మ్యాట్రిమోనియల్ సైట్ నిర్వాహకులను సంప్రదించగా మీతో మాట్లాడిన వ్యక్తితో మాకు ఎలాంటి సంబంధం లేదని వారు చెప్పారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన విశ్రాంత ఉద్యోగి సిటీ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు సైబర్ నేరగాళ్ల కోసం వేట మొదలు పెట్టారు.



సభలో ప్రసంగిస్తున్న ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ తదితర అతిథులు

## ధరణితో రైతులనోట్లో మట్టిగొట్టిన సోమేష్‌కుమార్ చీఫ్ అడ్వైజరా?

### ధ్వజమెత్తిన బిఎస్పీ రాష్ట్ర చీఫ్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్ (నాంపల్లి), మే 10 ప్రభాతవార్త : తెలంగాణలో లక్షలాదిమంది రైతుల నోట్లో మట్టిగొట్టి ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చిన సోమేష్‌కుమార్‌ను ప్రజలను ముంచే ఇంకేమి ఐడియాలివ్వడానికి ముఖ్యసలహాదారుగా నియమించుకున్నావని సిఎం సలహాదారుగా సోమేష్‌కుమార్‌ను నియమించడంపై తెలంగాణ రాష్ట్ర బిఎస్పీ రాష్ట్రాధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ధ్వజమెత్తారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వానికి ఎంతోమంది సలహాదారులున్నారని, వాళ్లేమి సలహాలిస్తున్నారో, ఇచ్చినా పాటించే స్థితిలో ఉన్నావా... వీళ్లతోనే సాగిస్తారా అని ఘాటుగా ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్‌కు ప్రభుత్వ సర్వీసు నుండి విఆర్‌ఎస్ తీసుకున్న తర్వాత ఆయన భవిష్యత్ కార్యాచరణపై అనేక ప్రచారాలు సాగుతుండగా అందుకు భిన్నంగా సీఎం కెసిఆర్ తన ముఖ్యసలహాదారుగా మే 9వ తేదీ నుండి 3 సంవత్సరాల పాటు కొనసాగేవిధంగా సీఎస్ శాంతికుమారిచే ఉత్తర్వులు జారీచేయించి కేబినెట్ హోదా కల్పించడం జరిగింది. అనంతరం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ 2013లో తెలంగాణ వస్తే సమ్మెలుండవన్న కెసిఆర్ ఇప్పుడు ఉద్యోగులపై నిరంకుశ వైఖరి అవలంభిస్తున్నారని, జెపి ఎస్‌లను ప్రభుత్వం ఉగ్రవాదులుగా చూస్తున్నదని ఆవేదన వ్యక్తపరిచారు. వారికి బిఎస్పీతోపాటు ఇతర రాజకీయ పార్టీలు మద్దతు తెలిపినా ప్రభుత్వం విఆర్‌ఏ, ఆర్టిజన్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు వంటి ఉద్యోగులపై ఎలా ఉక్కుపాదం మోపారో బిపిఎస్‌లను అణచివేయాలని చూడడం హేయమన్నారు. ఎవరిని ఉద్యోగం నుండి తొలగించినా ఊరుకోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ డా. వెంకటేష్ చౌహాన్, అధికార ప్రతినిధి డా. సాంబశివగౌడ్, అరుణ, రాష్ట్ర కోశాధికారి ఎల్లన్న, సెక్రటరీ అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ 10వ తరగతి ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే10: తెలంగాణ ప్రభుత్వం 2022-23 విద్యా సంవత్సరానికి నిర్వహించిన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో శ్రీచైతన్య నుంచి 1048 మంది విద్యార్థులు 10/10 జిపిఏను సాధించి విజయభేరి మ్రోగించారని శ్రీచైతన్యస్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. అదేవిధంగా 9.8 జిపిఏ ఆపైన సాధించిన విద్యార్థులు 2057 మంది, 3788 మంది విద్యార్థులు 9.5 జిపిఏ ఆ పైన సాధించారని ఆమె తెలిపారు. అదే విధంగా శ్రీచైతన్య స్కూల్ ఓవరాల్ జిపిఏ 10కి గాను 9.2, ఓవరాల్ పాస్ 98.4 శాతం,100 శాతం పాస్ అయిన బ్రాంచ్‌లు 63 అని, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులలో 11,168 మంది విద్యార్థులు 10 పాయింట్స్ సాధించారని ఆమె తెలిపారు. శ్రీచైతన్య సాధించిన 10/10 జిపిఏ 1048 మంది విద్యార్థుల సంఖ్యకు మరే ఇతర ఒక్క విద్యాసంస్థ దరిదాపులలో కూడా లేదు. శ్రీచైతన్య సాధించిన ఇంతటి ఘన విజయాలను దరిదాపుల్లో కూడా మరే ఇతర విద్యాసంస్థ లేదు, అన్ని విభాగాల్లో కూడా శ్రీచైతన్యయే స్టేట్ నెం.1 అని మరోసారి నిరూపించింది. అదే విధంగా గ్రేడ్ పాయింట్స్ అయినా లేక మార్కులైనా పదవ తరగతి ఫలితాలలో రాష్ట్రమేదైనా ఎల్లప్పుడూ శ్రీ చైతన్యనే నెం.1 స్థానంలో నిలుస్తుందని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, రీసెర్చ్ ఓరియెంటెడ్ టీచింగ్ మెథడాలజీ, సి-ఐపిఎల్, ఎంపిఎల్, ఐకాన్, సీ-బ్యాచ్, సివిల్స్, మెడికాన్, టెక్నో వంటి పటిష్టమైన అకడమిక్ ప్రోగ్రామ్స్, మైక్రో లెవల్ టీచింగ్ సిస్టమ్ అంకిత భావంతో పనిచేసే అధ్యాపకులు వల్ల మాత్రమే ఇలాంటి అద్భుత ఫలితాలు సాధ్యమవుతున్నాయని సీమ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు.



# తెలంగాణ పారిశ్రామికంగా నంబరు వన్‌కు పోలీసుశాఖే కారణం

### ఉత్తమ ప్రతిభావంతులైన 281మంది పోలీసు అధికారులకు అవార్డులు, ప్రత్యేక సేవా పతకాల ప్రదానం చేసిన హోంమంత్రి అలీ

హైదరాబాద్ (రవీంద్రభారతి), మే 10 ప్రభాతవార్త : దేశంలో 29వ రాష్ట్రమైన తెలంగాణ చిన్నది, కొత్తదే అయినా దేశంలో పారిశ్రామిక, తదితర అన్నిరంగాల్లో నంబరు వన్‌గా ఎదగడానికి మూలకారణం తెలంగాణ రాష్ట్ర పోలీసుశాఖనేనని, రాష్ట్రమేర్పడిన తర్వాత నుండి నేటి వరకు రాష్ట్రంలో సంపూర్ణ శాంతిభద్ర తలను, దోపిడీలు దౌర్జన్యాలు అరికడుతూ అన్నివిధాలా సజావుగా సాగేవిధంగా రాష్ట్రాన్ని ప్రశాంత వాతావరణంతో కాపాడుతుండడం వల్ల దేశ విదేశాల నుండి ఎన్నో కంపెనీలు, పరిశ్రమలు, సంస్థలు రాష్ట్రానికి తరలివస్తుడమే కాక పెద్దయెత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని, తద్వారా ఎంతోమంది ఉపాధి కూడా లభిస్తుందని తెలంగాణ రాష్ట్ర అంతరంగిక వ్యవహారాల శాఖామంత్రి మహ్మద్ మహ్మూద్‌అలీ అన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచే పోలీసు అధికారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన పలు అవార్డులు, ప్రత్యేక సేవా సేవాపతకాల ప్రధానోత్సవం బుధవారం మధ్యాహ్నం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి మహ్మద్ మహ్మూద్ అలీ, విశిష్ట అతిథిగా తెలంగాణ రాష్ట్ర డిజిపి అంజనీ కుమార్‌తో కలిసి హాజరై ఆయా అవార్డులు, పతకాలను పొందిన ప్రతిభావంతులైన పోలీసు అధికారులకు అందించి అభినందించారు. ఇందులో భాగంగా అతి ఉత్కృష్ట సేవాపథకాలు 2022కుగాను 30మంది పోలీసు అధికారులకు, ఉత్రిష్ట్ సేవాపతాలు 2022కుగాను 28మందికి, అసాధారణ అసూచన కుశలత పథకాలను 7గురికి, పరిశోధనలో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి కేంద్ర హోంమంత్రి మెడల్స్ 8మందికి, ట్రైనింగ్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి కేంద్ర హోంమంత్రి మెడల్స్ 11 మందికి, శౌర్యపథకం 2022కుగాను 11మందికి, మహోన్నత సేవాపథకం 2022కుగాను 7గురు పోలీసు అధికారు లకు అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ఉత్తమ సేవాపథకం 2019కుగాను 84మంది పోలీసు అధికారులకు, ఆంత్రిక్ సురక్ష సేవా పథకం 2019కుగాను 67మంది పోలీసు అధికారులకు, ఆంత్రిక్ సురక్ష సేవాపథకం 2021కుగాను 28మంది పోలీసు అధికారులకు అందజేశారు. నేడు పతకాలను అందుకున్న వారిలో రాష్ట్ర డిజిపి అంజనీకుమార్ అతి ఉత్కృష్ట సేవాపథకం, రాజీవ్‌రతన్ అతి ఉత్కృష్ట సేవాపథకం, సి.వి.ఆనంద్ అతి ఉత్కృష్ట సేవాపథకం, వి.వి.కమలాసన్‌రెడ్డి అతి ఉత్కృష్ట సేవాపథకం, హైదరాబాద్ ఐజి వి.శివశంకర్ 2021కిగాను అసాధాకరణ ఆసూచన కుశలత పతకంతోపాటు అడిషనల్ డిజిలు ఇద్దరు, ఐజిలు ఇద్దరు, డిఐజిలు ఒకరు, ఎస్పీలు ఇద్దరు, అడిషనల్ ఎస్పీలు 5గురు, డిఎస్పిలు 22మంది ఉన్నారు. వీరితోపాటు 39మంది ఇన్‌స్పెక్టరులు, 57మంది ఎస్ఐలు, 31మంది ఎఎస్ఐలు, 22మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 96మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో హోమ్‌శాఖ ముఖ్యకార్యదర్శి జితేందర్, ఏసిబి డిజి రవిగుప్త, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి రాజీవ్‌రతన్, కమిషనర్ ఆఫ్ పోలీసు సి.వి.ఆనంద్, అడిషనల్ డిజిలు షీకాగోయల్, స్వాతిలక్రా, సి.విజయకుమార్, సంజయ్‌కుమార్, వి.వి.కమలాసన్‌రెడ్డి, రాచకొండ, సైబరాబాద్ కమిషనర్లు తదితర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



హోంమంత్రి మహ్మూద్‌అలీ నుండి అతి ఉత్కృష్ట సేవాపథకాలు అందుకుంటున్న అంజనీకుమార్

# హెచ్‌యుటి ఉగ్రవాదుల అరెస్టులో కొత్త కోణం

### నగరంలో పట్టుబడ్డ ఆరుగురిలో ముగ్గురు మత మార్పిడి అయినట్లు వెల్లడి

హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త: దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన హిజ్బ్ ఉత్ తహ రీర్ (హెచ్‌యుటి) అనే ఉగ్రవాద సంస్థకు చెందిన ఉగ్రవాదుల కార్యకలాపాలలో కొత్త కోణం వెలుగు చూసింది. ఈ సంస్థకు చెందిన ఆరుగురు హైదరాబాద్‌లో పట్టుబడడం తెలిసిందే. ఇందులో ఐదుగురు మంగళవారం ఒకతను బుధవారం పట్టుబడడం విదితమే. కాగా పట్టుబడ్డ ఆరుగురిలో ముగ్గురు ఉగ్రవాదులు హిందూమతం నుంచి ముస్లిం మతంలోకి మారినట్లు తాజాగా వెలుగు చూసింది. వీరిలో భోపాల్‌కు చెందిన మహమ్మద్ సలీం (ఇతను నగరంలోని వైద్య కళాశాలలో ఓ కీలక విభాగానికి హెచ్‌ఓడిగా వున్నాడు)తో పాటు ఒడిషాకు చెందిన అబ్దుల్ రెహమాన్ (ఇతను నగరంలోని ఓ బడా కంపెనీలో క్లౌడ్ ఇంజనీర్‌గా వున్నాడు), పాతబస్తీకి చెందిన ఆటో డ్రైవర్ మహమ్మద్ అబ్బాస్‌లు జన్మతా హిందువులు అయినప్పటికీ మత ం మార్చుకుని ముస్లిం మతంలోకి మారినట్లుగా పోలీసుల విచారణలో తేలింది. వీరు ఎందుకు మతం మారారు...? దీని వెనుక ఎవరున్నారు...? కేవలం ఉగ్రవాద స ంస్థలో చేరేందుకే వీరు మతం మారారా...? మరేదైనా కారణాలు వున్నాయా...? అనే విషయమై మధ్యప్రదేశ్ పోలీసులతో పాటు తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇదే విషయమై కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు సైతం హైదరాబాద్ వచ్చి దీనిపై రెండు రాష్ట్రాల పోలీసులతో మాట్లాడి వివరాలను సేకరించారు. కాగా హైదరాబాద్‌లో పట్టుబడ్డ ఆరుగురు ఉగ్రవాదులతో పాటు ఇంకా ఎవరైనా వున్నారా...? వీరికి ఎవరైనా అనుచరులు వున్నారా...? అనే కోణంలో వి చారణ సాగుతోంది.

**కోటలా వున్న సల్మాన్ ఇల్లు:** ఇదిలావుండగా హెచ్‌యుటికి చెందన సలాం అలియాస్ సల్మాన్ (27) అనే మరో ఉగ్రవాది బుధవారం పట్టుబడగా శివార్లలోని జవహర్‌నగర్‌లో గల బాలాజీ నగర్ లో గల ఇతని ఇల్లు ఓ కోటలా వుండడం పోలీసులను సైతం ఆశ్చర్య పరిచింది. పెద్ద ఇంటిని నిర్మించుకున్న ఇతను తన ఇంటి చుట్టూ ఎత్తైన గోడను నిర్మించుకుని దానిపై గాజు పెంకులు అమర్చి ఎవరూ గోడ దూకి రాకుండా భారీ ఏర్పాట్లు చేసుకున్నాడు. దీంతో పాటు ఇంటి చుట్టూ సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకున్నాడు. ఇంటి పరిసరాలలోకి ఎవరు వచ్చినా దూరం నుంచే గమనించే వీలుండేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాడు. ఇతని ఇ ంటికి కొద్ది దూరంలో అంతా అటవీ ప్రాంతం కావడం తో ఇక్కడికి ఎవరూ పెద్దగా రారు. ఇదే సమయంలో ఇక్కడ జన సంచారం కూడా పెద్దగా వుండదు. సరిగ్గా ఈ క్రమంలోనే సల్మాన్ ఈ ప్రాంతంలో ఓ ఇంటిని నిర్మిం చుకుని హైదరాబాద్ కేంద్రంగా హెచ్‌యుటి కార్యకలాపాలను సాగిస్తున్నట్లు పోలీసులు తేల్చారు. ఇతని ఇంట్లో మారణాయుధాలు పట్టుబడినట్లు సమాచారం. ఈ విషయాన్ని పోలీసులు ధృవీకరించడం లేదు.



## రాష్ట్ర గీతకార్మిక సహకార ఆర్థిక సంస్థ చైర్మన్‌గా పల్లె రవికుమార్‌గౌడ్ బాధ్యతల స్వీకారం

హైదరాబాద్, మే 10,ప్రభాతవార్త: రాష్ట్ర గీతకార్మిక సహకార ఆర్థిక సంస్థ చైర్మన్‌గా పల్లె రవికుమార్‌గౌడ్ బుధవారం బాధ్యలు స్వీకరించారు. మాసబ్ ట్యాంక్‌లో దామోదర సంజీవయ్య సంక్షేమభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి హోంమంత్రి మహమూద్‌అలీ, విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, బిసి సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్, ఎక్సైజ్‌మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు బుడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు గాదరి కిశోర్ , కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశంతోపాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, గౌడ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఉద్యమ నాయకులైన ప్రతిఒక్కరికీ సిఎం కెసిఆర్ అవకాశం కల్పిస్తున్నారనడానికి పల్లె రవికుమార్‌గౌడ్ నియామకమే నిదర్శనమని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తనకులబంధువలకు సేవ చేసే అకవాశం రావడం పల్లె రవి అదృష్ట మని ఆయనకు తనసహాకరం ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సిఎం కెసిఆర్ కులవృ త్తులను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నారన్నారు. కుల వృత్తులను గౌరవించిన ప్రభుత్వం తమదేనని తెలిపారు. రాబోయే రోజుల్లో గీత కార్మికుల రక్షణ కోసం అన్ని చర్యలు చేపడతామన్నారు. మంత్రి జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పల్లెరవి తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇతర జర్నలిస్టులను కలుపుకుని ,తెలంగాణ జర్నలిస్టుల ఫోరం పేరుతో జర్నలిస్టుల ఐక్య పోరా టానికి పల్లె కృషి చేశారని గుర్తుచేశారు. నల్గొండ జిల్లా అభివృద్ధిలో ఆయన సేవలను తప్పకుండా వినియోగించుకుంటామని అన్నారు. చైర్మన్ పల్లెరవి మాట్లాడుతూ తనకు ఈఅవకాశం కల్పించిన సిఎం కెసిఆర్‌కు ,సహాకరించిన మంత్రులు కెటిఆర్, వి.శ్రీనివాస్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి తనకు అప్పగించిన బాధ్యతను, కర్తవ్యాన్ని చిత్తశుద్ధి,నిబద్ధతతో నిర్వహిస్తానని పేర్కొన్నారు.


# సొంతగడ్డపై ఢిల్లీని చిత్తుచేసిన చెన్నై సూపర్‌కింగ్స్

## 27 పరుగుల తేడాతో ఢిల్లీకేపిటల్స్ ఓటమి



చెన్నై: ఐపిఎల్ 2023 సీజన్‌లో 55వ మ్యాచ్ ఆసక్తికరంగా సాగింది. ముందు బౌలింగ్‌లో ఢిల్లీకేపిటల్స్ జట్టుసభ్యులు రాణించినా పోటీ జట్టు చెన్నై సూపర్‌కింగ్స్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ కేపిటల్స్ బౌలర్లకు చెక్‌పెట్టారు. స్పిన్‌కు అత్యంత సహకారిగా ఉన్న చేపాక్ స్టేడియంలో ఢిల్లీ బ్యాటర్లు కష్టపడాల్సిందే. చేపాక్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో బుధవారం టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 167 పరుగులుచేసింది. తదనంతరం బ్యాటింగ్‌చేపట్టిన ఢిల్లీకేపిటల్స్ ఎనిమిది వికెట్ల నష్టానికి 140 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీనితో సూపర్‌కింగ్స్ 27 పరుగులతో విజయం సాధించింది. చెన్నై బ్యాటర్లలో శివమ్‌దూబె 12 బంతుల్లో 25 పరుగులుచేసాడు. మూడు సిక్సర్లు కూడా రాబట్టాడు. రుతురాజ్‌గైక్వాడ్ 18 బంతుల్లో నాలుగుఫోర్లతో 24 పరుగులుసాధిస్తే అంబటిరాయుడు 17 బంతుల్లో 23 పరుగులు చేసాడు. ఒకఫోర్, మరోసిక్సర్‌కూడా సాధించాడు. చివరిలో జడేజా 16 బంతుల్లో 21 పరుగులుచేస్తే కెప్టెన్ కూల్ ధోనీ తొమ్మిది బంతుల్లో 20 పరుగులుచేసి మెరుపులు మెరిపించాడు. ఢిల్లీ బౌలర్లలో మిచెల్‌మార్ష్ మూడు వికెట్లు తీసి దుమ్మురేపాడు. అక్షర్‌పటేల్ రెండు వికెట్లతో సత్తాచాటాడు. ఖలీల్ అహ్మద్, లలిత్‌యాదవ్, కుదల్దీప్ యాదవ్‌లకు తలో వికెట్ దక్కింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చెన్నైకి ఢిల్లీ స్పిన్నర్లు సవాల్ విసిరారు. స్పిన్‌ఫ్రెండ్లీ పిచ్ చేపాక్‌లో చెన్నై ఓపెనర్లు ఆరంభంలో వ్యూహాత్మకంగా ఆడారు. వీలుచిక్కినపుడల్లా బౌండరీలు బాదారు. కాన్వే యాంకర్‌రోల్ కొనసాగించాడు. రుతురాజ్ గైక్వాడ్ దూకుడుగా ఆడాడు. అయితే ఇద్దరి జోరుకు అక్షర్‌పటేల్ బ్రేకులువేసాడు. 10 పరుగులుచేసిన దేవాన్ కాన్వేను ఎల్బీగా ఔట్‌చేసి మొదటి వికెట్ సాధించాడు. దీనితో 32 పరుగులవద్ద తొలివికెట్ కోల్పోయిన చెన్నై సూపర్‌కింగ్‌స ఆకాసేపటికే రుతురాజ్‌గైక్వాడ్ ఔట్ అవడంతో చెన్నైకు షాక్ తగిలింది. ఈసారికూడా చెన్నైని అక్షర్‌పటేల్ దెబ్బతీసాడు. 24 పరుగులుచేసిన రుతురాజ్ అక్షర్‌బౌలింగ్‌లో అమన్‌కి క్యాచ్ ఇచ్చి ఔట్ అయ్యాడు. దీనితో 49 పరరుగులవద్ద రెండో వికెట్‌ను చెన్నై నష్టపోయింది. ఇక మొయిన్ ఆలీ కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు.ఏడు పరుగులుచేసిన ఆలీని కుల్దీప్ యాదవ్ పెవిలియన్ బాటపట్టించాడు. దీనితో 64 పరుగులవద్ద మూడో వికెట్ కూడా నష్టపోయింది. రహానె కూడా 21 పరుగులుచేసి లలిత్‌యాదవ్ బౌలింగ్‌లో క్రీజును వీడాడు. 77 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన చెన్నైని శివమ్‌దూబె ఆదుకున్నాడు. ఈ పవర్ హిట్టర్ సిక్సర్లతో కాసేపు చెన్నై స్పిన్నర్లను భయపెట్టాడు. మూడు సిక్సర్లసాయంతో 12 బంతుల్లోనే 25పరుగులుచేసాడు. రాయుడుతో కలిసి ఐదో వికెట్‌కు 36 పరుగుల కీలక భాగస్వామ్యం నిర్మించాడు. అయితేప్రమాదకరంగా మారుతున్న శివమ్ దూబేను మిచెల్ మార్ష్ ఔట్‌చేసాడు. దీనితో 113పరుగులవద్ద ఐదో వికెట్ నష్టపోయింది. తర్వాత క్లాసీషాట్లతో కాసేపు అలరించిన రాయుడిని ఖలీల్‌అహ్మద్ ఔట్‌చేసాడు. ఖలీల్ బౌలింగ్‌లో 23పరుగులుచేసినరాయుడు రిపల్ పటేల్‌కు క్యాచౌట్ అయ్యాడు. అయితే చివరిలో దోనీ జడేజా మెరుపులు మెరిపించారు. ఇద్దరిధాటికి చెన్నై సూపర్‌కింగ్స్‌మంచి స్కోరుసాధించింది. లక్ష్యఛేదనలో ఢిల్లీకేపిటల్స్ 140 పరుగులకే పరిమితం అయింది. ఢిల్లీ జట్టు బ్యాటర్లలో రిలీ రుస్సో 37 బంతుల్లో 35 పరుగులుచేసాడు. మనీష్ పాండే 29 బంతుల్లో 27 పరుగులుచేస్తే చివరిలో అక్షర్‌పటేల్ 12 బంతుల్లో 21పరుగులుసాధించి మెరుపులు మెరిసినా అప్పటికే ఓటమి ఖరారయింది. చెన్నై బౌలర్లలో పతిరణ మూడు వికెట్లతో దుమ్మురేపాడు దీపక్ చాహర్ చెరో రెండు వికెట్లతో సత్తా చాటాడు. రవీంద్రజడేజా ఒక వికెట్ సాధించాడు. ఢిల్లీకేపిటల్స్‌లో ఆదిలోనే కెప్టెన్ వార్నర్ డకౌట్ అయ్యాడు. ఖాతా తెరవకుండానే తొలివికెట్‌ను ఢిల్లీనష్టపోయింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్‌కాసేపు మెరిసాడు. రెండు సిక్సర్లు ఒకఫోర్‌సాయంతో 11 బంతుల్లోనే 17 పరుగులుచేసాడు. అయితేప్రమాదకరంగా మారుతున్న సాల్ట్‌ని దీపక్‌చాహర్ ఔట్‌చేసాడు. కాసేపటికే మిచెల్‌మార్ష్ ఐదుపరుగులకే ఔట్ అయ్యాడు. దీనితో 25 పరుగులకే మూడు వికెట్లుకోల్పోయిన ఢిల్లీకి కష్టాలు కొనసాగాయి. ఈసమయంలోనే ఢిల్లీని మనీష్, రుస్సోలు ఆదుకున్నారు. ఇద్దరూ 50 పరుగులకుపైగా భాగస్వామ్యం తెచ్చారు. మనీష్‌ను చెన్నై బౌలర్ మతీషా పతిరణ బ్రేకులువేసి పెవిలియన్‌కు పంపించాడు. మనీష్ 29 బంతుల్లో 27 పరుగులు చేసాడు. తర్వాత రిలీ రుసో కూడా ఔట్ అయ్యాడు. రుసోను జడేజా ఔట్‌చేసాడు. 89 పరుగులవద్ద ఐదు వికెట్లుకోల్పోయింది. క్రమేపీ చేయాల్సినరన్‌రేట్ పెరుగుతూ పోయింది. చివరిలో అక్షర్‌పటేల్ మెరుపులు మెరిపించినా అప్పటికే ఢిల్లీకి ఓటమి తేలిపోయింది. 12 బంతుల్లో 21పరుగులుచేసిన అక్షర్‌ను పతిరణ ఔట్‌చేసాడు. చివరి రెండు ఓవర్లలో చెన్నై 48పరుగులుచేయాల్సినపరిస్థితి వచ్చింది. చివరి రెండు ఓవర్లుకూడా చెన్నై బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఢిల్లీకి ఓటమి తప్పలేదు.

## ఎస్ఎస్‌సి ఫలితాల్లో సత్తా చాటిన బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్స్ విద్యార్థులు




ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే10: ఎస్ఎస్‌సి-2023 ఫలితాల్లో రాష్ట్ర వ్యాప్తంగా బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్స్ విద్యార్థులు తమ సత్తా చాటారు. 1890 విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 99శాతం ఉత్తీర్ణత సాధించారు. 117 మంది 10జిపిఏ సాధించగా 612 మంది ఏ1 గ్రేడు, 408 మంది ఏ1 2 గ్రేడు, మిగిలిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులందరికీ బ్రిలియంట్ విద్యా సంస్థల చైర్మన్, ఎమ్మెల్సీ కశిరెడ్డి నారాయణరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ విద్యాసంస్థలలో విద్యనభ్యసించి గత 37 సంవత్సరాలుగా ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలిచారు. అలాగే, ఈ సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన ఈ విద్యార్థులు కూడా ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ ప్రసాద్‌రావు, ప్రధానోపాధ్యాయురాలు వేణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఎస్ఎస్‌సి-2023 ఫలితాల్లో నారాయణ స్కూల్స్ విజయదుందుభి!


**అన్ని బ్రాంచీల సీఓ విద్యార్థుల్లో 17.5శాతం విద్యార్థులకు 10/10 జి.పి.ఏ.**

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే10: తెలంగాణ ఎస్ఎస్‌సి-2023 ఫలితాల్లో నారాయణ హవా కొనసాగింది. ఎప్పటిలాగే నారాయణ విద్యార్థులు తమ ప్రతిభతో పైచేయి సాధించారు. నారాయణ సీఓ విద్యార్థుల్లో 17.5శాతం,ఒలింపియాడ్ విద్యార్థుల్లో 10.1శాతం ఓవరాల్ స్కూల్స్ నుంచి 9శాతం మంది విద్యార్థులు 10/10 జి.పి.ఏ సాధించి రికార్డ్ సృష్టించినట్లు నారాయణ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్స్ డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు. అదే విధంగా జి.పి.ఏ. ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులు 2101, 9.0 జిపిఏ ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులు 2342 ఉన్నారని పేర్కొన్నారు. అదే విధంగా నారాయణ సీఓ-స్కూల్స్ ఓవరాల్ జిపిఏ 10కిగాను 9.4, పాస్ పర్సంటేజ్ 99శాతం,100 ఉత్తీర్ణత సాధించిన బ్రాంచీలు 46శాతంగా ఉన్నట్లు తెలిపారు. మాథ్స్,సైన్స్,సోషల్ సబ్జెక్టులలో 11468 మంది విద్యార్థులు ఏ గ్రేడ్ పాయింట్స్ సాధించారని తెలిపారు. అదే సమయంలో రాష్ట్ర,జాతీయ, అంతర్జాతీయ పోటీ పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను తమ రోజు వవారి సిలబస్‌లో భాగంగా బోధించటం ద్వారా నారాయణ విద్యార్థులుఅంతర్జాతీయ స్థాయిలోఅత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. నారాయణ సీఓ-స్పార్క్,ఒలింపియాడ్, ఈ-టెక్నో,మెడిస్పార్క్ ప్రోగ్రామ్స్‌తో బోధన చేయటం కారణంగానే ఘన విజయాలను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఎగ్జామ్స్ అన్ని ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నందున నారాయణ సంస్థ కూడా తన విద్యార్థుల కోసం స్కూల్ స్థాయి నుంచే ఆన్‌లైన్ ఎగ్జామ్స్‌పై శిక్షణ అందించేందుకు ఎన్-లెర్న్ ప్లాట్ ఫామ్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ ప్లాట్ ఫామ్‌లో ముఖ్యంగా అంశాలవారీగా, అధ్యాయాల వారీగా పాఠ్యాంశాలపై పట్టు కోసం పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి అంశంపై అవగాహన కోసం ప్రత్యేకంగా రూపొందించిన యానిమేటెడ్ వీడియో మాడ్యూల్స్ ఉంటాయన్నారు. సంక్లిష్టమైన అధ్యాయాల్లో అవగాహన కోసం లోతైన విశ్లేషణతో కూడిన మాడ్యూల్స్‌ను అందించనున్నట్లు వివరించారు. అలాగే పరీక్షా సమయంలో ఆందోళనకు గురయ్యే విద్యార్థుల కోసం దిశ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఏదేని కారణం చేత విద్యార్థులు ఒత్తిడికి గురై ప్రవర్తనలో విపరీతమైన మార్పులు వచ్చినట్లయితే వారి కోసం ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించి,. వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించటమే దిశ ప్రోగ్రామ్ లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులను నారాయణ సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.పునీత్ ప్రత్యేకంగా అభినందించారు.

# ఓఆర్ఆర్ లీజ్‌పై సిబిఐ విచారణకు మేము సిద్ధం: సుధీర్‌రెడ్డి

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే10: నెహ్రూ ఔటర్ రింగ్‌రోడ్డు లీజ్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేసిన ఆరోపణల్లో నిజం లేదని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ విషయంలో కిషన్‌రెడ్డి డిమాండ్ చేసినట్టుగా తాము సిబిఐ విచారణకు సిద్దంగా ఉన్నామని వెల్లడించారు. కిషన్‌రెడ్డి సిబిఐ విచారణకు సిద్ధమేనా ప్రశ్నించారు. ఆదానీ వ్యవహారాలపై జేపీసీ వేయని వారు సిబిఐకి డిమాండ్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పూణేలో లీజ్‌కు తీసుకున్నవారే ఇక్కడ లీజ్‌కు తీసుకున్నారని ఆయన వివరించారు.

బుధవారం ఆయన మరో ఎమ్మెల్యే కెపి వివేకానందతో కలిసి టిఆరెసెల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఓఆర్ఆర్ నిర్వహణ లీజ్ కాంట్రాక్ట్ విషయంలో బిజెపి చేసిన ఆరోపణల్లో పసలేదన్నారు.




## యుకె పర్యటనకు బయలుదేరిన మంత్రి కెటిఆర్

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే10: తెలంగాణ రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు ఆకర్శించే లక్ష్యంతో తెలంగాణపరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు బుధవారం ఉదయం యుకెకు బయలుదేరారు. ఈనెల 13వ తేదీ వరకు ఆయన పర్యటనను కొనసాగించనున్నారు. యుకెలోని పారిశ్రామిక దిగ్గజ సంస్థలతో పాటు వ్యాపార వాణిజ్య సంఘాలతో సమావేశం అవుతారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పెట్టుబడుల అనుకూల వాతావరణాన్ని వివరిస్తారు.

# నందమూరి బాలకృష్ణ మూవీలో అర్జున్ రాంపాల్....



గాడ్ ఆఫ్ మాసెస్ నటసింహ నందమూరి బాలకృష్ణ, బ్లాక్‌బస్టర్ దర్శకుడు అనిల్ రావిపూడి మోస్ట్ అవైటెడ్ మాస్, యాక్షన్‌ఎంటర్‌టైనర్ ఎన్‌బికె 108లో పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటించనున్నారు. డెడ్లీ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ ప్రెస్టీజియస్ ప్రాజెక్టును షైన్‌స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీష్ పెద్ది భారీఎత్తున నిర్మిస్తున్నారు.. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తోంది.. ఈచిత్రంలో శ్రీలీల కీలకపాత్రలో కన్పించనుంది.. ఇపుడు ఓ పవర్‌ఫుల్ పాత్ర కోసం బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్‌ను తెరపైకి తీసుకొచ్చారు. అనౌన్స్‌మెంట్ వీడియోలో అర్జున్ రాంపాల్, బాలకృష్ణ లెజెండ్ చిత్రంలోని ఫ్లూటు జింక ముందు ఊదు..సింహ ం ముందు కాదు. అనే పాపులర్ డైలాగ్ చెప్పారు.. ఇందులో అర్జున్ రాంపాల్ అనిల్‌రావిపూడి మధ్య సంభాషణ కూడ ఉంది.. అర్జున్ రాంపాల్ ఈసినిమాతో బాలీవుడ్‌లో అరంగేట్రం చేస్తున్నారు.. హైదరాబాద్‌లో జరుగుతున్న షెడ్యూల్‌లోసినిమా షూటింగ్‌లో జాయిన్ అయ్యా రు. బాలకృష్ణ, అర్జున్ రాంపాల్ లను కలిసి తెరపై చూడటం ఆసక్తికరంగా ఉండబోతోంది.. ఉగాది సందర్భంగా బాలకృష్ణ నురెండు డిఫరెంట్ లుక్‌లో ప్రజెంట్ చేస్తూ మేకర్స్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఎన్‌బికె 108కి థమన్ సంగీతం అందిస్తున్నారు. విజయదశమి కానుకగా థియేట్రికల్ విడుదల కానుంది.

# ఆర్.నారాయణమూర్తి 'యూనివర్సిటీ'

స్నేహ చిత్ర పిక్చర్స్ బ్యానర్‌లో పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రంయూనివర్సిటీ.. ఈచిత్రంసెన్సార్ పూర్తిచేసుకుంది.. ఈనెల 26న తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్‌కానుంది.. ఈసందర్భంగా ప్రసాద్ ల్యాబ్స్‌లో చిత్రాన్ని ప్రదర్శించారు.. అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ చైరన్మన్ అల్లం నారాయణగారు, శ్రీనివాస్, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీచైర్మన్ ఘంటా చక్రపాణి, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ . ప్రొఫెసర్ కోయి కోటేశ్వరరావు, తెలుగు ఫిలిం జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ



వారణాసి, తెలుగు ఫిలింజర్నలిస్టు అసోసియేషన జనరల్ సెక్రటరీ వైజె రాంబాబు పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రముఖ పత్రికా సంపాదకుడు శ్రీనివాస్ మాట్లాడుతూచరిత్రలో జరిగిన సంఘటనలు ఇపుడు జరుగుతున్నవి చాలా గుర్తుకవస్తాయని, విద్య, వైద్య రంగంలో ఉన్న సమస్యలను కళ్లకు కట్టినట్టు సినిమాగా తీశారన్నారు. మన వ్యవస్థలో ఇలాంటి సంఘటనలు జరుగుతూ ఉన్నాయని, కానీ మనం వ్యతిరేకించలేకపోతున్నామని అన్నారు. నారాయణమూర్తిలాంటి వారు మాత్రమే ఇలాంటి సినిమాలు తీయగలరని అన్నారు. ఈసినిమా ఘనవిజయం సాధించాలని అన్నారు.. ఆర్ నారాయణ మూర్తి మాట్లాడుతూ, పేపర్ లీకేజ్ వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లోనేకాదు యావత్‌భారతదేశంలో చాలా దారుణంగా జరుగుతున్నాయని అన్నారు. గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లోకూడజరిగాయని అన్నారు. మరి నిరుద్యోగులు ఏమైపోవాలన్నారు. విద్య, వైద్యం రెండు జాతీయం చేయాలని అనిచెప్పేది నా యూనివర్సిటీ సినిమా అన్నారు. లీకేజీల సమస్యలను జాతీయ సమస్యగా పరిగణించాలని రాష్ట్రపతి, ప్రధానికి విజ్ఞప్తిచేస్తున్నామని అన్నారు. ఈనెల26న ఈచిత్రం రిలీజ్ కానుందని తెలిపారు. సినిమాను ప్రేక్షకులు ఆదరించాలని కోరుతున్నానని అన్నారు.

# తేజ దర్శకత్వంలో 'అహింస'



వెండితెరపై వైవిధ్యమైన ప్రేమకథలను ఆవిష్కరించి ఘన విజయాలను సాధించిన క్రియేటివ్ జీనియస్ తేజ, అభిరామ్ అరంగేట్రం చేస్తున్నయూత్‌ఫుల్ లవ్, యాక్షన్ ఎంటర్‌టైనర్ అహింస.. తో ప్రేక్షకులముందుకు రాబోతున్నారు.. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై పి.కిరణ్ ఈచిత్రాన్ని నిర్మిస్తున్నారు.. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ మెటీరియల్ సినిమాపై చాలా క్యూరి యాసిటీని పెంచాయి.. తాజాగా ఈచిత్రం రిలీజ్ డేట్‌ను ప్రకటించారు.. ఈచిత్రాన్ని జూన్ 2న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నారు.. ఈసందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో అభిరామ్‌లుక్ ఆకట్టుకుంది.. ఈచిత్రానికి ఆర్పీ పట్నాయక్ సంగీతం అందిస్తున్నారు..

# 'అంతం కాదిది ఆరంభం'

క్రసెంట్ సినిమాస్ ,కృష్ణ ప్రొడక్షన్స్ సంయుక్తంగా కొత్త దర్శకుడు ఇషాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం అంతం కాదిది ఆరంభం... పవర్‌ఫుల్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈచిత్రాన్ని ప్రభు పాల్‌రాజ్ ,సిరాజ్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.తాజాగా ఈచిత్రం మోషన్‌పోస్టర్‌ను దర్శకుడు దశరథ్‌ఆవిష్కరించారు.. అనంతరం ఆయన మాట్లాడారు. తమిళనాడులోని పొల్లాచ్చిలో జరిగిన వాస్తవ సంఘటన ఆధారంగా ఈసినిమా తెరకెక్కిందన్నారు.. అమ్మాయిలను ట్రాప్ చేసి, వాళ్ల నగ్న వీడియోలను వాట్సాప్ గ్రూపుల్లో షేర్‌చేసిన వ్యక్తిని బాధిత అమ్మాయిలు ఎలా పట్టుకున్నారు అనేది ఈచిత్రం కథ అన్నారు. ఇపుడు సమాజంలో జరుగుతునన కరెంట్ ఇన్సిడెంట్స్ బేస్ చేసుకుని తీశారని అన్నారు. సిరాజ్‌తో చాలా కాలం మంచి పరిచయం ఉందని,టైటిల్ బాగుందని అన్నారు. టీంకు ఆల్‌ది బెస్ట్ అన్నారు. నిర్మాతసిరాజ్ మాట్లాడుతూ, సూపర్‌స్టార్‌కృష్ణగారి మీద అభిమానంతో మా సినిమాకు ఈ టైటిల్ పెట్టామన్నారు.. ఎక్కడా రాజీపడకుండా సినిమాను తీశామన్నారు.. మహిళలపై అత్యాచారాలకి పాల్పడే వారికి ఈ చిత్రం ఓ మెసేజ్ ఇస్తుందన్నారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్నవాస్తవ సంఘటనల ఆధారంగా హీరో కం దర్శకుడు ఇషాన్ చిత్రాన్ని చాలా చక్కగా తెరకెక్కించారని అన్నారు. త్వరలోనే చిత్రానికి సంబంధించిన వివరాలను తెలియజేస్తామ న్నారు. సంగీత దర్శకుడు వినోద్‌యాజమాన్య, లిరిక్ రైటర్ రాంబాబు, గోసాల, హీరోయిన్లు శక్తి మహేంద్రా,




నిష్మా, షేర్‌స్టూడియో అధినేత దేవీప్రసాద్, గీతాసింగ్, ఖాదర్ గౌరీ, వైష్ణవి నాగమధు తదితరులు పాల్గొన్నారు.

# ధనుష్ 'కెప్టెన్ మిల్లర్' విశేషాలు



నేషనల్ అవార్డు గ్రహీత, సూపర్‌స్టార్ ధనుష్‌భారీ పీరియాడికల్ మూవీ 'కెప్టెన్ మిల్లర్'.. 1930-40 నేపథ్యంలోప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈచిత్రం ధనుష్ కెరీర్‌లోనే హయ్యస్ట్ బడ్జెట్ మూవీగా రూపొందుతోంది.. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్నారు. .ఈచిత్రం సత్యజ్యోతి ఫిలింస్ బ్యానర్‌పై టిజి త్యాగరాజన్ సమర్పణలో సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు.. ఈచిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, సందీప్‌కిషన్, ప్రియాంక అరుళ్ మోహన్, నివేదితా సతీష్ తదితరులు నటిస్తునానరు.. భారీ తారాగణం అత్యున్నత సాంకేతిక నిపుణులు పనిచేస్తున్న ఈచిత్రం ఇప్పటికే స్టన్నింగ్ మేకింగ్ విజువల్స్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది.. తాజాగా మేకర్స్ అప్‌డేట్‌తో వచ్చారు. ఫస్ట్ లుక్, టీజర్ రిలీజ్ టైంను ప్రకటించారు.. ఫస్ట్‌లుక్ జూన్‌లో, టీజర్‌ను జూలైలో విడుదల చేయనున్నారు. ఈసందర్భంగా విడుదలచేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లోచేతిలో పెద్దగన్ పట్టుకుని యుద్ధభూమిలో నడుస్తూ వెళ్లటం టెర్రిఫిక్‌గా ఉంది.. జివి ప్రకాష్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు. తమిళ, తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది.



న్యూ ఫొటోషూట్ శ్రద్ధాకపూర్

# సుధీర్‌బాబు 'హరోం హర'

సుధీర్ బాబు పాన్‌ఇండియా చిత్రం హరోం హర.. సెహరిఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో ఎస్ఎస్‌సి(శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్) బ్యానర్‌పై సుమంత్ జినాయుడు నిర్మిస్తున్నారు. కాగా సుధీర్‌బాబు పుట్టినరోజు జరుపుకోనున్నారు. అడ్వాన్స్ విషెస్ తెలియజేస్తూ మేకర్స్ ఫస్ట్ ట్రిగ్గర్ వీడియోను విడుదల చేశారు.. రేడియోలో వాతావరణం రిపోర్ట్‌తోవీడియో



ప్రారంభమవుతుంది.. కొంతమంది వ్యక్తులుతమ చేతుల్లో ఆయుధాలతో వస్తారు.. అతని ముఖరం కన్పించనప్పటికీ సుధీర్‌బాబు కుర్చీల కూర్చొని చేతిలోతుపాకీ పట్టుకుని కన్పిస్తారు. చివరగా అతని తుపాకీ నుంచి ఫస్ట్ ట్రిగ్గర్ విడుదల అవుతుంది. ఇందులోసుధీర్‌బాబు కుప్పం యాసలో అదరగొట్టారు.. మాండలికం, అతని వాయిస్ బేస్ పాత్రకు ఇంటెన్స్ తెస్తుంది.. సుధీర్‌బాబు సినిమా కోసం పూర్తిగా మేకోవర్ అయ్యారు. ఫస్ట్ ట్రిగ్గర్ యాక్షన్‌తో నిండిఉంది.. సినిమాపై ఆసక్తినిమరింత పెంచింది. హరోం హర.. కథ 1989లో చిత్తూరు జిల్లా కుప్పంలో జరుగుతుంది.. గ్లింప్స్ ద్వారా ఈ ఏడాది డిసెంబర్ 22న క్రిస్మస్ సెలవుల సందర్భంగా హరోం హర ను విడుదలచేస్తామని మేకర్స్ తెలిపారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ మూవీ పాన్‌ఇండియా విడుదల కానుంది.

**అక్కినేని నాగచైతన్య, వెంకట్‌ప్రభు తెలుగు, తమిళ చిత్రం కస్టడీ...కృతిశెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. శ్రీనివాసా సిల్వర్‌స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస చిట్టూరి భారీస్థాయిలో నిర్మిస్తున్నారు.. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును పవన్‌కుమార్ సమర్పిస్తున్నారు.. మే 12న ఈచిత్రం ప్రేక్షకులముందుకు రాబోతోంది. ఈసందర్భంగా నిర్మాత శ్రీనివాస చిట్టూరి మీడియాతో మాట్లాడారు.**

**అందరూ మన దర్శకుల వైపు చూస్తుంటే మీరు బ్యాక్‌టు బ్యాక్ ఇద్దరుతమిళ దర్శకులను ఇక్కడకు తీసుకొచ్చారు?**

మన దర్శకులు కూడ బాగా బిజీగా ఉన్నారు కదా.. అందరికీ రెండు మూడు సినిమాలు ఉన్నాయి.. గ్యాంబ్లర్ సినిమా నుంచి వెంకట్ ప్రభుతో సినిమాచేయాలని ఆనుకున్నారు.. తన స్క్రీన్‌ప్లే ఆలోచించే విధానం నాకు చాలా ఇష్టం.. ఎంత పెద్ద సీరియస్ ఇష్యూని కూడ మంచి స్క్రీన్‌ప్లేలోఎంటర్‌టైన్‌మెంట్‌గా చెప్పగలరు.



# నాగార్జునగారికి 'శివ' ఎలాగో.. చైతుకు 'కస్టడీ' అలా..

**ఒక నిర్మాతగా ఇందులో మీకు ఆకర్షించిన అంశాలు ఏంటి?**

కథ, మంచి స్క్రీన్‌ప్లే ,తెలుగు ప్రేక్షకులకు నచ్చే ఎమోషన్స్, ఎంటర్‌టైన్‌మెంట్‌తో సీరియస్‌కథ ఉంటుంది.. సీరియస్‌లో కూడ ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది.. ఈ రెండింటినీ దర్శకుడు మిక్స్ చేసిన విధానం నాకు బాగా నచ్చింది.. తెలుగు ఎమోషన్స్‌తోఒక హాలీవుడ్ సినిమాచూసిన అనుభూతి కలుగుతుంది.

**తెలుగులోఎక్కువగా కమర్షియల్‌ని ఇష్టపడతారు. తమిళ్‌లో 'రా' సెన్సిబిలిటీ వేరుగా ఉంటుంది.. ఈ రెండింటినీ ఎలా బ్యాలెన్స్ చేశారు?**

మీరు చెబుతున్న రా, సెన్సిబుల్, కమర్షియల్ అన్నీ ఇందులో ఉంటాయి.

**రెండు భాషల్లో వేర్వేరు నటులు కన్పిస్తారా?**

తెలుగులో వెన్నెల కిశోర్‌గారు ఉన్నారు.. ఆ పాత్రని తమిళ్‌లోప్రేమ్‌జీ చేశారు. ఆ ఒక్కపాత్రలోమార్పు ఉంటుంది. మిగిలినవి యాజిటీజ్.

**కస్టడీ కథలోపోలీసు వ్యవస్థ గురించి ఉంటుందా?**

ఇది నిజాయితీ గల ఒక కానిస్టేబుల్ కథ. రూరల్ పోలీసుస్టేషన్‌లోని ఒక కానిస్టేబుల్ కథ. యాక్షన్‌తోపాటు ఫ్యామిలీఎమోషన్స్ ఉంటాయి

**ఇద్దరు మ్యూజిక్ డైరెక్టర్లను పెట్టటానికి గల కారణం?**

ఇది 90లో జరిగే కథ.. ఇలాంటి సినిమాకు నేపథ్య సంగీతం ఇళయరాజాగారు ఉంటే బావుంటుందని ఆయన్ని తీసుకోవటం జరిగింది.. కథ వినగానే ఇళయరాజాగారు, యువన్‌మేం చేస్తామని ముందుకు రావటం నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది.

**మీ సినిమాలకు ఇంగ్లీషు పేర్లు పెట్టటానికి గల కారణం?**

ప్రత్యేకంగా అలా ఏమీ లేదండి. .కథకు తగ్గట్టుగా కుదిరాయి.. ఈసారి మాత్రం చక్కని తెలుగు టైటిల్‌తోవస్తున్నాం.

**కస్టడీ ఎన్ని థియేటర్లలో విడుదల కానుది?**

తెలుగులో నాగచైతన్య గారి కెరీర్‌లోనే హయ్యస్ట్ థియేటర్లలోరిలీజ్ అవుతుంది. తమిళనాడులో 200 థియేటర ్లకు పైగా విడుదల కాబోతోంది.

**అవుట్ పుట్ చూశాక ఏ స్థాయి సినిమా అవుతుందని భావిస్తున్నారు?**

చైతన్యగారి కెరీర్‌లోనే హయ్యస్ట్ ఫిల్మ్అవుతుంది.. నాగార్జునగారి కెరీర్‌లో 'శివ' ఎలా గుర్తుండిపోయిందో నాగచైతన్య కెరీర్‌లోకస్టడీ అలా గుర్తుండిపోతుంది.. శివ సినిమానే కాదు అందులో పాత్రలుఎలా గుర్తుండిపోతాయో కస్టడీలోని అరవింద్‌స్వామి, శరత్‌కుమార్, ప్రియమణి పాత్రలు గుర్తుండిపోతాయి.. ప్రతి పాత్ర యూనిక్‌గా ఉంటుంది.

**కస్టడీ 2 ఉంటుందా?**

కచ్చితంగా ఉంటుంది.. సక్సెస్ అవుతుందనే నమ్మకంతో చెబుతున్నాను.

**రామ్-బోయపాటి సినిమా గురించి చెప్పండి?**

షూటింగ్ కంటిన్యూగా జరుగుతోంది.. రామ్‌గారి బర్త్‌డేకి టీజర్‌ను విడుదల చేస్తాం.

**నాగార్జున సినిమా సంగతులు?**

జూన్ నుంచి షూటింగ్ ఉంటుంది.. పూర్తివివరాలు త్వరలో చెబుతాం.. అలాగే నాగచైతన్యతో మరోసినిమా చేయాలి

# 'భువన విజయమ్' యూనిక్ కంటెంట్

సునీల్ శ్రీనివాస్‌రెడ్డి,వెన్నెల కిశోర్, ధనరాజ్ ప్రధాన పాత్రల్లో నూతన దర్శకుడు యలమంద చరణ్ దర్శకత్వంలో హిమాలయ స్టూడియో మాన్షన్స్, మిర్త్ మీడియా బ్యానర్లపై కిరణ్ విఎస్సే నిర్మిస్తున్న చిత్రం భువన విజయమ్.. ఈచిత్రం ప్రమోషనల్ కంటెంట్‌కు మంచి స్పందన వస్తోంది.. టీజర్, ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచాయి... మే 12న ఈచిత్రం విడుదల కాబో



తోంది.. ఈనేపథ్యంలోచిత్ర యూనిట్‌ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది.. దర్శకుడు యలమంద చరణ్ మాట్లాడుతూ, ఈసినిమా ప్రయాణంలో నాతోనడిచిన అందరికీ కృతజ్ఞతలు అన్నారు. రాయలవారు భువన విజయ చక్రవర్తి మా చిత్రానికి మాత్రం మా నిర్మాతే అసలైన చక్రవర్తి అన్నారు. ఎక్కడా రాజీపడకుండా ఈచిత్రాన్ని నిర్మించారని అన్నారు. నా మొదటి చిత్రానికే గొప్ప నటీనటులతో కలిసి పనిచేసే అదృష్టం నాకు దక్కిందన్నారు. ఈవిషయంలోమా నిర్మాతకు కృతజ్ఞతలు అన్నారు. ఈచిత్రం కోసం అద్భుతమైన సెట్ వేయటం జరిగిందన్నారు. ప్రపంచంలో ప్రతి మనిషి గుర్తింపు కోరుకుంటాడని,ఆ గుర్తింపు గెలుపుతోనే వస్తుందన్నారు. ప్రతి మనిషి గెలుపు కోసమే పరిగెడతాడని, అయితే భువన విజయమ్ ఓడి గెలిచినవాడి కథఅన్నారు. గెలిచిన వాళ్లు ఓడిపోయిన వాళ్లని గెలిపించిన కథ అన్నారు. అదే ఈ భువన విజయమ్ అన్నారు.. ఇందులో కామెడీ, ఫాంటసీ, థ్రిల్స్ అన్నీ ఉంటాయన్నారు. అందరినీ అలరిస్తుందని అన్నారు. కార్యక్రమంలోధనరాజ్, పృథ్వీ, తదితరులుమాట్లాడారు.

# పంజా వైష్ణవ్‌తేజ్ మూవీలో అపర్ణాదాస్



స్టన్ ప్రకాశన్, మనోహరం, బీస్ట్‌వంటి సినిమాలతో మలయాళ, తమిళ సినీ పరిశ్రమల్లో తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ నటి అపర్ణా దాస్ పివిటి 04 చిత్రంతో తెలుగు తెరకు పరిచయం అవుతోది.. ఎంతో ప్రతిభ గల ఈ నటిని తెలుగుప్రేక్షకులకు పరిచయం చేస్తుండ టం పట్ల యూనిట్‌ఉత్సాహంగా ఉంది.. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ తో కలిసి ఈచిత్రాన్ని నిర్మిస్తోంది.. శ్రీకర స్టూడియోస్ సమర్పణ లో ఎస్. నాగవంశీ, ఎస్ సాయిసౌజనయ ఈచిత్రాన్ని నిర్మిస్తు పంజా వైష్ణవ్‌తేజ్, శ్రీలీల ,జోజుజార్జ్ ప్రధాన పాత్రలు పోషి స్తు న్నారు. ఈచిత్రంతో శ్రీకాంత్ ఎన్.రెడ్డి దర్శకుడి గా పరిచ యం అవుతున్నారు. పంజా వైష్ణవ్‌తేజ్ కెరీర్‌లోనాలుగో చిత్రం గా రూపొందుతున్న పివిటి04లో అపర్ణా దాస్ వజ్రా కాళేశ్వరి దేవి పాత్రను పోషిస్తున్నారు.. సినిమాకు ఎంతో కీలక మైన పాత్రలో నటిస్తున్న అపర్ణ తన అద్భుతమైన నటనా నైపుణ్యంతో పాత్రకు న్యాయం చేస్తుందని యూనిట్ విశ్వసిస్తోంది.. ప్రేక్షకుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా యూనిట్ పక్కా ప్రణాళికతో ఈచిత్రాన్ని రూపొందిస్తోంది.. అపర్ణ ఇటీవల తమిళంలో నటించిన దాదా ప్రేక్షకు లను మెప్పించ టంతోపాటు విమర్శకుల ప్రశంసలు అందుకుంది.. త్వరలో ప్రేక్షకులను అలరించటానికి సిద్ధమవుతోంది..

# సేంద్రియ సాగులో మహిళలను ప్రోత్సహిస్తూ..



**కష్టాల కొలిమిలోంచి వచ్చిన వాళ్లకే కన్నీటి విలువ తెలుస్తుంది. చిన్న వయసులో కుటుంబ బాధ్యతలు మోసిన సామల్ల శ్వేత.. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబా వ్యధని అర్థం చేసుకున్నారు. వాళ్లకు అండగా నిలిచారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి విశిష్ట మహిళా పురస్కారాన్ని అందుకున్న ఆమె తన ప్రయాణం గూర్చి తెలులుసుకుందాం..**

మాది సిద్ధిపేట దిగువ మధ్యతరగతి కుటుంబం. అమ్మ భారతమ్మ కూలీ. నాన్న కృష్ణ హమాలీ పని చేసేవారు. నాకో చెల్లి ఇద్దరు తమ్ముళ్లు, అమ్మానాన్నలు ఇద్దరూ పనులకు వెళ్తే చెల్లి, తమ్ముళ్లను నేను చూసుకునేదాన్ని ఇంటి పనుల్లో పడి.. పదో తరగతి ఫెయిల్ అయ్యా. దాంతో పెళ్లి చేద్దాం అన్నారు. అప్పుడు మా పెద్దమ్మ కొడుకు అడ్డుపడి మళ్లీ పరీక్ష రాసేలా చేశాడు. ఉపకార వేతనాలతో ఇంటర్ నెట్టుకొచ్చా. అమ్మకు తోడుగా చిన్నచిన్న పనులకు వెళ్తూ ఉండేదాన్ని. డిగ్రీ అయిపోయిన వెంటనే మా బాబాయి సిసిసి (కేరింగ్ సిటిజన్స్ కలెక్టివ్) అనే స్వచ్ఛంద సంస్థలో చేర్చారు. ఉద్యోగం దొరికిందని సంబరపడ్డా. నా మొదటి జీతం రూ. 4 వేలు.

**ఒక్కొక్కరిది ఒక్కో కథ...** 18 ఏళ్లకే పెళ్లి... పిల్లలు వ్యవసాయంలో వచ్చిన నష్టాన్ని భరించలేక భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకే లేనప్పుడు కోడలెందుకు అన్నారు అత్తింటివాళ్లు. ఆమెకు చావు తప్ప వేరే దారి లేదనుకున్నప్పుడు ఆవిడ దగ్గరకు వెళ్లి ధైర్యం చెప్పా, ఆర్థికంగా మా సంస్థ ఆదుకుంటుంది అని భరోసా ఇచ్చాను. ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వ్యవసాయం చేసి అప్పుల పాలయ్యారు. భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. అటు పుట్టింటికి ఇటు అత్తింటికి కాక మిగిలిపోయిందా మహిళ. ఈ పదేళ్లలో ఇలాంటి ఎన్నో కన్నీటి కథలు విన్నా. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను కనుక్కోవడం, వారిని పరామర్శించడం, ధైర్యం చెప్పడం, ఎక్స్‌గ్రేషియాకు ఎలా దరఖాస్తు చేసుకునేలా చూడటం ముఖ్యంగా పిల్లలు కూలి పనులకు వెళ్లకుండా బడులకు పంపేదాన్ని. చిన్నవయసులో భర్తను కోల్పోయిన వారితో పదోతరగతి పరీక్షలు రాయించేవాళ్లం. వాళ్లని కలిసి వారి బాగోగులు తెలుసుకునేటప్పుడు కళ్లల్లో నీళ్ల తిరిగేవి. కూలీనాలీ చేసుకుంటూ బతుకు బండిని లాగే ఆడవాళ్లే ఎక్కువ. చేసిన అప్పులు తీర్చడానికి పస్తులుండేవారు. వాటిని తీర్చలేక లైంగిక వేధింపులను ఎదుర్కొన్న వారూ ఉన్నారు. కొన్నాళ్లకు చేస్తున్న పనిమీద మమకారం పెరిగింది. ఏదో రకంగా సమాజానికి ఉపయోగపడుతున్నందుకు సంతోషం కలిగింది. మావారు అశోక్ కారు డ్రైవర్. ఉద్యోగం వదిలేసి అత్తగారి ఊరు జనగామకు వెళ్లిపోయా. ఆయన జీతంతో ఇల్లుగడవడం కష్టంగా ఉండేది. ఏడు నెలల తరువాత సిద్ధిపేటకు మకాం మార్చి పాత ఉద్యోగంలోనే చేరాను.

**సిసిసి మంచి నేలమ్మ...** ఒంటరిగా ఉన్న, సన్నకారు మహిళా రైతులు, ఆత్మహత్యలు చేసుకున్న బాధిత కుటుంబ సభ్యులను ఏకతాటిపైకి తేవాలనుకున్నా. వీళ్లందర్ని కలిపి నేలమ్మ అనే సంఘాన్ని ఏర్పాటు చేశాం. ఇది సిసిసి అధ్వర్యంలో నడిచే మరో సంస్థ 17 గ్రామాల్లో 202 మందిని ఒక సమూహంగా చేశాం.



వారి సమస్యలు వారే పరిష్కరిచుంకునేలా శిక్షణ ఇచ్చాం. బాధితులకు సాయం ఆలస్యం కాకూడదనే నేలమ్మ లక్ష్యం. నేలమ్మ ద్వారా స్థానికంగా మహిళలకు తరగతులు నిర్వహిస్తున్నాం. హక్కులను చెబుతున్నాం. ఆహార పదార్థాలు తయారు చేసేలా శిక్షణ ఇస్తున్నాం. పాడి సమకూరుస్తున్నాం. చుట్టుపక్కల దాదాపు 60 ఎకరాల్లో సేంద్రియ సాగు చేసేలా మహిళలను ప్రోత్సహిస్తున్నాం. వీటన్నింటికి చందాల ద్వారా వచ్చిన మొత్తాన్ని ఉపయోగిస్తున్నాం. ఒకప్పుడు ఆడపిల్లలని బరువుగా భావించేవారు. కానీ ఇప్పుడు మా అమ్మకు నేనే పెద్ద కొడుకుని, పెళ్లికి ముందు ఆడపిల్ల బయట తిరగడం ఏంటీ అనేవారు. పెళ్లి తరువాత ఆ పెత్తనాలేంటి అనేవారు. అనేవాళ్లు ఏం చేసినా అంటూనే అంటారు. మనం నిజాయితీగా ఉన్నప్పుడు అవేమీ పట్టించుకోకూడదు. నా సేవలకు మెచ్చి తెలంగాణ ప్రభుత్వం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విశిష్ట మహిళా పురస్కారాన్ని అందించడం చాలా సంతోషంగా అనిపించింది. కమ్యూనిటీ మొబైజర్ వృత్తిని ఎంచుకోవడం నా జీవితాన్నిలా మలుపు తిప్పుతుందని అనుకోలేదు. ❑

# పండ్లలో రారాజు మామిడి..



వేసవికాలం వచ్చిందంటే ఎప్పుడెప్పుడు మార్కెట్లోకి వస్తుందో అని ఎదురుచూసే పండు మామిడి పండు ఈ పండు తినడం వల్ల మన ఆరోగ్యానికి చాలా మంచి జరుగుతుంది. మామిడి పండును పండ్లలో రారాజుగా పిలుస్తారు.

- ఇందులో ఉండే పొటాషియం మరియు మెగ్నీషియం అధిక రక్తపోటు సమస్యను నివారిస్తుంది. విటమిన్ సి మరియు ఫైబర్ శరీరంలో హాని చేసే కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తాయి.
- మామిడి పండును తినడం వల్ల పంట నొప్పి, చిగుళ్ల సమస్యలు, చిగుళ్ల నుండి రక్తం కారడం వంటి సమస్యలు దూరమవుతాయి. నోటిలోని బ్యాక్టీరియా నశిస్తుంది. దంతలు శుభ్రపడతాయి. పంటిపై ఎనామిల్ కూడా ధృడంగా ఉంటుంది.
- మామిడిపండు మంచి జీర్ణకారి. ఇది అజీర్ణం మరియు అరుగుదల సరిగా లేకపోవడం వంటి జీర్ణ సంబంధిత సమస్యలను తగ్గిస్తుంది. మామిడి పండ్లను తీసుకోవడం ద్వారా సన్నగా ఉన్నవారు సహజవంతమైన బరువు పెరిగే అవకాశం ఉంది.
- దానిలో ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది. అందువల్ల రక్తహీనత సమస్యతో మామిడిపండ్లను తీసుకోవడం ద్వారా మంచి ఫలితాన్ని పొందవచ్చు. ఇందు లో ఉండే కాపర్ ఎర్ర రక్తకణాల వృద్ధికి దోహదపడుతుంది.
- ఈ పండులో వుండే విటమిన్లు, ఖనిజాలు గుండె జబ్బులు రాకుండా కాపాడుతుంది. వృద్ధాప్య సమస్యలను తగ్గిస్తుంది. చర్మపు ఆరోగ్యాన్ని పెంచుతుంది. మెదడుని ఆరోగ్యంగా ఉంచుతుంది. శృంగారంలో ఆసక్తిలేని వారికి శృంగార వాంఛ ను కలిగిస్తుంది.
- మామిడిపండు లో శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంచే బిటాకెరోటిన్ అనే పదార్థం సమృద్ధిగా ఉంది. ఇది మన శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంచి శరీరాన్ని బలోపేతం చేస్తుంది. ❑

# ముడిలో పూ మాలలు !








'జుట్టున్నమ్మ ఏ కొప్పు అయినా పెడుతుంది కానీ .. ఆ కొప్పున పెట్టే పూలను మాత్రం కాస్త వైవిధ్యంగా అమర్చి అందంగా మెరిసిపోవాలని తహతహలాడుతోంది ఈ తరం. అందుకేనేమో అమ్మ, అమ్మమ్మలు వేసుకునే ముడిని ఇష్టపడుతున్నారు. అక్కడితో ఆగితే ఎలా! ఒకప్పటి రెట్రో ట్రెండ్ జడ కింద నుంచి పూలను పెట్టుకునే శైలిని అనుసరిస్తున్నారు. మల్లె, గులాబీ..వంటి పూలతో చేసిన ఈ మాలల్ని అడుగునుంచి అర్థభాగంలో అమర్చి మురిసిపోతున్నారు. వాటిని మీరూ చూసేయండి.











# వీటితో అలసట దూరం..

కొంత మంది మహిళలకు తరచుగా అలసట ఆవరిస్తుంది. చిన్న పని కూడా చేయలేనన్నట్లుగా శరీరం మొండికేస్తుంది. ఇటు వంటి సమస్య అందరు మహిళల్లో అప్పుడప్పుడు బయట పడుతుందంటున్నారు నిపుణులు. ఇది శారీరక, మానసిక అలసట కావొచ్చు అని చెబ తున్నారు.

**సమయం** : కొందరు ప్రతి నిమిషమూ విలువైనదిగా చూస్తారు. దాంతో తీరిక లేకుండా పని చేయడానికి ప్రాధాన్యం ఇస్తారు. ఇది శరీరం, మెదడు పైన తెలియని ఒత్తిడి కలిగిస్తుంది. అప్పుడే విరామం అవసరమని అర్థం చేసుకోవాలి. కాసేపు నిద్రకు సమయాన్ని కేటాయించి చూడండి.



**కలిసిమెలిసి..** కొందరు ఒంటరిగా ఉండటానికి ఇష్టపడతారు. దాంతో ఫోన్ వినియోగం ఎక్కువ. దీని ప్రభావం ఆకస్మాత్తుగా శరీరంలో శక్తి అంతా తగ్గిపోయినట్లుగా అనిపిస్తుంది. కుటుంబ సభ్యులతో గడిపితే మనసు తేలికవుతుంది.

**ఒత్తిడికి దూరంగా..** తెలియకుండానే మనసుని ఒత్తిడికి గురి చేస్తాం. అనవసర విషయాలకి ప్రాధాన్యం ఇస్తాం. ఇవన్నీ చెడు ప్రభావాన్ని కలిగిస్తాయి. ఏది ముఖ్యం అనే అవగాహన ఉంటే చాలు.

**ధ్యాన్యం..** రోజూ అనగంట సేపు చేసే ధ్యానం మనసును ప్రశాంతంగా మారుస్తుంది. ఉదయంపూట, అలాగే రాత్రి నిద్రపోయేముందు పది నిమిషాలు చేసే ధ్యానం మంచి నిద్రను తెచ్చి పెడుతుంది.

**అలవాటు ..** ప్రతి ఒక్కరికీ అభిరుచులు ఉంటాయి. చిత్రలేఖనం, పుస్తకపఠనం, క్రీడలు, మొక్కల పెంపకం వంటివెన్నో ఉంటాయి. వాటిలో మనసుకు నచ్చింది ఎందచుకొని రోజూ కొంత సమయాన్ని కేటాయించుకోవాలి. ఈ అలవాటు మనసుకు వ్యాయామంగా మారుతుంది.

**ప్రయాణం ..** కొత్త ప్రాంతాన్ని పర్యటించి రావడం లేదా బాల్యంలో తిరిగిన ప్రాంతాలను చూసిరావడం. ❑

## చెలి చిట్కా

ఉడికించిన బంగాళదుంప పొట్టుతో అద్దాలను రుద్దితే వాటిపై మరకలు తొలగి స్పష్టంగా కనిపిస్తాయి.

# స్పైసీ సలాడ్

**కావలసిన పదార్థాలు :** కీరా దోసకాయ-ఒకటి, వేరుశనగ పొడి-రెండు స్పూన్లు, మిరియాల పొడి-అరస్పూను, పచ్చిమిర్చి-ఒకటి, ఆవాల పొడి-2 స్పూన్లు, ఎండుకొబ్బరి - స్పూను, నిమ్మరసం-స్పూను, ఆలివ్‌నూనె-స్పూను, నల్ల నువ్వులు-అర స్పూను.

**తయారుచేసే విధానం :** ముందుగా కీరా చెక్కుతీసి ముక్కలుగా కత్తిరించాలి. గిన్నెలో కీరా ముక్కలు, వేరుశనగపొడి, మిరియాలపొడి, ఆవాల పొడి, పచ్చిమిర్చి ముక్కలు, ఎండుకొబ్బరి, ఆలివ్ నూనె, నిమ్మ రసం వేసి అన్నింటినీ బాగా కలిపితే జపనీస్ స్పైసీ కుకుంబర్ సలాడ్ సిద్ధం. ❑



# ఆమెలో న్యూరోటిజం లక్షణాలు!



డాక్టర్ ఎన్.బి.సుధాకర్‌రెడ్డి, సైకాలజిస్టు

**ప్రశ్న:** కొంత మంది అధికారులు, ఉద్యోగులు తమ బాధ్యతలు విస్మరించి ప్రవర్తిస్తుంటారు. కొందరు చట్టం, ధర్మం, మానవత్వం అనుసరించి వ్యవహరిస్తుంటారు. కొందరు స్వార్థంతో అవినీతి, అక్రమాలకు పాల్పడి ప్రజలకు ద్రోహం చేస్తుంటారు. అందరు మంచి విద్యార్హతలు కలిగి పోటీ పరీక్షలు రాసి ఉద్యోగంలోకి వస్తారు. ఉద్యోగ నిర్వహణకు అనుగుణంగా శిక్షణ పొందుతారు. అయితే వారి విధుల నిర్వహణలో ఒక్కొక్కరు ఒక విధంగా ఎందుకు వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదు. నేను ఇటీవల ఒక పనిమీద ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాను. అక్కడ అధికారి కొంత మెతక స్వభావికావడంతో మరొక విభాగం అధికారికి కీలక నిర్ణయాలు తీసుకునే బాధ్యతలు అప్పగించారు. మహిళ అయిన ఆ అధికారి మహిళలపట్ల చాలా చులకనగా ప్రవర్తిస్తున్నది. మాకు జరిగిన అన్యాయం గూర్చి ప్రశ్నిస్తే చాల చులకనగా జవాబు చెప్పింది. ఒక అర్జీరాసి ఇచ్చి వెళ్ళు, వారం తరువాత అన్నీ పరిశీలించి వివరాలు చెపుతానన్నది. మేడమ్ అన్ని మీకు అందించాను కదా పది నిమిషాలలో చదివి నిర్ణయం చెప్తుంది అని అడిగితే నీవేమిటి నాకు చెప్పేది అంటూ ఈసడించుకున్నది. గతంలో కొన్ని కోర్టులు ఇచ్చిన తీర్పుల ప్రకారం తనకు అన్యాయం జరిగితే కోర్టుకు వెళ్లవలసివస్తుందని చెప్పాను. అవసరమైతే అధికారుల మీద కూడ ఫిర్యాధు చేయక తప్పదని చెప్పాను. దీంతో ఆమె రెచ్చిపోయింది. తన భర్త పేరున్న లాయరని, అవసరమైతే నామీద, నాతో పాటు వచ్చిన నా భర్త మీద తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపిస్తానని బెదిరించింది. అధికారులతో వాదించడం వల్ల మనకే నష్టమని భావించి బయటికి వచ్చేశాను. అక్కడ మాకు తారసపడిన మరొక ఉద్యోగికి మాగోడు వెళ్ళ బోసుకున్నాము. ఆయన సావదానంగా విని, ఆ అధికారికి స్వార్థం,అహంకారం ఎక్కువని చెప్పారు. మా పనిని బట్టి కనీసం లక్ష రూపాయలు లంచం ఇవ్వనిదే పనిచేయదని చెప్పారు. ఆమెకు అంత డబ్బు ఇవ్వడం కంటే హైకోర్టులో రిట్ వేసి డైరెక్షన్స్ ఇప్పించుకోమని సలహా ఇచ్చారు. ఆయన సలహామేరకు హైకోర్టులో రిట్ వేసి మాకు అనుకులంగా డైరెక్షన్స్ ఇప్పించుకున్నాము. దీని కోసం మాకు పాతిక వేలు ఖర్చు అయింది. అయితే చట్టం, ధర్మం, రూల్సు, రెగ్యులేషన్స్ తెలిసిన కొందరు ఎందుకు ఇలా ప్రవర్తిస్తారో అర్థం కావడం లేదు. ఇలాంటి వారిని మార్చడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటే మంచిదో తెలుపగలరు.

- ఒక సోదరి, చిత్తూరు

**జవాబు:** అమ్మా, మీరు మంచి ప్రశ్నవేశారు. ఒకే రకమైన విద్యార్హతలు ఉండి, పోటీ పరీక్షలు రాసి, శిక్షణ పొందిన వారు అందరూ ఒక రకంగా విధులు ఎందుకు నిర్వహించడం లేదన్నదన్న దానికిచాలా కారణాలు చెప్పవచ్చు. అవినీతి, స్వార్థం, దురాశ, లంచగొండితనం లాంటివి పైకి కనిపించే కారణాలు అయితే వారి ప్రవర్తనకు మాత్రం వారి దృక్పథం వ్యక్తిత్వమే ప్రధాన కారణం. ఉదాహరణకు లంచం ఆశించినా ఇస్తే తీసుకుదాం, ఇచ్చినంత తీసుకుందాం, ఇవ్వకపోయినా పరవలేదనుకునేవారు కొందరు. బెదిరించి, భయపెట్టి ముక్కుపిండి వసూలు చేసేవారు కొందరు. నిజాయితీగా పనిచేసేవారు మరికొందరు. ఉద్యోగ ధర్మాల నిర్వహణలో వారు వ్యవహరించే తీరునుబట్టి ఐదు రకాలుగా వర్గీకరించారు. నిష్కపటులు, మనసాక్షితో పనిచేసేవారు, అనుభవంతో అంగీకరించేవారు, బహిర్ముఖులు, న్యూరోటిజం ప్రవర్తన కలవారు, మీకు ఎదురైన ఆమె న్యూరోటిజం ప్రవర్తన గల అధికారిగా తెలుస్తోంది. ఇలాంటి వారికి స్వీయ శ్రేయస్సు, కోపం, ఆవేశం, అసహనం, ఉద్వేగలోపాలు, ఆందోళన చెందే తత్వం ఉంటుంది. ఇలాంటి వారిలో డిప్రెషన్ లక్షణాలు కూడా ఒక్కోసారి కనిపిస్తుంటాయి. అయితే ఇది ప్రవర్తనా లోపం అని వారు గుర్తించరు. సరైన శిక్షణ, క్రమ శిక్షణ చర్యలు, కౌన్సెలింగ్‌తో వారిలో మార్పు తీసుక రావచ్చు. ❑

వ్యథ



# శక్తి నొసగుమా..

ఆధ్యాత్మికం





శ్రీమతి బాపత్ సాయిబాబాను సందర్శించింది. ఎనిమిది అణాలు దక్షణగా సమర్పించాలనుకుంది. ఆవిడ వద్ద డబ్బు ఉన్నది. మనసు మార్చుకున్నది. ఎనిమిది అణాలు ఎందుకులే, 4 అణాలు చాలు అనుకున్నది. సాయికి 4 అణాలు ఇచ్చింది. సాయి ఆమెతో 'మిగిలిన 4 అణాలు ఇవ్వక ఎందుకీ పేద బ్రాహ్మణుడిని మోసగిస్తావ్'? అన్నారు. ఆమె తన తప్పుకు సిగ్గుపడి మరో నాలుగు అణాలు సమర్పించింది. ధనము లేని సమయములో, సాయికి గాని ఎవరికి గాని దక్షణగా గాని, ధన సహాయము చేద్దామనిపిస్తుంది. కానీ, శక్తి ఉండదు. డబ్బు ఇవ్వ శక్తి ఉన్నప్పుడు, ఇచ్చే బుద్ధి ఉండదు (మనస్సు అంగీకరించదు) బాలాసాహెబ్ భాటే కుమార్తె జానకీబాయి తంప్లే. ఆమె భర్త మరణించాడు. ఆస్తికి వారసురాలయినది. ఆమె తండ్రి (ఆమె వివాహమునకు పూర్వము) షిరిడీకి చేరాడు సాయిని దర్శించాడు. ఇక ఉద్యోగం కూడా చేద్దామనిపించలేదు భాటేకు. జానకీబాయి తంప్లేకు ధనం వచ్చింది. తండ్రి భక్తిని చూచింది. సాయి మహత్తు ఆమెకు అవగతమే. ఆమకు ఉన్న స్థిర చిరాస్తులన్నీ సాయి సంస్థానానికి రాసి ఇచ్చింది. అది జనవరి 2వ తారీకు 1943. ఆమె కంటే చాలా ముందు రాధాకృష్ణమాయి సాయి సంస్థానాన్ని నెలకొల్పింది. ఎంతో సేవ చేసింది. ఆరతులు, చావడి ఉత్సవము ఆ మహనీయురాలి రూపకల్పనలే. రాధాకృష్ణమాయి తనువు చాలించింది. ఆమె మరణానంతరం ఆమె లేని లోటును తీర్చినది జానకీబాయి తంప్లే. ధనాన్ని సాయి పరం చేయటం ఒక మినహాయింపు. మరో విశేషం కూడా ఉన్నది. ఆమె సంస్థాన భోజన గృహాన్ని అత్యంత సమర్థవంతంగా నడిపించింది. దానినే సాయినాథుని సేవా మందిరంగా మార్చింది. ఆమె ఆరోగ్యముగా లేకున్నా, తన శరీరాన్ని సాయి భక్తుల కొరకు అరగతీసింది. వారికి ఆదర్శంగా తీసుకుని అందరూ ఏ కొంచెంగానైనా ఆచరించి చూపిస్తే చాలు, అదే పదివేలు. అప్పుడే మనకు సాయి ఆశీ స్సులు లభిస్తాయి. సాయి చెప్పినట్లు మనకున్న దానిలో కొంతైనా ఇతరులకు పంచి వారిని సంతోషపరిస్తే సాయి మనసు సంతోషపరుస్తాడు. బుద్ధి నొసగుమా! శక్తి నొసగుమా !!

- యం.పి.సాయినాథ్



# డీహైడ్రేషన్‌తో దినేష్‌కార్తీక్‌కు అస్వస్థత

**బెంగళూరు:** ముంబయి ఇండియన్స్ చేతిలో ఓటమి చవిచూసిన ఆర్సీబీజట్టుకు మరోషాక్ తగిలింది. ఆ జట్టులో ఫినిషర్ దినేష్‌కార్తీక్ అనారోగ్యం పాలయ్యాడు. ఐపిఎల్ మొదలైన ప్పటినుంచి డికె అంతగా ఫామ్‌లో లేడు. అయితే గత రెండుమ్యాచ్‌ల్లో కొంత టచ్‌లోకి వచ్చినట్లు కనిపించాడు. ముంబయితో మ్యాచ్‌లో మంచి ఇన్నింగ్స్ ఆడాడు.18 బంతుల్లోనే 30 పరుగులుచేసిన డీకే ఆర్సీబీ 199 పరుగులుచేయడంలో కీలకపాత్రపోషించాడు.

ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో ఔట్ అయి పెవిలియన్‌వెళ్లేసమయంలో డీకే తడబడ్డాడు. కిందకు వంగిపోయి ఇబ్బందిపడుతూ మైదానం వీడాడు. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్ ఆడలేదు. దీనితో అనూజ్‌రావత్ కీపింగ్‌చేసాడు. డీకే అనారోగ్యంపై ఫ్యాన్స్ కూడా కలత చెందారు. ఆర్సీబీ కోచ్ సంజయ్ బంగర్ స్పందిస్తూ బ్యాటింగ్‌చేస్తున్నప్పుడు డీకే డీహైడ్రేషన్‌కు గురయ్యాడని చెప్పాడు. ఆకారణంగానే ఆతడు అనారోగ్యం పాలయ్యాడని, క్రీజును వీడే క్రమంలో వాంతులు కూడా చేసుకున్నాడని వచ్చే మ్యాచ్‌సమయానికి ఆతడు రికవరీ అవుతాడనే భావిస్తున్నట్లు బంగార్ తెలిపాడు. మధ్యలో మూడునాలుగురోజుల గ్యాప్ ఉన్నందున మందులువాడి రికవరీ కాగలడని కోచ్ తెలిపాడు.

ఈసందర్భంగా సంజయ్ మాట్లాడుతూ యువ బ్యాటర్లు అవకాశాలు వినియోగించుకోవడం లేదన్నాడు. అనూజ్‌రావత్, షాబాజ్ అహ్మద్ వంటివారికి ఛాన్స్ ఇచ్చినా వాటిలో సక్సెస్ కాలేకపోతున్నారన్నాడు. వీరు రింకూసింగ్‌ను ఉదాహరణగా తీసుకోవాలని చెప్పాడు.

## వన్డే ప్రపంచకప్‌లో

# ఆసీస్‌తోనే భారత్‌పోరు!



### అక్టోబరు 5 నుంచి నవంబరు 18 వరకూ మ్యాచ్‌లు

**న్యూఢిల్లీ:** భారత్ వేదికగా జరుగనున్న వన్డేప్రపంచకప్‌కు సంబంధించిన పూర్తి షెడ్యూలును బిసిసిఐ రూపొందించింది. ఐపిఎల్ 2023 సీజన్‌ముగిసిన వెంటనే ఈషెడ్యూలును అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లండ్, రన్నరప్ న్యూజిలాండ్‌లమధ్య అహ్మదాబాద్‌లోనే నరేంద్రమోడీ స్టేడియం వేదికగా తొలిమ్యాచ్‌జరుగుతుంది. అక్టోబరు ఐదున ఈ మ్యాచ్‌తో వన్డేప్రపంచకప్‌కు శ్రీకారం జరుగుతుంది. నవంబరు 18న అహ్మదాబాద్ వేదికగానే ఫైనల్‌మ్యాచ్‌జరుగుతుంది. ఇక భారత్ తన తొలిమ్యాచ్‌ను చెన్నైలోని చేపాక్ వేదికగా ఐదుసార్లు ఛాంపియన్ ఆస్ట్రేలి యాతో తలపడుతుంది. 13వ ఎడిషన్ వన్డే కప్‌లో మొత్తం 10 జట్లు పోటీపడతాయి. ఆసీస్‌తో తొలి పోరు అనంతరం భారత్ అక్టోబరు 15న పాకిస్థాన్‌తో తలపడుతుంది. మొత్తం పది స్టేడియంలను సిద్ధంచేసింది. అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, ధర్మశాల, ముంబై, మొహాలి, రాజ్‌కోట్, గౌహతి, రాయ్‌పూర్, హైదరాబాద్‌మైదానాలు ప్రపంచకప్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఇక వన్డేకప్ కోసం భారత్ వచ్చేందుకు పాకిస్థాన్‌సైతం అంగీకరించింది. మొత్తం పదిజట్ల మధ్య 48 మ్యాచ్‌లు జరుగుతాయి. ఎనిమిది జట్లు ఇప్పటికే మెగా టోర్నీకి అర్హత సాదించాయి. భారత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, న్యూజిలాండ్, ఆఫ్ఘనిస్తాన్ మెగా టోర్నీకి నేరుగా అర్హత సాధించగా మరోరెండుజట్లు క్వాలిఫయర్స్ ఆడి టోర్నీకి అర్హత సాధిస్తాయి. వెస్టిండీస్, శ్రీలంక, నేపాల్, యుఎఇ, ఐర్లాండ్, జింబాబ్వే, నెదర్లాండ్స్, ఒమన్, స్కాట్లాండ్ ల మధ్య ప్రపంచకప్ క్వాలిఫయర్స్ జరుగుతాయి.



# ఆస్కార్ విజేతలతో ధోనీ

**చెన్నై:** ఐపిఎల్ 2023 సీజన్‌లో ప్లే ఆఫ్స్ రేసులో పోటాపోటీగా ఆడుతు ఫైనల్ కప్పుకొట్టే లక్ష్యంతో ఉన్న చెన్నై సూపర్‌కింగ్స్ జట్టుకెప్టెన్ బుధవారం ఆస్కార్ విజేతలను కలుసుకున్నారు. డాక్యుమెంటరీ విభాగంలో ఎలిఫెంట్ విష్పరర్స్ చిత్రంలో కనిపించిన బొమన్, బెల్లీలతోపాటు దర్శకురాలు కార్తికి గోన్సాల్వేస్‌ను ధోనీ ప్రత్యేకించి కలుసుకుని ఆస్కార్ పురస్కారం లభించడం పట్ల వారిని అభినందించారు. ఈ సందర్భంగా ధోనీ జెర్సీ నెంబరు ఏడుతోను, వారి ప్రత్యేక పేర్లను ముద్రించి ఉన్న జెర్సీలను వారికి బహూకరించారు. చెన్నై సూపర్‌కింగ్స్ యాజమాన్య ప్రతినిధులు ధోనీని వీరికి పరిచయం చేసారు. విశిష్టసేవలకు పురస్కారం లభించిందని ఈసందర్భంగా ధోనీ వారిని అభినందించారు. అత్యంత అరుదైన వ్యక్తులను కలుసుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. వారితో ధోనీ దిగిన ఫోటోలను సిఎస్కే తన అధికారిక ట్విట్టర్‌లో షేర్‌చేసింది.

# కోహ్లీతో ఘర్షణను మళ్లీ రాజేస్తున్న హక్!

### సోషల్‌మీడియాలో వెక్కిరిస్తూ పోస్టు

**ముంబయి:** ఆర్సీబీ, లక్నోజట్లమధ్య జరిగిన వివాదం మళ్లీ రాజుకుంది. ఆర్సీబీ స్టార్‌ప్లేయర్ విరాట్‌కోహ్లీ, లక్నోజట్టు ఆటగాడు నవీన్ ఉల్‌హక్, మెంటార్ గంభీర్‌మధ్య తలెత్తిన ఘర్షణ తెలిసిందే. కోహ్లీమరిచిపోయినా ఆఫ్ఘన్ ఆటగాడు లక్నో జట్టు ప్లేయర్ నవీన్ ఉల్‌హక్ మాత్రం వదిలేలాలేడు. ఈనెల 1వ తేదీనుంచి వివాదం రాజుకుంటూనే ఉంది. వాంఖడే మైదానంలో ముంబయి బెంగళూరు జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లోనాలుగు బంతులు ఎదుర్కొన్న విరాట్‌కోహ్లీ ఒక్క పరుగు మాత్రమేచేసి క్యాచ్‌ఔట్ అయ్యాడు. ఆసమయంలో నవీన్ ఉల్‌హక్ సోషల్‌మీడియాలో విరాట్‌నుద్దేశించి పరోక్షంగా పోస్టుపెట్టాడు. తన ఇన్‌స్టాలో ఒకఫోటోను స్టోరీగా పెట్టాడు. ముంబయి, బెంగళూరు, మ్యాచ్‌ను తాను టివిలోచూస్తున్న దృశ్యాన్ని ఇన్‌స్టాలో పెట్టిన నవీన్ ఉల్‌హక్ స్వీట్ మ్యాంగోస్ అంటూ క్యాప్షన్ ఇచ్చాడు. ముంబయి ఇండియన్స్ గెలుపునకు చేరువైనపుడు కూడా నవీన్ ఉల్‌హక్ మరోపోస్టుపెట్టాడు. రౌండ్‌నబర్‌టీ అంటూ క్యాప్షన్ ఇచ్చాడు. ఈపోస్టులతో హక్ ఆర్సీబీకి, కోహ్లీకి కౌంటర్ ఇచ్చాడని ఫ్యాన్స్ భావిస్తున్నాడు. ఈ వివాదాన్ని మళ్లీ నవీన్ రాజేస్తున్నట్లు చెపుతున్నారు. అనవసరంగా రెచ్చగొట్టవద్దని కెరీర్‌లో తీవ్రంగా నష్టపోతావంటూ కోహ్లీఫ్యాన్స్ సోషల్‌మీడియాలో నవీన్‌ను హెచ్చరిస్తున్నారు.



# రోహిత్ ఔట్ పట్ల అంపైర్ల తప్పిదం!

**ముంబయి:** ఐపిఎల్‌సీజన్‌లో ముంబయి కెప్టెన్ రోహిత్‌శర్మ పరుగులు చేయనప్పటికీ తరచూ వార్తల్లో నిలుస్తున్నాడు. రోహిత్ ఔట్‌పై ఫీల్డ్ అంపైర్లు తీసుకుంటున్న నిర్ణయాలే అందుకు కారణం. గతనెల 30న రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో రోహిత్‌శర్మ బౌల్డ్ అయిన తీరు వార్తల్లోకివచ్చింది. సందీప్‌శర్మ వేసిన బంతి వికెట్లకు తాకిందని అంపైర్ ఔట్ ఇచ్చాడు. కానీ వికెట్‌కీపర్‌సంజూశాంసన్ స్టంప్స్‌కి చాలా దగ్గరగా ఉండటంతో గ్లౌజ్‌లు తాకే బెయిల్స్ కింద పడ్డాయని రోహిత్‌ఫ్యాన్స్ ఆరోపించారు. అందుకు ప్రతిగా ఐపిఎల్ వివరణ ఇచ్చింది. సందీప్ వేసిన బంతి తగలడంతోనే బెయిల్స్ కిందపడినట్లు స్పష్టంగా ఉన్న విడియోను ఐపిఎల్‌షేర్‌చేసింది. మళ్లీ ముంబయి, బెంగళూరు మ్యాచ్‌లోను ఇదే తరహా ఘటన జరిగింది. 200పరుగుల ఛేదనలో రెండో ఇన్నింగ్స్‌లో హసరంగ వేసిన ఆరో ఓవర్‌లో రోహిత్‌క్రీజ్ వదిలి ముందుకొచ్చి ఆడేందుకు ట్రైచేసాడు. బంతి బ్యాట్‌కు తగలకుండా బ్యాటర్‌ప్యాడ్‌కు తగిలింది. హసరంగా అప్పీల్‌చేయగా అంపైర్‌నాటౌట్‌గా ప్రకటించాడు. బైలర్ రివ్యూకు ఆసక్తిచూపించలేదు. కానీ ఆర్సీబీ కెప్టెన్ ఫాప్ డుప్లెసిస్‌మాత్రం రివ్యూ తీసుకున్నాడు. అల్ట్రాఎడ్జ్‌లో బంతి రోహిత్ బ్యాట్‌కు తగలకుండా నేరుగా ప్యాడ్‌కే తగిలినట్లు తేలింది. బాల్‌ట్రాకింగ్‌చేయగా బంతి వికెట్లను తాకినట్లు తేలడంతో థర్డ్ అంపైర్ ఔట్‌గా ప్రకటించాడు. రోహిత్ క్రీజునుంచి వచ్చిన దూరం చెక్‌చేయకుండా బంతి వికెట్లకు తాకిందని గుడ్డిగా ఔట్ ఇచ్చారని రోహిత్‌ఫ్యాన్స్ మండిపడ్డారు. ఐసిసి నిబంధనలమేరకు స్టంప్స్ నుంచి మూడు మీటర్లకంటే ముందుకువస్తే ఎల్బీడబ్ల్యు ఛాన్స్ లేదు. బెంగలూరు మ్యాచ్‌లో రోహిత్ స్టంప్స్ నుంచి మూడు మీటర్లకంటే ఎక్కువదూరం వచ్చాడని, అక్కడే బంతి ప్యాడ్‌ను తాకిందని ఫ్యాన్స్ పేర్కొన్నారు. డిఆర్‌ఎస్‌లో దూరం చెక్‌చేయకుండా థర్డ్ అంపైర్ ఎలా డిసైడ్‌చేస్తాడని ఫ్యాన్స్ మండిపడ్డారు. రోహిత్ పరంగా అంపైర్లు తొందరపడ్డారని, అది ఔట్‌కాదని మహ్మద్‌కైఫ్, మునాఫ్ పటేల్‌వంటి మాజీలు కూడా పేర్కొన్నారు.


# ఐసిసి కొత్తమోడల్‌తో బిసిసిఐకి కాసుల పంట!



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ క్రికెట్‌మండలి(ఐసిసి) కొత్త మోడల్ ప్రకారం బిసిసిఐకి కాసుల వర్షం కురుస్తోంది. ఐసిసి సైకిల్‌లో ఏకంగా సాలీనా 230 మిలియన్ డాలర్లు అంటే మన లెక్కల్లో సుమారు 19వేల కోట్ల ఆదాయం రానున్నది. ఐసిసిలో మిగతా భాగస్వాములతోపోలిస్తే చాలా ఎక్కువ. ఐసిసికి వచ్చే 60 కోట్ల డాలర్ల ఆదాయంలో 38.5 శాతం బిసిసిఐకి దక్కుతుంది. వచ్చే ఐసిసి సైకిల్‌లో బిసిసిఐ ఏటా 230 మిలియన్ డాలర్లు అందుకుంటుంది. ఐసిసిలో బిగ్‌త్రీగా చెప్పే మూడు క్రికెట్‌బోర్డుల్లో బిసిసిఐ ఒకటి. మిగిలిన రెండు ఇంగ్లండ్‌క్రికెట్‌బోర్డు, క్రికెట్ ఆస్ట్రేలియాలున్నాయి. ఇవిరెండూ అంత లాభసాటి ఆదాయాలతో లేవు. ఇసిబి ఏటా 41.33 మిలియన్ డాలర్లు, క్రికెట్ ఆస్ట్రేలియా ఏటా 37.53 మిలియన్ డాలర్లుసంపాదిస్తున్నాయి. ఐసిసి కేవలం మీడియా హక్కులరూపంలోనే నాలుగేళ్లలో 3.2 బిలియన్ డాలర్లు సంపాదిస్తోంది. వీటిలో అత్యధికంగా భారత మార్కెట్లనుంచే వస్తుంది. నాలుగేళ్ల ఐసిసి సైకిల్‌కు డిస్నీ స్టార్ ఏకంగా మూడు బిలియన్ డాలర్లు చెల్లించింది. ఈమూడుబోర్డుల తర్వాత పాకిస్థాన్ క్రికెట్‌బోర్డుకు ఏటా 30 మిలియన్ డాలర్లు అందుతాయి. బిసిసిఐకి మొత్తంగా ఈనాలుగేళ్లలో 924 మిలియన్ డాలర్లు అందుతాయి. ఐసిసి సంపాదన మరింతపెరిగితే బిసిసిఐ సంపాదన సులువుగానే బిలియన్ డాలర్ల మార్కు దాటేస్తుంది. ఇంగ్లండ్‌బోర్డుతోపోలిస్తే బిసిసిఐ ఆర్జన 82శాతం ఎక్కువ. ఇసిబి నాలుగేళ్లలో 165 మిలియన్ డాలర్లే సంపాదిస్తుంది. అయితే కొత్త పంపిణీ నమూనాపై మిగిలిన బోర్డులు ఫీడ్‌బ్యాక్ ఇవ్వాల్సి ఉంది. ఆ తర్వాతనే కొత్తమోడల్ అమలుకువస్తుంది.

# సుప్రీంకు అదానీ-హిండెన్‌బర్గ్‌పై నిపుణుల కమిటీ నివేదిక

**వాషింగ్టన్, మే 10:** అదానీ గ్రూప్‌పై అమెరికాకు చెందిన హిండెన్ బర్గ్ సంస్థ చేసిన సంచలన ఆరోపణలపై సుప్రీంకోర్టుకు నిపుణుల కమిటీ తన నివేదికను సమర్పించింది. అదానీగ్రూప్ మారిషస్ కేంద్రంగా కంపెనీలను ఏర్పాటు చేసి, వాటికి నిధులు మళ్లింపు చేసిందని, మారిషస్ నుంచి తన షేర్లను కొనిపిస్తూ కృత్రిమంగా వాటి ధరలు పెంచుకుంటూ పోయిందని, ఖాతాల్లో అవకతవకలకు పాల్పడిందని, రిలేటెడ్ పార్టీ లావాదేవీలను దాచిపెట్టిందంటూ హిండెన్‌బర్గ్ ఎన్నో సంచలన ఆరోపణలు చేసింది. అంతేకాకుండా తన ఆరోపణలకు మద్దతుగా ఓ నివేదికను విడుదలచేసింది. దీంతో అదానీ గ్రూపు షేర్లు యేడాది గరిష్టాల నుంచి 70శాతం వరకు పడిపోయి, తర్వాత కొంత కోలుకున్నాయి. హిండెన్‌బర్గ్ సంచలన ఆరోపణలు, అదానీ షేర్ల పతనం నేపథ్యంలో కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో హిండెన్‌బర్గ్ ఆరోపణలపై నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు సెబీని ఆదేశించింది. ఇందుకు రెండు నెలల గడువు ఇచ్చింది.



అలాగే సమాంతరంగా నిపుణులతో మరో కమిటీని నియమిస్తూ మార్చి 2న ఆదేశాలు జారీచేసింది. ఈ ఆరోపణల్లోని నిజా నిజాలపై నివేదిక సమర్పించాలని కోరింది. సెక్యూరిటీస్ చట్టం ఉల్లంఘనలు జరిగాయా, అదానీ గ్రూప్ విషయంలో నియంత్రణ సంస్థ వైఫల్యం ఉందా? ఇన్వెస్టర్లలో అవగాహన పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించాలని ఆదేశించింది. దీంతో నిపుణుల కమిటీ తన నివేదికను సీల్డ్ కవర్‌లో ఈ నెల 8న సుప్రీంకోర్టుకు సమర్పించింది. చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ఈ నెల 12న ఇది విచారణకు రానుంది. మరోవైపు అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ సంస్థ చేసిన ఆరోపణల్లో వాస్తవాలను తేల్చేందుకు తమకు మరో ఆరు నెలల సమయం ఇవ్వాలంటూ సెబి సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీనిపై సుప్రీం కోర్టు విచారించాల్సి ఉంది.

# వాణిజ్యం

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, మే 10:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిసాయి. రోజంతా లాభనష్టాల మధ్య ఒడుదుడుకులకు గురైనప్పటికీ, చివర్లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు లాభాల్లోకి మళ్లాయి. ఓ వైపు ఆకర్షణీ య త్రైమాసిక ఫలితాలు, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కలిసొచ్చినా, మరోవైపు అమెరికా ద్రవ్యోల్బణ గణాంకా లు వెలువడనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటించారు. దీంతో చివరికి సెన్సెక్స్ 179 పాయింట్లు పుంజుకొని 61,940.20 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 45.80 పాయింట్లు పెరిగి 18,311.80 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ 8.199 రూపాయలుగా ఉంది. ఇండస్ ఇండ్ బ్యాంకు, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టాటా మోటార్స్, బజాజ్ ఫైనాన్స్, ఎన్‌టిపిసి వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. ఇన్ఫోసిస్, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, సన్‌ఫార్మా, ఎల్‌అండ్‌టి వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి.




# బులియన్ మార్కెట్ కళకళ

**ముంబై, మే 10:** బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ వారం ప్రారంభం నుండి పెరుగుతున్న బంగారం ధరల దూకుడు తగ్గడం లేదు. బుధవారం 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.250, 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.280 మేర పెరిగింది. దీంతో హైదరాబాద్‌లో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.56,950, 10 గ్రాముల 24 క్యారెట్ల ధర రూ.62,130 వద్ద ట్రేడవుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.57,100, 10 గ్రాముల 24 క్యారెట్లు



రూ.62,280 వద్ద కొనసాగుతోంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.56,950 వద్ద, 24 క్యారెట్ల ధర రూ.62,130 వద్ద ట్రేడవుతోంది. బెంగళూరులో 10 గ్రాముల 22 క్యారెట్ల ధర రూ.57వేలు, 24క్యారెట్లు రూ.62,180 వద్ద ట్రేడవుతోంది. విశాఖపట్నం, విజయవాడ, చిత్తూరు, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, రాజమండ్రి, కాకినాడలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.56,950, 10 గ్రాముల 24 క్యారెట్ల ధర రూ.62,130గా ఉంది. కోల్‌కతాలో 10 గ్రాముల 22 క్యారెట్ల ధర రూ.56,950, 10 గ్రాముల 24 క్యారెట్ల ధర రూ.62,130 వద్ద కొనసాగుతోంది. చెన్నైలో 22క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.57,420, 24 క్యారెట్లు రూ.62,640 వద్ద కొనసాగుతోంది.

# గో ఫస్ట్ దివాలా పిటిషన్‌కు ఎన్‌సిఎల్‌టి ఆమోదం

**ముంబై, మే 10:** ప్రముఖ విమానయాన సంస్థ గోఫస్ట్ దాఖలు చేసిన స్వచ్ఛంద దివాలా పరిష్కార ప్రక్రియ కోసం దాఖలు చేసిన పిటిషన్‌ను నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ స్వీకరించింది. జస్టిస్ రామలింగం సుధాకర్, జస్టిస్ ఎల్ఎన్ గుప్తా నేతృత్వంలోని బెంచ్ ఈ మేరకు బుధవారం కీలక ఆదేశాలు వెలువరించింది. దివాలా పరిష్కారకర్తగా అభిలాష్ లాల్‌కు కంపెనీ నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. వాడియా గ్రూప్‌నకు చెందిన గోఫస్ట్ స్వచ్ఛంద దివాలా పిటిషన్‌పై విచారణ జరిపిన ఎన్‌సిఎల్‌టి, మే 4న ఆదేశాలు రిజర్వ్ చేసింది. త్వరితగతిన విచారణ జరపాలన్న విజ్ఞప్తి మేరకు తాజాగా తీర్పు వెలువరించింది. గోఫస్ట్ చేయాల్సిన చెల్లింపులపై మారటోరియం విధించింది. అలాగే డైరెక్టర్ల బోర్డును సస్పెండ్ చేసింది. దివాలా పరిష్కార ప్రక్రియలో ఐఆర్‌పికి సాయమందించాలని సూచించింది. పరిష్కార ప్రక్రియ సమయంలో ఏ ఒక్క ఉద్యోగినీ తొలగించకూడదని ఆదేశించింది.




ఎన్‌సిఎల్‌టి తీర్పును గోఫస్ట్ సిఇఒ కౌశిక్ కోనా స్వాగతించారు. ఈ ఆదేశాలను ఓ మైలురాయిగా చెప్పారు. అమెరికాకు చెందిన ప్రాట్ అండ్ విట్నీ సంస్థ సకాలంలో ఇంజిన్లు సరఫరా చేయకపోవడం వల్ల తమ విమానాలు నిలిచిపోయాయని, తద్వారా ఆర్థికంగా నష్టం తలెత్తిందని గోఫస్ట్ వెల్లడించిన విషయం విదితమే.

# టైర్ల తయారీ కంపెనీలకు భారీ లాభాలు!

**ముంబై, మే 10:** ప్రస్తుత యేడాది జనవరి-మార్చి త్రైమాసికంలో దేశీయ టైర్ల తయారీ సంస్థలు మెరుగైన లాభాలను సాధించాయి. తక్కువ రబ్బరు ఖర్చులు, భారత వాహన మార్కెట్లో అమ్మకాలు ఊపందుకోవడం వంటి అంశాలు కలిసొచ్చాయని కంపెనీలు తెలిపాయి. అంతేకాకుండా కంపెనీ మార్జిన్‌లను పెంచుకునేందుకు ఉత్పత్తుల ధరలు పెంచడం కూడా గణనీయమైన లాభాల వృద్ధికి కారణమని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడ్డాయి. సమీక్షించిన మార్చి త్రైమాసికంలో అపోలో టైర్స్ లాభాలు 4 రెట్లు వృద్ధితో రూ.113 కోట్ల నుంచి రూ.427 కోట్లకు పెరిగాయి. 2023 మొదటి మూడు నెలల్లో ఎంఆర్ఎఫ్, సియట్ వంటి



ఇతర దేశీయ టైర్ కంపెనీలకు కూడా లాభాలు తెచ్చిపెట్టాయి. సియట్ టైర్స్ లాభాలు ఐదు రెట్లు పుంజుకోగా, ఎంఆర్ఎఫ్ లాభం రెండింతలు పెరిగింది. గతేడాది మార్చి త్రైమాసికంతో పోలిస్తే టైర్ల తయారీలో వినియోగించే ముడి పదార్థాల ధరలు దాదాపు 11.2 శాతంతగ్గడంతో ఆదాయం 12శాతం పెరిగి రూ.6,247 కోట్లకుచేరుకుందని అపోలో టైర్స్ వెల్లడించింది. ఇటీవల కాలంలో కంపెనీ ఖర్చులు 5.6శాతం పెరిగాయి. ఇక అపోలో టైర్స్ ఒక్కో షేర్‌కు రూ.4 తుది డివిడెండ్‌ను ఇచ్చేందుకు కంపెనీ బోర్డు సిఫార్సు చేసింది.

# ఐపిఒకు జెఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రా

**ముంబై, మే 10:** గతకొన్ని నెలలుగా దేశీయ స్టాక్ మార్కెట్లలో ఐపిఒలు అడపదడప కనిపిస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో తాజాగా జెఎస్‌డబ్ల్యూ గ్రూప్ కంపెనీ కూడా తన ఐపిఒను మార్కెట్లో ఫ్లోట్ చేయాలని చూస్తోంది. జెఎస్‌డబ్ల్యూ గ్రూప్‌కు చెందిన జెఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఐపిఒ ప్రారంభించడానికి కేపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబి వద్ద డిఆర్‌హెచ్‌పి దాఖలు చేసింది. ఈ కంపెనీ పోర్టుల వ్యాపారంలో కొనసాగుతోంది. సజ్జల్ జిందాల్ నేతృత్వంలోని ఈ కంపెనీ ఐపిఒ ద్వారా 2,800 కోట్ల రూపాయలనుసమీకరించాలని నిర్ణయించింది. ఒక్కో షేరును రూ.2 ముఖ విలువతో ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. జెఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థాపిత కార్గో హ్యాండ్లింగ్ కెపాసిటీ, హ్యాండిల్ చేయబడిన




కార్గో వాల్యూమ్‌లలో వృద్ధిపరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న పోర్ట్ సంబంధిత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీల్లో ఒకటిగా ఉంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యంపరంగా దేశంలో రెండవ అతిపెద్ద వాణిజ్య పోర్ట్ ఆపరేటర్‌గా కంపెనీ కొనసాగుతోంది.

# చిప్ వ్యాపారంపై వేదాంత ఫోకస్..

**ముంబై, మే 10:** వేదాంత లిమిటెడ్ తన సెమీకండక్టర్ వ్యాపారానికి సలహాదారుగా టెర్రీ డాలీని నియమించినట్లు ప్రకటించింది. దేశంలో అత్యాధునిక సెమీకండక్టర్ ఫ్యాబ్ యూనిట్, సెమీకండక్టర్ అసెంబ్లింగ్ అండ్ టెస్టింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి వ్యూహాత్మక సలహాలు, ఇన్‌పుట్‌లను అందించేందుకు ఈ నియామకం దోహదపడనుంది. టెర్రీ డాలీ నియామకంపై




వేదాంత-ఫాక్స్‌కాన్ సెమీకండక్టర్స్ లిమిటెడ్ సిఇఒ డేవిడ్ రీడ్ సంతోషం వ్యక్తం చేశారు. శాంసంగ్‌తో అధునాతన సాంకేతికతపై వ్యూహాత్మక కూటమిని స్థాపించడంతో, ఐబిఎం మైక్రోఎలక్ట్రానిక్స్ వ్యాపారాన్ని కొనుగోలు చేయడంలో టెర్రీ కీలక పాత్ర పోషించారు. డాలీ ఐబిఎంలో 26 సంవత్సరాల పాటు పనిచేశారు. ఈ క్రమంలో కంపెనీలో అనేక హోదాల్లో సేవలు అందించారు. ఐబిఎం కంపెనీలో చేరడానికి ముందు టెర్రీ అమెరికా ఆర్మీలో అధికారిగా ఐదు సంవత్సరాల పాటు సేవలు అందించారు. ఆయన వెస్ట్ పాయింట్‌లోని యుఎస్ మిలిటరీ అకాడమీ నుంచి ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీతో గ్రాడ్యుయేట్, ఫ్లెచర్ స్కూల్ ఆఫ్ లా అండ్ డిప్లొమసీ, టఫ్ట్స్ విశ్వవిద్యాలయం నుంచి అంతర్జాతీయ సంబంధాలలో మాస్టర్స్ డిగ్రీని పూర్తిచేశారు. సెమీ కండక్టర్ పరిశ్రమ నుంచి నాయకులను ఆకర్షించడానికి వేదాంత ప్రపంచ వ్యాప్తంగా దూకుడుగా టాలెంట్ అక్విజిషన్ డ్రైవ్ నిర్వహిస్తోంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/21-22 **Air Surcharge:** Delhi : 40 Ps.